# కథామంజరి

## పది కథల సమాహారం



## దీపావళి ప్రత్యేక సంచిక

నవంబర్ 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**నవంబర్ 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 11

శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీకి,

దీపావళి ప్రత్యేక సంచికకి ఆర్థిక సహకారం అందించినవారు

భారతీయ స్టేట్ బ్యాంక్ లో ఛీఫ్ జనరల్ మేనేజర్ గా రిటైరయి ప్రస్తుతం

North Eastern Financial Development Corporation Ltd.,

Chairman & Managing Director గా వ్యవహరిస్తున్న

## శ్రీ పి.వి.ఎస్.ఎల్.ఎన్. మూర్తి గారు.

వారికి మా హృదయపూర్వక

## కృతజ్ఞతలు



# కథామంజరి

## శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక దీపావళి కథల పోటీ - 2023 ఫలితాలు

| | | |
|---|---|---|
| **ప్రథమ బహుమతి** | *ఆ ఇద్దరి కథ* | పి. చంద్రశేఖర ఆజాద్ |
| **ద్వితీయ బహుమతి** | *రాచనాగు* | సలీం |
| **తృతీయ బహుమతి** | *ఎదురుబదురు* | పెనుమాక నాగేశ్వరరావు |

### ప్రత్యేక బహుమతులు

1. చిక్కుముడి, మంగు కృష్ణకుమారి
2. గమ్యం వైపు గమనం, సి. వి. శాస్త్రి
3. కాలజ్ఞాని, డా. ఎం. సుగుణరావు
4. నది, అశోక్ ఆనంద్
5. సంస్కార వృక్షాలు, శింగరాజు శ్రీనివాసరావు
6. కాండ్రేగుల రామలచ్చం కొట్టుకాడ, పెనుమాక రత్నాకర్
7. ఈ మందిర మిటులుండునా, డా.దారల విజయకుమారి
8. హృదయం ఎక్కడున్నాది, వసుంధర
9. ముందడుగు. అప్పరాజు నాగజ్యోతి
10. ఆట, సమ్మెట ఉమాదేవి

### సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలు

1. ఆకాశానికి అక్షరం, శింగరాజు శ్రీనివాసరావు
2. దేవుడా ఏమి నీ కోరిక, విజయార్కె
3. నిన్ను దాటి చూడు, పి. వి. ఆర్. శివకుమార్
4. నెలవు, సి. యమున
5. పరిణితి, విజయ శ్రీముఖి
6. పసినికాయ, వాడపల్లి పూర్ణ కామేశ్వరి
7. పితృ ఋణం, సింహప్రసాద్
8. ప్రమీల, అశోక్ ఆనంద్
9. ఫ్లెక్సీ మీద బొమ్మ, డా. చెళ్ళపిళ్ళ సూర్యలక్ష్మి
10. బాబిగాడు, వై. జ్యోతిర్మయి
11. ఎంత పని చేశావ్ నరసింహ..! డా. సన్నిహిత్
12. అధర్మ చరిత్ర, రాఘవేంద్రరావు నల్లబతి
13. దాంపత్య రహస్యం, వి. రాజారామ్మోహన రావు
14. స్రవంతి, పెండ్యాల అరవింద్
15. హేప్ బౌ, ఎస్వీకే సంహితానాయుడు
16. స్వారోచిషవిలంబిత, భాగవతుల భారతి
17. ఫోనేలా వైరస్, ఎస్వీ కృష్ణ జయంతి

ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని, జయప్రదం చేసిన కథకులందరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. పోటీకి వచ్చిన కథలన్నిటిని అతి తక్కువ సమయంలో విశ్లేషణాత్మకంగా పరిశీలించి, విశేషంగా కృషిచేసి, వడపోత పోసి, సకాలంలో న్యాయనిర్ణేతకి అందచేయడానికి శ్రమించిన మా బృందం సభ్యులకూ, ఎన్నో ఇతర పనులతో బిజీగా ఉన్నా, మా అభ్యర్ధనను మన్నించిన న్యాయనిర్ణేత గార్కి, సదా మా కార్యక్రమాలకు వెన్నుదన్నుగా ఉంటూ, ఈ పోటీకి ఆర్థికబలాన్ని కూడా అందించిన శ్రీ పి వి ఎస్ ఎల్ ఎన్ మూర్తిగారికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము!

పోటీకి పంపిన ఇతర కథలని ప్రచురణకు స్వీకరించడం లేదని, ఆ విషయమై వేరేగా సమాచారం పంపటం లేదని, ఆయా కథకులు గ్రహించగలరు!

కథామంజరి బృందం

# మా జట్టు

సంపాదకుడు
**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త
**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం
**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నందూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం
**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం
**Harbinger Publishing**

బొమ్మలు
**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కోరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | | i |
| విశిష్ట అతిథి | | iii |
| కథా మార్గదర్శి | | v |
| కథా పరిచయం | | vii |
| వినదగునెవ్వరు చెప్పిన | | ix |
| కథాపుస్తక పరిచయం | | xiii |


## కథలు, వ్యాసాలూ


| | | |
|---|---|---|
| ఆ ఇద్దరి కథ | పి. చంద్రశేఖర ఆజాద్ | 1 |
| రాచనాగు | సలీం | 9 |
| ఎదురుబదురు | పెనుమాక నాగేశ్వరరావు | 17 |
| చిక్కుముడి | మంగు కృష్ణకుమారి | 25 |
| గమ్యం వైపు గమనం | సి. వి. శాస్త్రి | 31 |
| కాలజ్ఞాని | డా. ఎం. సుగుణరావు | 35 |
| నది | అశోక్ ఆనంద్ | 39 |
| సంస్కార వృక్షాలు | శింగరాజు శ్రీనివాసరావు | 44 |
| సముద్రం | డా. పాపినేని శివశంకర్ | 49 |
| చిచ్చుబుడ్డి | వాసిరెడ్డి సీతాదేవి | 57 |

దీపావళికి కథామంజరి నిర్వహించిన కథల పోటీ దిగ్విజయంగా ముగిసింది! గడిచిన పది నెలల కాలంలో మాకు వచ్చిన కథల సంఖ్య కంటే వందరెట్లు ఎక్కువగా కథలు ఈ పోటీకి వచ్చాయి. ఈ పోటీకే కాదు.. "పోటీలు" అన్న ప్రకటనకే స్పందన ఎక్కువగా కనబడుతోంది. పోటీ కథ అంటే... 'సీరియస్‌గా ఉండాలా' అనే ఓ సంశయం, ఓ వాదం సహజంగా కనబడుతుంది. ప్రత్యేకించి హాస్య, సరస, సాహస... వంటి సూచనలతో కథల పోటీలు నిర్వహిస్తే.. ఆయా అంశలతో రచించే కథలే పంపాలి. కాని ఏ సూచనలు లేకుండా కథల పోటీలు నిర్వహిస్తే, ఎటువంటి కథైనా పోటీకి పంపవచ్చు. అయితే.. పోటీకి పంపే కథలలో ఏదో ఒక ప్రత్యేకత కనబడాలి. పాఠకుడ్ని ఆసాంతం చదివించగలగాలి, కదిలించాలి, ఆలోచింపచేయగలగాలి, మనసుని రంజింపచేయగలగాలి... ఇవే పోటీలకి అర్హతలు అని కథామంజరి భావిస్తుంది! అలా కథలు ఆకట్టుకునేటప్పుడు... సహజంగానే పోటీ ప్రకటనలో పొందుపరిచిన కొన్ని నిబంధనలలో వెసులుబాటు కల్పించబడుతుంది. కారణం ఒక్కటే... మంచి కథ నిలబడాలి, పదికాలాల పాటు ఆ కథ అలరించాలి, పదిమందిని ఆకట్టుకోవాలి! ఆ కోవలో ఆలోచించే... కథామంజరి ఓ పోటీ అలాగా, ఇంకో పోటీ ఇలాగా నిర్వహిస్తుంది. న్యాయనిర్ణేతల విషయంలో కూడా లబ్ధప్రతిష్టులైన సాహితీవేత్తల సహాయం తీసుకుంటూ, ఒకే మూసలో కథలు ఎంపిక కాకుండా, ఆకట్టుకునే కథలు వచ్చేలా పోటీలు నిర్వహిస్తున్నాం! అందుకే వడపోతలు ఎక్కువగానే చేస్తాం. ప్రతీ కథ మీద మా బృందం విశ్లేషణ కూడా చేస్తారు. చివరిగా న్యాయనిర్ణేతకి ఎంపిక కోసం పంపుతాం. వారి ఎంపికతో బాటు వారి అభిప్రాయం కూడా అడిగి తెలుసుకుంటాం! ఇవన్నీ.. మంచి కథని పాఠకుడి అందించాలనీ, మంచి కథకులు చరిత్రలో నిలవాలనీ, వాటిని ఆబాలగోపాలం ఆదరించాలనీ... ఓ తాపత్రయం!!

ఈ కథాయజ్ఞంలో, విలువలున్న కథలకోసం తాపత్రయపడే మా బృందం, వందల్లో వచ్చే కథల వడపోత కార్యక్రమంలో.. కాలపరిమితిని దృష్టిలో పెట్టుకుని, ఈ పనినే దైనందిన కార్యక్రమంగా పెట్టుకుని, సమష్టిగా కృషి చెయ్యడం విశేషంగా భావిస్తాం!

ఇక కథల విషయానికొస్తే... ఎప్పుడూ మేం చెపుతున్నట్టే... వ్రాసే కథలన్నీ పోటీకి అర్హత ఉన్నవే అనే ఆలోచన నుంచి కథకులు బయటపడాలి... కనీసం కొందరైనా! పది వాక్యలు వ్రాసి, ఈ కథని పోటీకి స్వీకరించండంటూ పంపే కథల్నుంచి, కథకుండవలసిన కనీస లక్షణాలు కూడా లేకుండా పంపే కథలు... టైపు చేసిన కథను మరోసారి కూడా చదవకుండా తప్పుల తడకలతో పంపే కథలు, శీర్షికలు లేకుండా, కథకుల పేరు కూడా లేకుండా, హామీపత్రాలు లేకుండా చేరే కథల వరకు... ఎన్నెన్నో అనుభవాలను మూటకట్టుకుంటున్నాం! అయితే ఇవన్నీ కథల ఎంపిక విషయంలో పక్కన పెట్టి.. మంచి కథ కోసం తాపత్రయ పడుతున్నాం!

ఈ ప్రయాణంలో ఎన్నో తియ్యటి అనుభవాలు, అనుభూతులు, పెద్దలతో పరిచయాలు, కొత్తగా తెలుసుకుంటున్న ఎన్నో విజ్ఞాన విషయాలు.. చాలా సంతృప్తినిస్తున్నాయి! అవే కథామంజరిని ముందుకు నడిపిస్తున్నాయి!!

ఈ కథల పోటీలో న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ప్రఖ్యాత కథకులు, సాహితీవేత్త శ్రీ ఓలేటి శ్రీనివాసభాను గారికి... ఎంతో సాహితీ పనుల ఒత్తిడిలో కూడా సమయం చిక్కించుకుని, విశ్లేషణాత్మకంగా వివరించి బహుమతి కథలను ఎంపిక చేసినందులకు.. హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం!

ఈ కథలపోటీకి వారి శ్రీమతిపేర ప్రతీ సంవత్సరం బహుమతులు అందిస్తూ, నిర్వహించడానికి మాకు ప్రోత్సహిస్తున్న శ్రీ పి.వి.యస్.ఎల్.యన్. మూర్తిగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాం!

ఈసారి దీపావళి వేడుకలు చాలా ముందుగానే మీ ఇంట ఈ ప్రత్యేక సంచిక ద్వారా ప్రారంభం కావాలని ఆశిస్తూ ... అందరికి దీపావళి శుభాకాంక్షలు!

**సంపాదకుడు**






# విశిష్ట అతిథి



**డా. పాపినేని శివశంకర్**

"ఏడో తరగతి జరుగుతున్నప్పుడు, జ్ఞాపకశక్తి మీద స్కూల్లో పోటీ పెడితే, అందులో మొదటి బహుమతిగా "పిల్లల టాగూర్' అనే పుస్తకం ఇచ్చారు. అప్పుడు టాగూర్ అనే మహాకవి ఒకాయన ఉన్నారని తెలిసింది. తర్వాత రోజుల్లో ఓసారి మా మాష్టారు, గీతాంజలిలోని "వేర్ ది మైండ్ ఈజ్ విత్ అవుట్ ఫీయర్" అనే గేయం గురించి అద్భుతంగా పాఠం చెప్పారు. అది విని, బాగా ప్రభావితుడ్నై... ఆ సాయంత్రం మా ఊర్లో ఉన్న గ్రంథాలయంకి వెళ్ళి, ఆ గీతాంజలి పుస్తకం తీసుకుని అర్థమయినా లేకపోయినా సరే, చదివాను. అలా సాహిత్యం మీద అభిలాషకి అంకురార్పణ జరిగింది!" అంటూ.. తన సాహితీ ప్రస్థానం గురించి ముచ్చటిస్తుంటే... ఎవరైనా సరే చాలా ఆశక్తితో చేతులు కట్టుకుని, అధ్యాపకుడి ముందు ఓ విద్యార్థిలా కూర్చుండిపోతారు. అలా తనకున్న అనంతమైన పరిజ్ఞానాన్ని అధ్యాపకుడిగా అందించడమే కాకుండా, రచనాశక్తితో అద్భుతంగా అర్ధ శతాబ్దంగా అక్షర సేద్యం చేస్తున్న, డెబ్బై వసంతాల తెలుగు సాహితీ చతుర్ముఖుడు డా. పాపినేని శివశంకర్‌గారు! ఓ ప్రత్యేకమైన శైలి, లోతైన భావసంపద, తాత్విక చింతన, ఆలోచింపచేయగల రచనా పటిమ... ఇవన్నీ పాపినేనిగారి అక్షరనడతలో పాఠకులకు తారసపడతాయి. వీటితో పాటు... నిరాడంబరమైన ఆహార్యం, బోధన, చెదరని చిరునవ్వు.. పాపినేనిగారి అక్షరనడతలో తోడుగా ఉంటాయి! ముందు నుంచి కవిత్వం మీదే ఎక్కువ కృషి చేసిన పాపినేనిగారు.. కథా రచనలో కూడా శ్రేష్ఠమైన కథలు అందించారు. కవిత, కథ, వ్యాసం, విమర్శ.. ఇలా ఏ ప్రక్రియలో చూసిన పాపినేనిగారి ముద్ర కనబడుతుంది. ఇక ఆయన కథల గురించి మాట్లాడుకుంటే... కథలోని అన్ని పాత్రలలో ఆయన పరకాయ ప్రవేశం చేస్తారు. ఆయా జీవితాలలో జీవిస్తూ, సరళమైన వాక్యాలతో కథని అందిస్తారు. కథావస్తువనీ, ఇతివృత్తాన్ని ఒకచోట చేర్చి, ప్రణాళికాబద్ధంగా ఒక సంపూర్ణమైన కట్టడంగా రూపొందించడంలో ఆయనకి ఆయనే సాటి అని చెప్పాలి. సాధరణంగా కథలన్నీ ప్రధమ పురుష కథనం, ఉత్తమ పురుష కథనంలో ఉంటాయి. మధ్యమ పురుష కథనంలో కథను ఆకట్టుకునేలా అందించడం అంటే, రెండువైపులా పదునున్న కత్తిమీద సాము వంటిది. అలా మధ్యమ పురుషలో కథలు వ్రాసిన కథకులు బహు తక్కువ మంది ఉన్నారు. వారి కథలు కూడా వేళ్ళతో లెక్కించవచ్చు అని చెప్పాలి. అలాంటి బహుతక్కువ మంది కథకులలో పాపినేనిగారు ప్రముఖులు!

కథామంజరి దీపావళి ప్రత్యేక సంచిక విశిష్ట అతిథిగా వారిని ఆహ్వానించడం... సరిగ్గా దీపావళి రోజే వారి జన్మదినం కావడం యాదృచ్ఛికమే... అయినా, దీనితో ఈ ప్రత్యేక సంచికకు మరో ప్రత్యేకత చేకూరింది కూడాను. 1953 దీపావళి రోజునే గుంటూరు జిల్లా నెక్కల్లు గ్రామంలో సాధరణ రైతు కుటుంబంలో జన్మించిన పాపినేనిగారు, తుళ్లూరులో హైస్కూలు వరకు, గుంటూరులో బీ.ఏ., ఆంధ్ర యూనివర్సిటిలో ఎమ్.ఏ., నాగార్జున యూనివర్సిటీలో పి.హెచ్.డి చేసారు. డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, పి.హెచ్.డి.లలో గోల్డ్‌మెడల్స్ సాధించారు. తాడికొండ బి.ఎస్.ఎస్.బి. కాలేజీలో తెలుగు అధ్యాపకులుగా చేరి, 33 సంవత్సరాలు పనిచేసి, అక్కడే ప్రిన్సిపాల్‌గా 2010లో రిటైర్ అయ్యారు.

చిన్నప్పుడు తల్లి దగ్గర విన్న కథలు, ఊర్లో విన్న బుర్రకథలు, లైబ్రరీలో చదివిన చందమామ వంటి పుస్తకాలు... పాపినేనిగారిని కథలు రాయడానికి బాగా ప్రేరణ కలిగించాయిట! 1977లో పాపినేనిగారు మొట్టమొదటి కథ "కలుపు మొక్క"తో కథారచనలకు శ్రీకారం చుట్టారు. చింతల తోపు, ఒక్కవాన కోసం, సగం తెరిచిన తలుపు, చివరి పిచ్చుక, అపరాధి, ఇహపరాల మధ్య, మట్టిగుండె... వంటి ఎన్నో వీరి కథలు చాలా ప్రాచుర్యం పొందాయి. స్వతహా.. కవిత్వంతో సాహితీ ప్రస్థానం ప్రారంభించిన పాపినేనిగారి కథలలో కవిత్వం తొంగిచూస్తుంది... అది ఓ రకంగా కథకి మంచి బలాన్ని ఇస్తుంది. అలాగే పాపినేనిగారి కథలలో తనకిష్టమైన అభిరుచులలో సంగీతం, చిత్రం, శిల్పం, చదరంగం.. వంటివి ఆయన కథలలో ఏదో విధంగా చోటు చేసుకుంటాయి. పుట్టి పెరిగిన పల్లెవాసన, రైతులు.. సమస్యలు వారి కథల్లో జొరపడతాయి. ముఖ్యంగా పాపినేనిగారు వాదాల కోసమో, ఉద్యమాల కోసమో రచనలు చేయలేదు. తన అనుభవాల పుటల్లోంచి రచనా వస్తువులను తీసుకుంటారు. మానవతా వాదం, బౌద్ధం, మార్క్సిజం, అస్తిత్వవాదం.. వంటి నీడలు ఆయన కథల్లో కనబడతాయి. అందుకే... పాపినేనిగారి రచనలు ఏవైనా అజరామరంగా నిలిచిపోతాయి!

2017లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న డా. పాపినేని శివశంకర్‌గారికి అటు సాహిత్యప్రక్రియలలోనూ, ఇటు ఉపాధ్యాయ వృత్తిలోనూ ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయి. భారతదేశంలోనే కాకుండా, విదేశాలో జరిగిన ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొన్నారు. స్తబ్ధత–చలనం, ఆకుపచ్చని లోకంలో, ఒక ఖడ్గం–ఒక పుష్పం, రజనీగంధ.. వంటి కవితా సంపుటలు, మట్టిగుండె, సగం తెరిచిన తలుపు.. వంటి కథా సంపుటాలు, సిద్ధాంతగ్రంథాలు, వ్యాససంపుటాలు, స్వీయ సంపాదకత్వంలో కథాసంకనాలు, కవితా సంపుటాలు... ఎన్నో వీరివి విడుదల అయ్యాయి. 350 కవితలు, 55 కథలు, రెండువందల పైచిలుకు విమర్శనా వ్యాసాలు, సమీక్షలు, టి.వి., రేడియో కార్యక్రమాలు... ఇలా తెలుగు సాహితీవనంలో సవ్యసాచిలా ఏడు దశాబ్దాలు నిండుగా నింపుకుంటున్న శుభ సందర్భాన.. డా. పాపినేని శివశంకర్‌గారికి హృదయపూర్వక అభినందనలు అందిస్తూ, తెలుగు సాహితీవనంలో నిత్యం సాహితీకుసుమాలను అందిస్తూ, శతవత్సరాలు ఆయురారోగ్యాలతో వర్ధమాన సాహితీవేత్తలకు ఆదర్శంగా జీవించాలనీ కోరుకుంటూ.. ఈ ప్రత్యేక సంచికకు విశిష్ట అతిథిగా అంగీకరించినందులకు ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



**కీ.శే. వాసిరెడ్డి సీతాదేవి**

తెలుగు సాహితీ చరిత్ర చూస్తే... మన దేశంలో ప్రభుత్వాల చేత నిషేధింపడిన తెలుగు నవలలు.. రెండు కనబడతాయి. ఉన్నవ లక్ష్మీనారాయణగారి "మాలపల్లి" నవలను తెల్లదొరలు నిషేధిస్తే, మన నల్లదొరలు "మరీచిక" నవలను నిషేధించి చరిత్రలో నిలిచిపోయారు. నాలుగుదశాబ్దాల వెనక్కి వెళితే, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి మూడు దశాబ్దాలు దాటిన తర్వాత... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ "మరీచిక" నవలని నిషేధించింది. నక్సలిజం నేపథ్యంతో రచించిన ఈ నవల మీద చర్చలు, కోర్టు కేసులు నడిచిన తర్వాత, ప్రముఖ సాహిత్యవేత్తల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకొని, హైకోర్టు ఈ కేసు కొట్టివేసి, నిషేధాన్ని ఎత్తివేసారు. ఆ రోజుల్లో చాలా సంచలనం సృష్టించిన ఈ నవలని, నిషేధంలో కూడా పాఠకులు ఎలాగోలా సంపాదించి, చదివి, స్పందించేవారు. తన చూట్టూ జరుగుతున్న విషయాలని, సమస్యల్ని గుర్తిస్తూ, సామాజికబాధ్యతతో కలం పట్టి, సాహితీసేద్యం చేసిన మేటి రచయిత్రి కీ. శే. వాసిరెడ్డి సీతాదేవిగారు! ఓ కథ రాయాలన్నా, నవల రాయాలన్నా విశేషమైన కృషి చేసి, విషయసేకరణ చేసి... సరళంగా, పామరులని సైతం చదివించగల శైలిలో రచనలు అందించారు. వాస్తవానికి ఆ రోజుల్లో యువతను నవలాసాహిత్యం బాగా అకర్షించేదనే చెప్పాలి. అలా ఆ నవలలు అరాచకవాదం వైపు యువతను నడిపించాయనే అభిప్రాయం ప్రభుత్వవర్గాల్లో ఉండేది. కాని సాహితీవేత్తలు మాత్రం... సమాజంలో పరిస్థితులను ప్రతిబింబించేలా ఆయా రచనలు ఉన్నాయని, వాటి వలన యువతకి మంచీచెడూ తెలిసి, సరియైన మార్గం ఎంచుకుంటారని వాదించేవారు. ఓ విధంగా ఆ వాదన గెలించదనే చెప్పాలి. అలా తాను నమ్మిన సిద్ధాంతాల విషయంలో రాజీపడకుండా, తమకంటూ ఓ ప్రత్యేకత సంపాదించుకున్న అలనాటి రచయిత్రులలో, బాగా గౌరవింపబడ్డ రచయిత్రి సీతాదేవిగారు! స్వతహా... తాను పెరిగిన వాతవరణంలో, తన చుట్టూ ఉన్న సమాజం మీద ఓ అభిప్రాయం కలగడంతో, వాటి మీద స్పందించే స్వభావం, సంస్కరణాభిలాష అలవడటంతో... కథల ద్వారా సమాజానికి అందించాలనే తపనతో, రచనాప్రక్రియ వైపు అడుగులు వేసారు. తన పదిహేడవ ఏట "జీవితం అంటే" అనే నవలను వ్రాసారు. మొదటి నవలతోనే సీతాదేవిగారికి మంచి పేరు వచ్చింది. 1952 లో ఆమె మొట్టమొదటి కథ "సాంబయ్య పెళ్ళి" కి కూడా అత్యంత పాఠకాదరణ లభించింది.

1933 సంవత్సరంలో గుంటూరు జిల్లా, చేబ్రోలులో ఓ సాంప్రదాయ కుటుంబంలో సీతాదేవిగారు జన్మించారు. ఇంట్లో ఉండే ఓ విధమైన కట్టుబాట్లతో, బయటకు వెళ్ళాలంటే గుర్రం బగ్గీకి చుట్టూ పరదాలు వేసుకుని వెళ్ళేవారుట. ఐదవ తరగతి వరకు ఆ ఊర్లో చదువుకుని, తర్వాత ఆ కుటుంబం మద్రాసు వెళ్లడంతో, సీతాదేవిగారు ప్రైవేటుగా హిందీ పరీక్షలలో సాహిత్యరత్న వరకు చదివారు. ఆ తర్వాత ప్రైవేటుగానే నాగపూర్ యూనివర్శిటీ నుంచి బి.ఏ., ఎమ్.ఎ. చదివి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసులో వివిధ హోదాలలో పనిచేసారు. తర్వాత కాలంలో చాలాకాలం పాటు జవహర్ బాలభవన్‌లో డైరెక్టర్‌గా సేవలు అందించారు. 1985–91 కాలంలో ఫిలిం సెన్సార్‌బోర్డు మెంబర్‌గా కూడా పనిచేసారు. అయిదు సార్లు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారాలు, పలు యూనివర్సిటీల నుంచి గౌరవ డి.లిట్.ల వంటి ఎన్నో అవార్డులు పొందారు. 39 నవలలు, వందకు పైగా కథలు రచించిన సీతాదేవిగారి నవల "మట్టి మనిషి" పద్నాలుగు భాషల్లో అనువదించబడింది. ఈ నవలకి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది. అలాగే ప్రముఖ హిందీ రచయిత శివసాగర్ మిశ్రాగారి నవల "అక్షత్" ను, సీతాదేవి గారు తెలుగులో "మృత్యుంజయుడు" అను పేరుతో అనువదించారు. వీరి కొన్ని నవలల ఆధారంగా సినిమాలు, టివీ సీరియల్స్ వచ్చాయి!

సాధారణంగా కథావస్తువు ఎంపికలో గాని, శైలిలో గాని, కథనంలో గాని, శిల్పంలో గాని.. ప్రతీ కథారచయిత వారి వారి రచనలు చేయడం ప్రారంభదశ నుండి గమనిస్తే, కాలం గడిచేకొద్దీ వాటిలో పరిణితి కనబడుతుంది. కథలలో పదును రానురాను పెరుగుతుంది. వయసుతో పాటు వచ్చే పరిపక్వత, ఆలోచనలలో వచ్చే మార్పులు, అనుభవంతో వచ్చే పాఠాలు.. రచనలలో కనబడతాయి. ఇది సహజం! అయితే చాల కొద్దిమంది రచయితలలో ఈ పరిపక్వత మొదటిరచన లోనే కనబడుతుంది. ఆ కొద్దిమందిలోనూ మనకి కనబడే రచయిత్రి సీతాదేవిగారు! తన పదిహేడో ఏట రచనలు చేయడం ప్రారంభించిన సీతాదేవిగారి మొదటి కథ "సాంబయ్య పెళ్ళి" లోనే ఉన్నతమైన కథాప్రమాణాలు కనబడతాయి. రెండవ కథ "ధర్మదేవత గుడ్డికళ్ళు"... మరో మెట్టు ఎత్తులో ఆ కథ రచించారు. అలా చదువుకుంటూ పోతే " ఎల్లమ్మ తెల్ల రూపాయ, ఏడుకొండల వాడు, మెలికెల కడియాలు, నా కథ వ్రాయవూ, చిచ్చుబుడ్డి.. వంటి, సీతాదేవి గారి కథలు ఒక్కో మెట్టు ఎదిగి తారస్థాయిలో నిలబడ్డాయి. "స్త్రీవాద రచయిత్రులు... కేవలం ఆ వాదానికే కట్టుబడిపోకుండా, తమ దృష్టిని సమాజంలో ఇతర సమస్యల వైపు కూడా సారిస్తే బావుంటుంది !" అనే అభిప్రాయాన్ని ఎప్పుడూ వ్యక్తపరిచే వాసిరెడ్డి సీతాదేవిగారు 2007 సంవత్సరంలో కాలం చేసారు!

తెలుగు కథా, నవలా ప్రపంచంలో.. ముఖ్యంగా గడిచిన అర్ధశతాబ్ధంలో తెలుగువారు గర్వించదగ్గ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవిగారిని తలచుకుంటూ, వారిని ఈ దీపావళి సంచిక కథామార్గదర్శిగా వారి రచనల గురించి నాలుగు మాటలు వ్రాయడం.. ఓ కర్తవ్యంగా భావిస్తూ.. వారికి ప్రణామాలు అర్పిస్తున్నాం!!

*కథామంజరి బృందం.*

## కథ - నాలుగో కోతి

ఈ కథా రచయిత అందరికీ తెలుసు. మూడు కోతుల సంగతీ తెలుసు. ఒకటి చెడు వినదు, మరొకటి చూడదు, ఇంకొకటి మాట్లాడదు. మరి నాలుగో కోతి ఏం చెయ్యాలి?

ఈ కథా రచయిత మధ్యతరగతి ప్రజల కథకుడు. ఆయన కథలు ప్రతిబింబించే జీవితాలను చాలా మందిమి అన్వయించుకోవచ్చు. 'నాలుగో కోతి' కథ గత కొద్దివారాల క్రితం ఆంధ్రజ్యోతి ఆదివారం (24.09.2023) అనుబంధంలో వచ్చింది. ఈ కథకి పాఠకులనుండి ఎంతో స్పందన వచ్చిందని విన్నప్పుడు ఒక సందేహం కలిగింది. కథ ఎప్పుడు ఎందుకు మనసుల్ని తాకుతుంది? అప్పటివరకూ ఎప్పుడూ స్పందించని ఎంతోమంది పాఠకులు ఉత్తరాలు రాసో, రచయితకు వ్యక్తిగతంగా ఫోన్ చేసో చెప్పారంటే అలాంటి కథలలో ఏముంటుంది? ప్రత్యేకంగా ఈ కథలో ఏముంది?

'నాలుగో కోతి' కథ ఒక ఊర్లో నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఒక ఆరడుగుల విగ్రహం చెప్పిన స్వగతం. పదిహేనేళ్ల క్రితం ఆ విగ్రహం దగ్గరికి రోజూ వచ్చే చంద్రమ్మ (తను పెట్టుకున్న పేరు) అనే స్కూలుకు వెళ్ళే చిన్నపిల్ల పరిచయంతో మొదలవుతుంది కథ. కాళ్ళకు చెప్పులు లేకుండా, మాసి, నలిగిన బట్టలతో, భుజమ్మీద పుస్తకాలతో పొద్దున్నా, సాయంత్రం విగ్రహం ముందునుంచి నడచివెళ్తూ, ఓ దణ్ణం పెట్టి వెళ్ళేది చంద్రమ్మ. ఇంతకీ తను ఎవరు? అందరూ జాతిపిత, మహాత్మ అని పిలుస్తారట. అది తనకు ఇష్టముండదు. తన తల్లి చిన్నప్పుడు "పదిమందికి ఉపయోగపడే పనులు చేసి గతించినవాడే కీర్తిశేషుడు గాని, చచ్చిన ప్రతివాడూ కీర్తిశేషుడు కాలేదు" అన్న మాటలు గుర్తొస్తాయి. తననెవరూ కీర్తిశేషుడని కానీ, కనీసం తన పేరుముందు కీ.శే. అని గాని రాయరు. తను మాత్రం ఏం ఘనకార్యం చేశాడని? పుస్తకాలనుంచి, సమాజంనుంచి నేర్చుకుని, తనకంటే ముందుగానే ఇంగ్లీషువాడి పాలనలోంచి విముక్తి పొందాలని పనిచేసిన ఎందరినో అనుకరించడమేగా? అయినా ఏదో చేశాడని తనని ఈ నాలుగు రోడ్ల కూడలిలో నిలబెట్టారు. ఈ పదిహేనేళ్లలో, ఎన్ని మార్పులు? మనుషుల్లోనూ, చుట్టుప్రక్కల పరిసరాల్లోనూ. చిన్న ఇళ్ళు, షాపులు నాలుగంతస్తుల భవనాలైపోయాయి. అదివరకులా ఎవరూ వచ్చి కూర్చుని మాట్లాడుకునేవారు లేరు.

కొన్నాళ్ళ తర్వాత చంద్రమ్మ ఓ కుర్రాడితో వచ్చింది. తనకతడంటే సదభిప్రాయం కలగలేదు. ఆ కుర్రాడు ఆ పిల్లని బలవంతం చేస్తున్నాడు. వద్దని చెప్పాలనున్నా, తన మాట ఎవరు వినగలరు? ఇంకోసారి, ఇంకోసారి, వచ్చిన ప్రతిసారీ అతని మాటలు, చేతలు మితిమీరుతున్నాయి. మరోసారి ఇద్దరు ముగ్గురితో కలిసి వచ్చాడు వాడు. చంద్రమ్మను బలవంతం చెయ్యడం తెలుసు. కర్రతో అదిలించాలని అనిపించింది. కర్ర లేదు చేతిలో.

ఈ లోపల ప్రజలలో వచ్చిన మార్పులలో ఇంకోటి, నామీద పాలు పోయడం. ఒళ్ళంతా జిడ్డు జిడ్డు. మళ్ళీ స్నానం చేయిస్తే బాగుండును. అయితే ఇంకో సంఘటన కుదిపేసింది. ఇంకొన్నేళ్లకు మళ్ళీ చంద్రమ్మను చూడడం జరిగింది. ఈసారి చంకలో ఒక పిల్లతో, చింకిబట్టలతో. ఆ రోజు ఆ చంటిపిల్లకు నామీద పోసిన పాలను జాగ్రత్తగా ఓ గిన్నెలో పట్టి ఇచ్చింది. ఎంత దయనీయ స్థితి! చూడలేక ఏమీ చేయలేని పరిస్థితి తనది. ఈ పాల స్నానాలు ఎప్పటినుంచో జరిగిపోతున్నాయి. కొన్నేళ్ళకు ఈ పాలస్నానాలు కూడా తగ్గిపోయాయి.

ఓరోజు ఒక పెద్దాయనొచ్చాడు. తనని చూస్తూ "మహాత్మా...దేశం సర్వనాశనం అయిపోయింది. మేం ఏం చేయలేకపోతున్నాం. నువ్వు మళ్ళీ పుట్టాలి..." అంటూ ఏవేవో చెప్పుకుపోయాడు. తనేం చేయగలడు? ఆ పెద్దాయన తను చేయగలిగే పని తను చెయ్యడు. నేను తిరిగి పుట్టాలా? అప్పుడే శుబోధ్ గుప్తా గారు సృష్టించిన మూడుకోతులు జ్ఞాపకానికి వచ్చాయి. ఒక కోతి నోరుమూసుకుంటుంది, చెడు వింటున్నా, చూస్తున్నా. ఇంకోటి చెవులు మూసుకుంటుంది. ఇంకోటి కళ్ళు మూసుకుంటుంది. వాటన్నిటికీ జరుగుతున్న విషయాలు తెలియక కాదు. వాటికీ తనకూ తేడా ఏముంది? నాలుగో కోతి తనైతే అన్నీ మూసుకు కూర్చోవాలేమో ఇప్పుడు! తనాపని చేయకపోతే మిగతా మూడు కోతులు బలవంతాన చేయిస్తాయేమో! ఇప్పుడు మళ్ళీ పుట్టి, ఏం చేయగలను. అసలు శక్తి ఆయన ఎడమచెయ్యి చూపుడు వేలులో ఉంది! తన మాట ఆ పెద్దమనిషికి అర్థమయిందేమో, ఏమో, ఇంకుమార్కున్న తన చూపుడువేలుని ఓసారి చూసుకుని, అది అమ్ముడుపోయిందన్న నిజాన్ని గ్రహించి నిష్క్రమిస్తాడు.

మళ్ళీ ఇంకెవరో పాలాభిషేకం – తనకిష్టం లేదు! ఒళ్ళంతా అంటుకుంటోంది. నీళ్ళతో స్నానం చెయ్యాలి.

ఇంతే కథ.

రచయిత ఈ కథ చెప్పడానికి ఒక శిలా విగ్రహాన్ని ఎన్నుకున్నారు. విగ్రహం చూడగలదు, వినగలదు, మాట్లాడగలదు (అనుకోగలదు) గాని ఎవరూ వినలేరు. తనమీద పోసిన పాల జిడ్డుని ఏవగించుకోగలదు. కానీ, ఏమీ చేయలేదు. కాలక్రమంలో చేతి కర్ర పోయింది, కళ్ళజోడుకూడా పోయింది.

కథలో రచయిత ఎన్నో సంకేతాలు వాడడం చూడవచ్చు. మహాత్మా గాంధీ పేరు ఎత్తకుండానే పాఠకుడికి అర్థమవుతుంది ఆ విగ్రహమెవరిదో. విగ్రహానికి చేసే పాలస్నానాలు మూర్ఖత్వానికి, అర్థంలేని పనులకు గుర్తులు. బీదరికం, ఆడపిల్లలపై అత్యాచారాలు, కాలంతో మారుతున్న పరిసరాలు, రాజకీయాల ప్రయోజనాలకు ఆ శిలా విగ్రహాన్నుపయోగించుకునే నాయకులు, సమాజ పాశవికతలో తానూ ఒక భాగమై, ఏమీ చెయ్యక, ఇంకోళ్ళ ద్వారా మాత్రమే (మళ్ళీ మరో గాంధీ రావాలనే ఆలోచన) మార్పు తేవాలనే పలాయనవాదం, ఇవన్నీ విశదీకరించి చెప్పకుండానే చెప్పడం రచయిత చేసిన ప్రయోగం.

పెద్దమనిషి తన వోటును అమ్మేడన్న విషయాన్ని ఇంకు మార్కున్న చూపుడువేలు అమ్ముడు పోవడం వలన కదలక పోవడం అని చెప్పడం కథకు హైలైట్.

అయితే, సామాన్య పాఠకుడిని ఈ కథ ఎలా, ఎందుకు ఆకర్షించి వుంటుంది? బీదరికంలో ఉన్న ఆడపిల్లలపై అత్యాచారాల గురించి ప్రస్తావన కదల్చి ఉండవచ్చు. సమాజంలో జరుగుతున్న అత్యాచారాలను ఆపలేని అశక్తత రచయిత నాలుగో కోతి రూపంలో చెప్పడం పాఠకులు తమ అశక్తతలో చూసుకొని ఉండవచ్చు. ఓటుహక్కు ఉంది. కాని, ఆ వోటుని నిజాయితీగా ఉపయోగించుకోగలిగే శక్తి సాంఘిక, ఆర్థిక రాజకీయ పరిస్థితులు సగటు పౌరుడికి ఇవ్వలేక పోవడం దురదృష్టకరం. అయితే ఆ పరిస్థితులను ఎదుర్కోవాలనే వుంటుంది చాలా మందికి. దానికి ఇంకెవరో రావాలని, చేయాలని అనుకోవడం మరింత శోచనీయం. ఇదీ రచయిత చెప్పదల్చుకున్నది.

రచయిత ఇతర రచనలతో పోలిస్తే, ఇదొక కొత్త ప్రయోగమే. పాఠకుల స్పందన తేగలిగిన ఈ కథను సృజించడంలో రచయిత సఫలీకృతుడైనట్లే మరి. ఇంతకీ ఈ కథ రచయిత పేరు జయంతి ప్రకాశ శర్మ.

***పరిచయకర్త – శాయి రాచకొండ, హూస్టన్***

అక్టోబర్ కథామంజరి 'బ్లూ జే' పక్షి (దసరా పండుగ, పాలపిట్ట అనుకొని వేశారా?) ముఖచిత్రంతో వెలువడింది. కాళోజీగారి పూర్తి పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీనా? ఇంతవరకు తెలియదు.. ఎక్కడా చదివినట్టు గానీ ... చూసినట్టు గానీ లేదు. కొత్త విషయం తెలిసింది. 'తెలియక ప్రేమ, తెలిసి ద్వేషం' మనుష్యుల మనస్తత్వాలను చిత్రిక పట్టిన కథ. పరిచయించిన శాయి రాచకొండ గారికి ధన్యవాదాలు. 'అశ్వత్థామ హతః' ఘోస్ట్‌రైటర్స్ గురించి రాయబడిన వసుంధర గారి కథ. బావుంది. కథ మధ్యలో నుండే అనుమానం వచ్చింది. కథలో చివరి వాక్యం చమక్కున మెరిసి అనుమానం అనే చీకటి వెలిగింది.

'మనసు గాయం' పివిఎల్‌ఎన్ మంగారత్నంగారి కథ. సరిగా అభ్యాసం చేయకుండా రాసిన కథ. అది చాలా సంవత్సరాల కిందట విషయం... అని కథ మొదలు. కానీ కథేమో రెండు మూడేళ్లలో అయిపోతుంది. ఈ మాత్రం దానికి చాలా సంవత్సరాల.... అంటూ ఎందుకు? 'ఓహో' విస్మయం చెందాను. – ఇక్కడ విస్మయం దేనికో తెలియదు! "ట్రై సైకిల్ కొనుక్కోలేకపోయారా" అలా అనేంత వరకు మనసు మనసులో లేదు. – దీంట్లో మనసు మనసులో లేకపోవడం ఏముంది? అనేస్తే పోయే!! వైశ్యుల అమ్మాయి కాబట్టి బంగారం బాగానే వేసుకునేది... స్టీరియో టైపు ఆలోచన! కొత్తగా వచ్చిన వారికి ఇన్‌వర్డ్ అవుట్వార్డ్ సెక్షన్ ఇస్తారు. అదృష్టవశాత్తు నా సర్వీస్‌లో నాకు ఎప్పుడూ ఆ సీటు రాలేదు... దీంట్లో అదృష్టం ఏముంది. అది కూడని పనా? ఇలా చూస్తూ పోతే చా...లా... (అతిశయోక్తిగానే అంటున్నా!) చోట్ల వాక్య ప్రయోగాలు అసంబద్ధంగా ఉన్నాయనిపించింది.

భమిడిపాటి గౌరీ శంకర్‌గారు రాసిన 'మామిడి జీడి' కథలో తీసుకున్న జాగ్రత్త, పడిన శ్రమ కనిపించింది. సవరలలాంటి బోలెడు తెగలు సాహిత్యానికి దూరంగా ఉన్నాయి. వీటికి అందులో చోటు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశలో ప్రయత్నం చేసిన గౌరీ శంకర్‌గారికి అభినందనలు.

మెడికో శ్యామ్‌గారి కథ 'కథకుడి అంతరంగం'. పుస్తకాలకు ముందు మాటలా వెనక మాటలు ఉంటాయి. కొన్ని కథలకీ వెనుక మాటలు ఉంటాయి. ఈ కథకి వెనుక మాట కావలసిన ముందుమాటలివి. – గమ్మత్తైన చిత్తు చేసే వాక్యాలు గదా! మధ్య పురుషలో నడిచిన కథ. కానీ ఎన్ని అప్పు తచ్చులో!! కథ.. కధ... ఆడపిల్ల – అడ్డ పిల్ల.... మైథాలజీ — మిథాలడీ... మళ్ళీ– మళ్లి.... (ఇలా... ఎన్నో?) అసలే నా బోటి మనుషులకు అర్థం కాని కథ. పైగా అక్షరదోష ప్రవాహం. ఇంకా ఏం చెబుతాం... సారీ... మరోసారి చదివి చెబుతాం(ఎప్పుడు?).

యథావిధిగా అతిథుల కథలు బాగున్నాయి. సర్వే జనా సుఖినోభవంతు!!

**– రాంబో**

అక్టోబర్ 23 సంచికలో ప్రచురితమైన మెడికో శ్యామ్‌గారి కథ "కథకుడి అంతరంగం"..లో చాలా ముద్రారాక్షసాలు ఉన్నాయని రచయిత, ఇంకా కొద్దిమంది పాఠకులు మాకు తెలియచేసారు. అవి.. నిజమే! రచయిత పంపిన కథని తప్పులు లేకుండా చూసేందుకు మా దగ్గర రెండుమూడు చేతులు మారుతాయి... అదీ కంప్యూటరు ద్వారా! ఈ ప్రయాణంలో కొన్ని అనుకోకుండా జరుగుతున్నాయి. దానికి తోడు రచయిత భావప్రకటనను.. సరిగా అర్థం చేసుకోలేక కొన్ని పొరపాట్లు కూడా మావల్ల జరిగాయి! ఏది ఏమైనా.. పొరపాటులకు చింతిస్తున్నాం! ఇకపై జరగకుండా జాగర్తపడతాం. ... **సంపాదకుడు**.

సినీ రంగ మార్తాండ కథల పోటీ 2023 లో సాధారణ ప్రచురణకు స్వీకరించి, సెప్టెంబర్ సంచికలో ప్రచురణమైన శ్రీ అనిల్ ప్రసాద్ లింగంగారి కథ 'అనామ తరువు" లో నిర్మాత రాజేంద్ర వెంకట్రావు మనుమరాలి విడియో చూసి అందులో వ్రాసిన డైలాగులు వెంకట్రావే వ్రాశాడని తెలుసుకుని రెండు గంటలకు సరిపడ కథని వ్రాయించుకుని, ఆ కథని ఆధారంగా చేసుకుని మనుమరాలికి పాత్ర ఇస్తానని చెప్పి, ఇవ్వకపోగా ఆ కథని మరొకరికి అమ్మేసుకుని, ఆ మనుమరాలి పాత్రని కూడా హీరో సంతోష్ కూతురికి ఆ పాత్రనిస్తాడు. సినిమా రంగంలో జరిగే మోసాలకి అద్దం పట్టిన కథ. కథ ముగింపులో వెంకట్రావు తన మనవరాలితో సినిమా రంగంలో జరిగే అకృత్యాలన్నింటినీ ఒక్క గుక్కలో అప్పజెప్పినట్లుగా చెబుతాడు. ఆ మాటలు విన్న మనవరాలు తాతయ్యతో "అరే ఒక్క గుక్కలో భలే చెప్పావు తాతయ్యా! ఇది ఏ సినిమాలో డైలాగ్" అని అడుగుతుంది అమాయకంగా ముఖం పెట్టి.

సి. యమునగారి కథ "రంగస్థలం"లో కథనాయకుడికి గతించిన వైభవం తనని కలలో ఉక్కిరిబిక్కిరి చేసి మెలకువొచ్చేసింది. అటు తర్వాత 'నటన లేని జీవితం దుర్భరంగా ఉందని అనుకుంటాడు. ఇంతలో వంశీ తన మామతో "నటన గురించి తర్ఫీదునిచ్చే ప్రతిష్టాత్మకమైన యాక్టింగ్ ఎకాడెమీస్ ఎన్నో ఉన్నాయి. అక్కడ వాళ్ళకి నటన గురించి బోధించటం ద్వారా మీకు ఇష్టమైన నటన ఎప్పటికీ దూరం కాదు. మీ ప్రాణమైన నటనతో అనుసంధానమయ్యే ఉంటారు" అని చెప్పడంతో ఆ మాటలు అతడి మనసుని తాకుతాయి. దాంతో అతడిలో ఉన్న కొండంత భారాన్ని దింపి నూతనోత్సాహాన్ని నింపుతాయి.

శ్రీమతి సుందరీ నాగమణి నండూరి గారి కథ "నిన్నటి దాకా శిలనైనా..." లో దర్శకుడు రాజేంద్ర ఇచ్చిన డైలాగులు హీరోయిన్ మాలిని చెప్పలేక షూటింగ్ నుండి వెళ్ళిపోతే, నిరుత్సాహానికి గురైన రాజేంద్ర అలమేలుని కోప్పడతాడు. మరునాడు అలమేలు డైరెక్టరు రాజేంద్రని ఇంటి దగ్గర కెళ్ళి కలసి "మాలినీ గారు డైలాగ్ తప్పుగా చెబితే నన్నెందుకు కోప్పడ్డారు?" అని అడిగింది. "నువ్వు చెప్పే డైలాగ్‌లో కూడా "యువరాణి" అని అనకుండా "యువరాని" అని అన్నావు. "లేదు నేను యువరాణి" అనే అన్నాను. "మాలినీ డైలాగులు కూడా చెప్పగలను" అని ఒక్క పొల్లు పోకుండా మాలినీ డైలాగులు చెప్పి డైరెక్టర్ రాజేంద్ర దగ్గర మెప్పు పొందింది అలమేలు. ఈ కథని చదువుతున్నప్పుడు నాకు ఇద్దరు నటీమణులు జ్ఞప్తికి వచ్చారు. వాళ్ళు ఒకరు రమాప్రభ, మరొకరు విజయ నిర్మల. ఇది ఎంతవరకూ కరెక్టో నాకు తెలీదు.

శ్రీ చాగంటి ప్రసాద్‌గారి కథ "స్క్రీన్ ప్లే" లో ఒకరు వ్రాసిన కథని/స్క్రిప్ట్‌ని మరొకరికి అమ్ముకుని డబ్బు చేసుకోవడమన్నది సినీరంగంలో అంతర్లీనంగా జరుగుతున్న మోసాల్ని చాగంటి ప్రసాద్‌గారు తన కథలో చాలా చక్కగా వివరించారు.

డా. మజ్జి భారతి గారి కథ "ఇచ్చుటలో ఉన్న హాయి" లో సంపాదించిన దాంట్లో కొంత ఇతరులకు ఇవ్వడంలో వున్న హాయి, తృప్తి మరెందులోనూ దొరకదని ప్రస్ఫుటం చేసిందీ కథ.

శ్రీ సుధామాయి గారి కథ "నేను, నాన్న, బంగరం"లో రచయిత్రి బంగారాన్ని తయారు చేయడానికి సంబందించిన విషయ సేకరణ బాగా చేశారన్నది ప్రస్ఫుటంగా తెలుస్తున్నది.

ఇక కథలో స్వర్ణకారుడి కొడుకు బంగారాన్ని ఎన్ని విధాలుగా తయారు చేయచ్చన్న విషయంపై పరిశోధన చేసి తెలుసుకుని తన తల్లికి మంగళ సూత్రంతో పాటు వివిధ రకాలైన అభరణాలను చెసివ్వాలని ఇంటికొస్తే, తండ్రి కొడుకుతో "ఇలా ఎవరికి కావాల్సిన బంగారాన్ని వాళ్ళే తయారు చేసుకునే విధానాన్ని నీ పరిశోధన ద్వారా తెలియజేసిన నాడు బంగారానికి విలువెక్కడుంటుందని చెప్పి తండ్రి మరణిస్తే ఆయన చితిమంటల్లోనే తన పరిశోధనా పత్రాల్ని కూడా తగలబెట్టేయడంతో కథ ముగుస్తుంది.

శ్రీ పి. రాజేంద్రప్రసాద్‌గారి కథ 'శతమానంభవతి" లో శ్రీదేవి భర్త ఆనంద్, కొడుకు విజయకుమార్‌లు ఇద్దరూ యుద్ధంలో మరణించడంతో తను ఒంటరయ్యింది. అయినా కూడా తన అన్నయ్యతో "నా లాంటి, మీ లాంటి.. ఇంకెందరో స్వేచ్ఛగా, హాయిగా బ్రతకడం కోసం నేను దేశానికి ఇద్దరు వీరులనిచ్చాను. వీరపత్నిగానే కాక వీరమాతగా కూడా గౌరవింపబడటం ఈ దేశంలో ఎంత మందికి సాధ్యం? అటువంటి గౌరవము, తృప్తితో నేను కడదాకా సంతోషంగా బ్రతకగలనన్నయ్యా!". ఆ మాటలు ఆవిడలోని దేశ భక్తికి నిదర్శనం.

శ్రీ దేవులపల్లి దుర్గా ప్రసాద్‌గారి కథ "విగ్రహ సంకల్పం' లో వెంకట్రావు అక్కతో వినాయక విగ్రహాలు తయారు చేయించుకుని కాలనీవాసులకు ఆ విగ్రహాలనమ్మి డబ్బులు సంపాదించుకుని ఇంటికొచ్చి, ఇంట్లో తన అక్క దగ్గర చేయించుకున్న విగ్రహంతో వినాయకుడి పూజ చేసుకున్నామని అన్నాడు వెంకట్రావు. కథ చివర్లో రమణాచారి వెంకట్రావుతో "నీ సంకల్ప బలం ఆ వినాయక విగ్రహమంత గొప్పదిరా! మీ వాళ్ళందరినీ ఆనందింప చేద్దామనే నీ ఆలోచన ఉన్నతమైనది. ఇదే స్ఫూర్తి నీ చదువులో కూడా కొనసాగించు. బాగా చదువుకుంటే నువ్వు సుఖపడటంతో పాటు నీ వాళ్ళని కూడా సుఖపెట్టొచ్చు" అని అనడంతో కథని ముగించడం బాగుంది. కథ రచయితకు అభినందనలు.

ఇక విశిష్ట అతిథి శ్రీ సాయి బ్రహ్మానందం గొర్తి గారి కథ 'ఆ ఇంట్లో ఒక రోజు" లో ఒక రోజులో ఆ యింట్లో జరిగిన సంఘటనలను ఆసక్తికరంగా చెప్పడం వలన కథ ఆద్యంతం చదివింపజేసింది.

చిట్ట చివరగా కథా మార్గదర్శి గారి కథ 'బోన్సాయ్ బ్రతుకు" వాస్తవికతకు అతి దగ్గరగా ఉన్నది. చదివింపజేసింది. కుటుంబ నేపథ్యంలో సాగిన కథ. కథ ముగింపులో అక్కయ్య చెల్లెలితోటన్న మాటలు "మగవాడికి, ఆడదానికి పెంపకంలో ఉన్న తేడా వల్లనే కదుటే... ఆడదాని బ్రతుక్కూడా 'బోన్సాయ్' మాదిరయ్యింది" అని అనడంతో కథ ముగుస్తుంది.

మొత్తమ్మీద సెప్టెంబర్ నెల కథా మంజరిలోని పది కథలూ ఆసక్తికరంగా చదివింపజేశాయనడంలో సందేహం లేదు.

***సి. హెచ్. నాగార్జున శర్మ, తిరుపతి.***

నాగార్జున శర్మగారికి ధన్యవాదాలు. మీరు పంపిన అభిప్రాయాన్ని యథాతథంగా ప్రచురిస్తున్నాం. ఈ సందర్భంగా (అందరికీ) చిన్న విన్నపం. మీరు ప్రతి కథ సారాంశం రాశారు. కానీ ఈ శీర్షికలో ఆపేక్షించినది ఏమిటంటే – మీరు చదివిన కథ – ఓ పాఠకుడిగా – మీ సహేతుక విశ్లేషణ. మీకు ఏది ఎందుకు నచ్చింది, ఏది ఎందుకు నచ్చలేదు. దయచేసి గమనించ ప్రార్థన.

**– సంపాదకుడు**

నేను నాన్న బంగారం – శ్రీ సుధామయి గారు రాసిన ఈ కథ తప్పొప్పుల కలయికగా అనిపించింది. పేదరికంలో ఉన్న తల్లి తండ్రులు కష్టపడి పిల్లల్ని చదివించడం, ఆ కష్టాల్ని తట్టుకునే భాగంలో గృహిణి బంగారు పుస్తెల్ని త్యాగం చేయడం .. చాలా చోట్ల జరిగేదే అయినా బరువైన సన్నివేశాలు. వాటిని చూసి పిల్లలు ప్రభావితం కావడం, స్పందించడం కూడా బాగుంది.

ఎంతో కష్టపడి బంగారం తయారీ గురించి విషయ సేకరణ చేసి, దానిని వాడాలనే తాపత్రయంలో కథలో మిగిలిన అంశాల మీద పట్టుకోల్పోయారు రచయిత. బంగారంది అయినా, పసుపు కొమ్ము అయినా తాళిబొట్టు కి ఇచ్చే విలువ ఎక్కువే. ఇంకొక విషయం – కొడుకు బంగారం తయారుచేయగలడు గానీ ఆభరణాలు కాదు కదా?! అతను ఎక్కువ బంగారం చేయడం

వల్ల స్వర్ణకారులకు ఎక్కువ మంచే జరుగుతుంది కదా?! ఇంకొక వైపు .. అంత ఎక్కువ బంగారం తయారు చేయడం వల్ల దాని ప్రభావం ఆర్థిక వ్యవస్థ మీద ఎంత పడుతుందో కదా! అంత చదువుకున్న కొడుకు ఇవేమీ ఆలోచించకపోవడం కూడా ఎందుకో సమంజసంగా అనిపించలేదు. ఎందుకో ఈ కథకి బలవంతంగా విషాద ఛాయ అద్దారు (forced tragedy) అనిపించింది.

సరస్వతి కరవది గారు కథ చాలా బాగా చదివారు.

***– KVND ప్రసాద్***

---



## కథామంజరి

**శ్రావ్యసంచికలో కథలు చదవడానికి కళాకారులు కావాలి.**



**ఆవశ్యకతలు**


1. స్పష్టంగా తెలుగు చదవగలగడం
2. అర్థవంతంగా, పాత్రోచితంగా ఉచ్చారణ చేయగలగడం
3. ధ్వని ముద్రణ (recording), సంకలనం (editing) లలో ప్రవేశం ఉండాలి.
4. సంగీతం, నాటక రంగాలలో ప్రవేశం ఉంటే మంచిది.

**ఇవి ఉండి, కథామంజరికి కథ చదువుదామని ఆసక్తి ఉన్న కళాకారులు, వారి వివరాలతో బాటు, వారు చదివిన ఒకటి రెండు ఆడియోలను *submit@kathamanjari.in* కి మెయిల్ చేయండి. ఆఖరు తేదీ 10/11/2023.**

**ఒక ముఖ్య విషయం**

**కథామంజరి పూర్తిగా స్వచ్ఛంద సంస్థ. సంస్థకు పనిచేస్తున్న ఎవరికీ పారితోషికం ఉండదు.**
**ఈ విషయం గమనించగలరు.**







## కోనసీమ కథలు

ఎప్పుడో అమెరికా వలస వెళ్ళిపోయినా సరే... తాను పుట్టి, పెరిగిన కోనసీమలో, నిజమైన సంఘటనలు చూసి, ప్రేరణ పొంది శ్రీ సాయి బ్రహ్మానందం గొర్తి గారు వ్రాసిన పదకొండు ఆణిముత్యాల వంటి కథల సంపుటి "కోనసీమ కథలు". ఫిబ్రవరి 2023 లో వెలువడిన ఈ పుస్తకం వెల ₹150/.

**ప్రతులకు**

అనల్పా బుక్ కంపెనీ,
నారెడ్‌మెట్ క్రాస్‌రోడ్స్,
**సికింద్రాబాద్**
ఫోన్; 7093800303.

రచయిత ఫోన్: 408 829 1925
email gorthib@yahoo. com





## ఆర్కేస్ కథా వీధి

సమాజానికి దగ్గరగా, సామాజిక స్పృహతో... విన్నవి చూసిన విషయాలనే కథావస్తువుగా తీసుకుని రచించిన కథలు.. మొత్తం ముప్పై ఐదు కథలు. రచయిత శ్రీ యం.యస్. రామకృష్ణ. వెల ₹ 250/–.

**ప్రతులకు**

రచయిత ఇమెయిల్
aruna.rk1979@gmail.com




## సరాగమాల

మెడికో శ్యామ్‌గారి ఇరవైఒక్క కథల సమాహారమాల.. ఈ "సరాగమాల". కథా ప్రియులను అలరించే ఈ మాల ఖరీదు ₹200/-. సెప్టెంబరు 2015 లో వెలువరించిన ఈ పుస్తకం కొరకు

నవోదయ బుక్ హౌస్,<br>
ఆర్య సమాజ్ మందిరం ఎదురుగా, కాచిగూడ,<br>
**హైదరాబాదు-500 070**<br>
ఫోన్: 040 27607125

## లిటిల్ ట్రబుల్ మేకర్

ఆబాలగోపాలాన్ని అలరించే, శ్రీమతి పి.యల్.యన్. మంగారత్నం గారి కలం నుంచి జాలువారిన ముప్పై నాలుగు కథలతో చక్కని పుస్తకం "లిటిల్ ట్రబుల్ మేకర్". మే 2013 లో ఆవిష్కరింపబడిన ఈ కథల పుస్తకం ఖరీదు ₹ 250/-

ప్రతులకు

శ్రీమతి పి.యల్.ఎన్. మంగారత్నం,<br>
ఇంటి నెం. 8-14-22, FF3, రాజరత్న రెసిడెన్సీ,<br>
ఓలేటి వారి వీధి, గాంధీనగర్,<br>
**కాకినాడ - 533 004**<br>
ఫోన్: 97014 26788








9246573575




# ఆ ఇద్దరి కథ

పి. చంద్రశేఖర ఆజాద్

*పమిడిముక్కల చంద్రశేఖర ఆజాద్‌గారు 1955 లో గుంటూరు జిల్లాలో జన్మించి, స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఇప్పటి వరకు 83 నవలలు, 18 నివేదికలు, 5000 టీవీ ఎపిసోడ్స్‌కి రచన, 14 ఫీచర్స్, కవిత్వం, వ్యాసాలు, ముందు మాటలు, సినిమాలకి మాటామంతి. ఇవి శ్రీ చంద్రశేఖర ఆజాద్‌గారి సాహితీ ఆస్తి. అసలు కథకుల కలం నుంచి జాలువారిన కథ.. పాఠకులకు చేరటమే పెద్ద అవార్డు అంటారు. అలాంటి అవకాశం చాలా సార్లు వచ్చిందని ఆనందంగా చెప్పే శ్రీ ఆజాద్‌గారి నివాసం హైదరాబాద్. బహుమతి వచ్చినందులకు ఆనందంగా ఉందంటూ, అభిప్రాయాల కోసం ఎదురు చూస్తుండటం చాలా ఇష్టం అని అంటారు.*

***ఈ ఆస్తుల కోసమో, పరువు కోసమో మా అమ్మ, అమ్మ కుటుంబం నన్ను రోడ్లమీద వదిలేశారు.***
***నేను చిన్నప్పటి నుండి అభద్రతతో బతికాను. ఎవరినీ కాదనలేను.***
***అందుకే నా గురువు, దైవం చెప్పినప్పుడు కాదనలేకపోయాను.***
***మిమ్మల్ని పెళ్లి చేసుకున్నా నేను మీ కళ్లల్లోకి చూడటానికి భయపడ్డాను.***
***మనకు పిల్లలు పుడితే ఎలా వుంటారో అన్న భయం కలిగింది.***

ఇంకా చీకట్లు తొలగలేదు.

ఆ వీధిలో ఆరు అడుగుల ప్రహరీగోడ లోపల, అయిదారు వందల గజాల్లో రెండు పెంకుటిళ్లు వున్నాయి. అక్కడ బాదం, వేప చెట్లు ఎదిగి వున్నాయి. అలాగే రకరకాల పూల చెట్లు, మొక్కలు వున్నాయి. లోపల ఓ పద్ధతి ప్రకారం అందమైన ముగ్గులతో వాతావరణం నిండుగా వుంది. తులసికోట వుంది. ఓ రకంగా చెప్పాలంటే అదో ఆశ్రమంలా వుంది.

అతను మెల్లగా గేటు తీసుకుని బయటకు వచ్చాడు. చూపులు మాత్రం కిందకి వున్నాయి. అలా నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతనికి ఏదో పేరు వుండుంటుంది. ఆ వీధిలోని వారు 'అంజని మొగుడు' అనుకుంటారు.

మనం 'అనామకుడు' అనుకుందాం. ఎవరీ అనామకుడు? ఎక్కడ నుండి వచ్చాడు? అతని చరిత్ర ఏమిటి? ఈ ప్రశ్నలు ఆ వీధిలో వారికి వచ్చాయి. అతను రెండు సంవత్సరాల క్రితం ఆ ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి ఎవరితోనూ మాట్లాడలేదు. మనుషులకు దూరంగా పారిపోవాలనుకుంటాడు.

అనామకుడు ఏం ఉద్యోగం చేస్తుంటాడో ఎవరికీ తెలియదు. పోనీ ఏదన్నా వ్యాపారం లాంటివి చేస్తాడా అంటే అనుమానమే!

అది ఓ చిన్న పట్నం. అదో కాలనీ. అక్కడక్కడ ఇళ్లుంటాయి... నాలుగు పక్కలా! మధ్యలో పెద్ద మైదానం. అంజని వాళ్ల అమ్మ నాన్నలను, చిన్నప్పుడు అంజనినీ చూసిన వారున్నారు. తర్వాత ఆ అమ్మాయి బయటకు రావటం మానేసింది. చదువు ఆపేసింది. అమ్మా నాన్నలే ఆ అమ్మాయికి చదువు చెప్పేవారు. వాళ్లు కూడా ఏ సరుకులు తెచ్చుకోవటానికో బయటకు వచ్చేవారు తప్ప అదో రహస్య మందిరంగా వుండేది.




అక్కడ అనేక మంది ఆడపిల్లలూ, మగపిల్లలూ క్రమంగా చదువుల కోసం బయటకు వెళ్లిపోయారు. కొంత మంది పెళ్లిళ్లు చేసుకుని వెళ్లిపోయారు.

'అంజనికి పెళ్లి అవుతుందా? ఎవరు చేసుకుంటారు పాపం!' ఈ రకంగా అనుకునేవారు.

ఆ మైదానంలో ఎవరింట్లో శుభకార్యాలు జరిగినా అందర్నీ పిలిచేవారు. అయితే అంజని అమ్మానాన్నలు మాత్రం ఏ కార్యక్రమానికి హాజరు అయ్యేవారు కాదు. అప్పుడప్పుడు అంజనిని తీసుకుని ఎక్కడికో వెళ్లేవారు... కొంతకాలం పాటు! వాళ్ల ఇంటికి ఎదురుగా ఓ ఇల్లు వుంది. వారితో కూడా సంబంధాలు లేవు. అలాంటిది 'అంజని'కి అనామకుడితో పెళ్లి అయిందని తెలిసి అక్కడున్నవారు ఆశ్చర్యపోయారు.

అది ఎక్కడ జరిగిందో తెలియదు. ఇంటి ముందు పందిరి వేయటం గాని, బంధువులు రావటం గాని జరగలేదు. ఏ గుళ్లోనో, ఆశ్రమంలోనో పెళ్లి జరిపించి వుంటారు అనుకున్నారు. మొత్తం మీద అంజనికి పెళ్లి జరిగినందుకు అక్కడి ఆడవారితో పాటు కొందరు మగవాళ్లు కూడా సంతోషపడ్డారు.

‘ఎంతయినా ఆడపిల్ల కదా! తను దురదృష్టవంతురాలు. అలాంటిది ఎవరికయినా రావచ్చు కదా!’ అనుకున్నారు.

అనామకుడు తిరిగి రాత్రి ఇంటికి చేరుకున్నాడు.

అతని దినసరి కార్యక్రమం తెల్లవారుఝామున వెళ్లటం. రాత్రి పొద్దుపోయాక ఇంటికి రావటంగా మారిపోయింది.

★ ★ ★

అనామకుడికి నిద్ర రావటం లేదు.

అతను పై కప్పుకేసి చూస్తున్నాడు. లోకమంతా తనని చూస్తూ నవ్వుతున్నట్లుంది. రోడ్డు మీద తను నడిచి వెళ్తున్నాడు. ఎవరి కళ్లల్లోకి, ముఖాల్లోకి చూడకపోయినా అనామకుడికి అర్థం అవుతోంది. తన కేసి చూపుడు వేళ్లు కదులుతున్నాయి. తన గురించి మాట్లాడుకుంటున్నారు.

“మనుషులకి కావల్సింది డబ్బు. అందుకు ఎలాంటి పనయినా చేస్తారు”.

“అందం ఎవరిక్కావాలి? ముందు కడుపుకు నాలుగు ముద్దలు కావాలి”.

“అందుకు కూలి పనులు చేసుకోవచ్చుకదా!”

“నువ్వూ నేనూ చేసుకుంటాం. అలాంటి వారు చేసుకోరు”.

“ఇల్లరికంలో వుంది మజా....”

“ఇదీ బతుకే?! ఛీ...”

అనామకుడి కళ్ల నుండి ధారాపాతంగా నీళ్లు కారుతున్నాయి. రకరకాల ఆలోచనలు ఒక్కసారిగా చిందర వందరగా కుదిపేస్తున్నాయి.

“చచ్చిపోదామనుకుంటున్నారా?” ఉలిక్కిపడ్డాడు అనామకుడు.

అటూ ఇటూ చూశాడు. అంజని కనిపించలేదు. ‘ఇది నా భ్రమా?’ అనుకున్నాడు.

“ఈ ప్రపంచానికి దూరంగా పారిపోదామనుకుంటున్నారా?” మళ్లీ వినిపించింది.

అప్పుడు చూశాడు. అస్పష్టరూపం నుండి అంజని స్పష్టంగా కనిపించింది. తలదించుకున్నాడు అనామకుడు.

“ఎందుకు తలదించుకుంటున్నారు డియర్ ఫ్రెండ్?” అంది. అతనిలో మరో ప్రకంపనం.

“ఈ ప్రాంతం మీకు కొత్త. మీకు ఎవరితో పరిచయం లేదు. అయినా మీరు తల పైకెత్తి నడవరని నాకు తెలుసు. మనుషుల ముఖాల్లోకి చూడకపోయినా, నా కళ్లల్లోకి ఈ రెండు సంవత్సరాల్లో ఒక్కసారయినా చూశారా? ఎందుకని? అసహ్యమా?”

తల అడ్డంగా వూపాడు.

“మీరేం తప్పు చేశారని లోకం గురించి ఇంతగా ఆలోచిస్తున్నారు?”

నిశ్శబ్దం.

"అసలు ఈ పెళ్లి నేను చేసుకోను అని నన్ను చూసిన రోజు చెప్పాల్సింది! ఎవరికి భయపడ్డారు? బతకలేననా? ఆశ్రమంలోని స్వామీజీకా? మరి నా మెడలో తాళి కట్టినప్పుడు భర్తగా ఎందుకు వుండలేకపోతున్నారు? మిమ్మల్ని మీరు ఎందుకు హింసించుకుంటున్నారు? చివరికి మీ మనసులోకి వస్తున్న ఆలోచనలను నేను చదవగలుగుతున్నాను. ఇంత ఘర్షణ అవసరమా. చిటికెలో బంధం తెంచుకోవచ్చు కదా!"

"నన్ను క్షమించండి అంజనీ!"

"ఎందుకు? మీరు ఏం తప్పు చేశారని? ముందు అది నాకు అర్థం అవ్వాలి కదా!"

అనామకుడు మాట్లాడ లేకపోయాడు.

అప్పుడు అంజని వెళ్లి రెండు పుస్తకాలు అతని ముందు పడేసింది.

"ఇందులో ఓ స్త్రీ వేదన వుంది. ఇవి చదవండి. భర్తగా కాదు, సాటి మనిషిగా. మీరు ఎలాంటి తప్పు చేయలేదు. అలాగే ఇప్పటికీ సమయం మించిపోలేదు. త్వరపడి ఏ నిర్ణయం తీసుకోవద్దు. మనం రేపు మన హనీమూన్‌కి వెళ్తున్నాం. అక్కడకి ఎవరూ రారు. అది కడలి తీరం. అంత వరకే. పదుల కొద్దీ జనం వచ్చే బీచ్ కాదు. ఒకరో అరో వచ్చినా మనల్ని పట్టించుకునే అవకాశం, అవసరం వారికి వుండవు. శుభరాత్రి!" అని అతని ముందు నుండి వెళ్లిపోయింది అంజని.

భయం భయంగా పుస్తకాలు అందుకున్నాడు. పేజీలు తెరుస్తున్నాడు.

★ ★ ★

మొదటి పుస్తకంలో చిన్న కాగితం వుంది.

ప్రియ మిత్రమా,

మన పెళ్లికి ముందు జరగాల్సిన సంభాషణ ఇది! అప్పుడు నాకు అవకాశం ఇవ్వలేదు. మా అమ్మానాన్నలే కాదు... ఆశ్రమవాసులు కూడా! తప్పు జరిగిపోయింది. అది నా వల్ల. అందుకని క్షమించమని అర్థిస్తున్నాను.

నేను పుట్టిన తొలి క్షణాలు!

ఏ అమ్మా నాన్నలకయినా బిడ్డ పుట్టినప్పుడు సంతోషం కలుగుతుంది. మగపిల్ల వాడయితే కాస్త ఎక్కువ ఆనందం కలగవచ్చు. ఆడపిల్లయినంత మాత్రాన కుమిలిపోయే కుటుంబం కాదు మాది. అమ్మానాన్నలకు పదెకరాల భూమి వుంది. బంగారం వుంది. ఇక్కడ వారు అందంగా నిర్మించుకున్న రెండు ఇళ్లు వున్నాయి.

నన్ను చూసిన మరుక్షణం వారి గుండెలు పగిలిపోయాయి.

చేలల్లో ఓ కర్రపాతి దానికి కుండను తగిలిస్తారు. దాని మీద భయంకరంగా బొమ్మలు వేస్తారు. దిష్టిబొమ్మలు... చాలా చూసుంటారు కదా! అంత పెద్ద ముఖం. నా మూతి అచ్చంగా ఆంజనేయస్వామిలా వుంది. ఇదెలా జరిగింది?

అమ్మానాన్నలు అందంగానే వుంటారు. ఎన్ని తరాల కింద ఎవరి జీన్స్ నాకు వచ్చాయో తెలియదు. గర్భంలో ప్రకృతి ఆడే వింత నాటకం గురించి ఎవరికి తెలుస్తుంది. అసలు నేను బతకననుకున్నారు. కానీ నా పిండం గట్టిది. ఎంతో మందికి క్షోభ కలిగించటానికి నేను బతికాను.

ఇక్కడ నేను ఇంకో ప్రమాదానికి కారణం అయ్యాను. నేను పుట్టాక ఇంకొకరిని కనటానికి అమ్మా నాన్నలు ధైర్యం చేయలేదు. అంటే నేను హంతకురాలిని కూడా. నా పుట్టుక వల్ల కనీసం ఒకరిద్దర్ని ఈ లోకంలోకి రాకుండా ఛిద్రం చేశాను. ఆ శిక్షను అనుభవించాలి కదా!

కొంతకాలం నన్ను బడికి పంపారు. నన్ను చూసి అందరూ మొదట్లో భయపడ్డారు. ముఖం పక్కకు తిప్పుకునేవారు. నా గురించి మాట్లాడుకునేవారు. అలా అనిపించేది నాకు. నాకు అంజని అని పేరు పెట్టారు. ఆంజనేయుడి తల్లి కదా! నా స్నేహితుల ఇళ్లల్లో నా పట్ల సానుభూతి వుండేది. ఇది దేవుడి శాపం. అలాంటివారిని మనం ఎగతాళి చేయకూడదు అని చెప్పేవారు. నేను పెరుగుతున్న కొద్దీ నా రూపంలో రకరకాల మార్పులు వస్తున్నాయి. ఎంత కాదనుకున్నా మాస్టార్లు చెప్పే పాఠాల మీద తోటి పిల్లల దృష్టి వుండేది కాదు. అప్పటికీ నేను వెనగ్గా కూర్చునేదాన్ని. అందుకని అమ్మా నాన్నలకి చెప్పి నేను బడి మానేశాను.

నా వల్ల ఇతరులు యిబ్బంది పడకూడదు. నాన్న బాగా చదువుకున్నారు. అమ్మ కూడా! అయినా వ్యవసాయం చూసుకునేవాడు నాన్న. ఇంట్లో ఇద్దరూ నాకు పాఠాలు చెప్పారు. మా ఊరు వెళ్లిపోదాం అనుకున్న క్షణాలు వున్నాయి. నాన్న ఒప్పుకోలేదు. అలాగే నాకు ఓ ట్యూషన్ మాస్టార్ని పెట్టారు. ఆయన ముందుకు వచ్చేదాన్ని కాదు. అన్నట్లు నేను పాటలు పాడుకునేదాన్ని. నా కంఠం అంత గొప్పది కాకపోవచ్చు గాని బాగుంటుందని అనేవారు!

క్రమంగా నాకు నేస్తాలయింది పుస్తకాలు, రేడియో. సినిమాలు చూడాలని ఎప్పుడన్నా అనిపించేది. కానీ రేడియోలో వచ్చే పాటలూ, శబ్ద చిత్రాలు విని ఆనందించేదాన్ని. ముఖ్యంగా పుస్తకాలలో నేను సరికొత్త ప్రపంచాన్ని వెతుక్కున్నాను. నాకు స్నేహితులు అమ్మా నాన్నలే. అప్పుడప్పుడు నన్ను తీసుకుని ప్రకృతిలోకి ప్రయాణం చేసేవారు. అప్పుడు నా ముఖం కనిపించకుండా కప్పుకునేదానిని. నేను నా తోటి పిల్లలకంటే ఎక్కువగా ప్రకృతిని చూశాను. సముద్రాలు, కొండలూ, నదులు, పర్వతాలు, లోయలు, అన్నీ. నాకు కళ్లు ఇచ్చాడు దేవుడు. చెవులను యిచ్చాడు. అందుకు ధన్యవాదాలు చెప్పుకున్నాను. ఈ లోకాన్ని చూస్తున్నప్పుడు, నా వరకు నాకు 'మనం చాలా అదృష్టవంతులం' అనిపించేది. మన కంటే ఎందరెందరో దురదృష్టవంతులు వున్నారని నాకు అర్థమౌతూ వచ్చింది.

మేం గుళ్లు చూశాం. పుణ్యక్షేత్రాలు చూశాం. అలాగే ఎందరో స్వామీజీలను కలుసుకున్నాం. వయసులో నా కంటే పెద్దలు నాకు చేతులు జోడించేవారు. 'అమ్మా! నీలో దేవతని చూస్తున్నాం' అంటుంటే నాకు దుఃఖం వచ్చేది. జీవితంలో వున్న గొప్ప విషాదం ఇదే అనుకుంటాను. మనుషులు ఎన్ని భిన్న కోణాల్లో చూస్తారో కదా!

అనామకుడు చదువుతున్నాడు.

అనేకరకాల అనుభవాలను అంజన రాసుకుంది. అందులో తమ ఇంట్లో పూసిన పూల గురించి, అక్కడకు వచ్చి పలకరించే పిట్టల గురించి వుంది. అలాగే వానచినుకులు పడుతున్నప్పుడు తనూ చిన్న పిల్లగా మారిపోయి అల్లాబిల్లి తిరుగుతుంటే అమ్మా నాన్నలు చూసి దుఃఖ పడటం వుంది. మెరుపులూ, ఉరుములు విరుచుకుపడుతున్నప్పుడు 'ఇవేమీ నన్ను అంతగా భయపెట్టేవి కాదు. నేను పుట్టినప్పటి నుంచి అమ్మానాన్నలు, నాకు ఊహ తెలిసినప్పటి నుంచి రకరకాల రూపాల్లో నేను అనుభవిస్తున్నవే' అంది.

పేజీలు కదులుతున్నాయి.

నేను రజస్వలను అయ్యాను. అలా కానివారు కూడా వున్నారని తర్వాత కాలంలో తెలిసింది. అప్పుడు కూడా అమ్మ పైకి

ఏడ్చింది. నాన్న...! స్త్రీగా పుట్టాక కొన్ని సహజంగా జరిగిపోతాయి అనేక మంది విషయంలో. నిజం చెబుతున్నాను. యవ్వనంలోకి అడుగు పెట్టినప్పుడు ప్రతి ఆడపిల్లకూ వచ్చే కలలూ, కోరికలూ నన్ను తాకలేదని చెప్పను. అయితే బలవంతంగా ఆ ఆలోచనలను నెట్టివేసేదానిని. ముందు భయంతో వణికిపోయేదాన్ని. అసలు సమస్య అప్పటి నుంచి ప్రారంభం అయింది. మాది విశాలమైన మైదానం. అక్కడ ఆడపిల్లలూ, మగపిల్లలు వెన్నెల రాత్రుల్లో ఆడుకునేవారు. వయసు పెరుగుతున్నాక ఆంక్షలు వుండేవి. నాకు మా ఇల్లే మైదానం. నా కంటే చిన్న పిల్లలు కూడా పెళ్లిళ్లు చేసుకుంటున్నారని తెలిసి బాధకలిగేది. ఇంత చిన్న వయసులో చేయటం ఏమిటని?!

మొదటిసారి అమ్మా నాన్నలు నా పెళ్లి గురించి మాట్లాడుకోవటం నేను విన్నాను. అప్పుడు అమ్మకు చెప్పాను. నేను పెళ్లి చేసుకోవాలనుకోవటం లేదని. ఎవరూ నిన్ను చేసుకోరని అంటున్నావా అంది. అలా కాదు. నాకు చేసుకోవాలని లేదు అన్నాను. మేం బతికినంత కాలం నిన్ను చూసుకుంటాం. తర్వాత ఎవరో ఒకరు నీకు తోడుగా వుండాలి కదా అంది అమ్మ. లోకం వుంది కదా అన్నాను. లోకం వున్నప్పుడు మనం ఎందుకు ఇలా అందరికీ దూరంగా వుంటున్నాం అంది అమ్మ. ఈ విషయం గురించి ఆలోచించకు. మనం అనుకున్నంత మాత్రాన అన్నీ జరగవు. ఎలా రాసుంటే అలా జరుగుతుంది అంది.

కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. మా మైదానంలోనే ఇద్దరు అమ్మాయిలు వుండేవారు. వారికి పెళ్లిళ్లు ఆలస్యం అవుతున్నాయి. అందుకు రకరకాల కారణాలు. వచ్చిన సంబంధాలు నచ్చకపోవటం, కట్నాలు, ఉద్యోగాలు, ముఖ్యంగా అంతకు ముందు వారి వ్యాపారాలు బాగున్నా నష్టాలు రావటం, ఆ పిల్లలు అందంగా వున్నా కట్నం లేకుండా చేసుకోవటానికి ఏ అబ్బాయిలూ ముందుకి రాకపోవటం. వారి అమ్మా నాన్నలు పడుతున్న బాధ గురించి అమ్మా నాన్నలు మాట్లాడుకునేవారు. అప్పుడు అనిపించేది ఆడపిల్లగా పుట్టడం శాపమా అని.

అనామకుడు పుస్తకం పక్కన పెట్టాడు. అంజని కనిపిస్తుందేమోనని చూశాడు. తనని అలా వదిలేసి వెళ్లింది. అతనికి తన గురించి ఆలోచనలు మొదలయ్యాయి.

★ ★ ★

అనామకుడికి అమ్మానాన్నలు ఎవరో తెలియదు.

అతను ఓ అనాథాశ్రమంలో పెరిగాడు. చిన్నప్పటి నుంచి అతనికి అమ్మా నాన్నలు ఎవరు? ఎలా వుంటారు? తనను కని ఎందుకు వదిలేశారు? ఎప్పుడయినా అమ్మ నా గురించి తలచుకుంటుందా? నేను గుర్తొస్తే కళ్లవెంట నీళ్లు వస్తాయా... అసలు నేను బతికి వున్నానన్న విషయం అమ్మకు తెలుసా? ఇలాంటి ఆలోచనలే. అతను ఇంట్రావర్ట్‌లా తయారయ్యాడు. మనుషులందరూ తనను చూసి వెక్కిరిస్తున్నట్లు అనిపించేది. అక్కడ నుండి రెండు చోట్లకు మారాడు. అనామకుడికి కూడా పెళ్లి ఆలోచనలు వచ్చేవికావు. తనని ఎవరు చేసుకుంటారు అనే ప్రశ్న ఎదురయ్యేది. పెద్దగా చదువుకున్నది లేదు. శ్రమ చేసి బతకటమే. అలా జరుగుతున్న ప్రయాణంలో అక్కడికి చేరుకున్నాడు. ఈ జీవితం ఇక్కడ ఇలా ముగిసిపోతే చాలు అనుకున్నాడు.

అప్పటికి సమయం ఎంతయిందో తెలియదు. కళ్లు మూసుకుపోతున్నాయి.

అలా నిద్రలోకి జారిపోయాడు.

★ ★ ★

సముద్రం చెంతన అంజని... అనామకుడు కూర్చునున్నారు.

"నా కథ చదివారా?" అంది అంజని.

"చదివాను. నాకూ ఓ కథ వుంది. మీలా నేను రాయలేదు" అన్నాడు తలదించుకుని.

"మీ గురించి నాకు చెప్పారు. మన ఇద్దరి జీవితాలు ప్రత్యేకమైనవే. ఇందులో మన పాత్ర అంటూ లేదు. అయినా అనుభవిస్తున్నాం!" సముద్రం కేసి చూస్తూ అంది. కొద్దిసేపటి తర్వాత తనే మాట్లాడింది.

"ఈ ప్రపంచాన్ని ఎదిరించలేక మీ అమ్మ, మీ కుటుంబం మిమ్మల్ని వదిలేసింది. ఈ ప్రపంచానికి భయపడ్డా మా అమ్మానాన్నలు నన్ను దూరం చేయలేదు వారి నుండి! ఆ రకంగా నేను అదృష్టవంతురాలిని మీతో పోల్చుకుంటే. ఇప్పుడు నేను సూటిగా అడుగుతున్నాను. నాతో పెళ్లికి ఎందుకు ఒప్పుకున్నారు?"

అనామకుడు తలదించుకున్నాడు.

"పెళ్లి చేసుకున్నాక ఆ బాధ్యతలు ఎందుకు తీసుకోలేదు?"

మౌనమే సమాధానం.

"నేను ఈ పెళ్లికి ముందు అంగీకరించలేదు. అందుకు కారణం మీరు అనాథలని కాదు. అనాథలకూ కోరికలుంటాయని నాకు తెలుసు. నన్ను చేసుకోవటానికి ఆ అబ్బాయి ఇష్టపడుతున్నాడా అని అడిగాను. ఇష్టమే అన్నారు. అయినా నేను నమ్మలేదు. కానీ ఇంతకాలం నా కోసం బతికిన అమ్మా నాన్నల కోసం నేను లొంగిపోయాను. అది నా బలహీనత అనండి. పొరపాటు అనండి. ముఖ్యంగా మీరు దైవంగా భావించే స్వామీజీ కూడా నన్ను ఈ పెళ్లికి ప్రేరేపించారు. నువ్వు చిన్నపిల్లవి మా మాట విను అన్నారు" అని...

"ముందు మీరు కళ్లల్లోకి చూడటం అలవాటు చేసుకోండి. ప్లీజ్!" అంది అంజని.

అప్పుడు చూశాడు.

"నేను మీరు నాకు తోడు మాత్రమే అనుకున్నాను. మన మధ్య దాంపత్య బంధం వుంటుందని, వుండాలని నేను అనుకోలేదు. అది కాలానికి వదిలేశాను. అలాగే మిమ్మల్ని చేసుకుని ఉద్ధరిస్తున్నానని అనుకోలేదు. మీకు అన్యాయం జరుగుతోందనుకున్నాను. నన్ను చేసుకుని మీరు త్యాగం చేశాననుకున్నారా?"

అనామకుడు ఉలిక్కిపడ్డాడు.

"మీ మనసులో ఫీలింగ్స్ చెప్పండి. మన జీవితాలను మలుపు తిప్పే సందర్భం ఇది".

తల అడ్డంగా వూపాడు.

"మీరెందుకని అహానికి గురయ్యారు? మీకు తెలిసిన మనుషులు లేని చోట కూడా, కేవలం డబ్బు కోసం ఈ పెళ్లి చేసుకున్నాను అనుకుంటున్నారని ఎందుకు అనుకున్నారు? ఈ ప్రపంచం నుండో, నా నుండో పారిపోవాలని ఎందుకు అనుకున్నారు? ఇది మీ అమ్మ మీకు చేసిన అన్యాయం లాంటిది కాదా? అదే పని పెళ్లికి ముందు చేసి వుండవచ్చు కదా!"

"నేను పిరికివాడిని అంజని గారూ!" అన్నాడు మెల్లగా.

"ఇక్కడికి వచ్చే ముందు మా అమ్మానాన్నలతో మాట్లాడాను. 'మీరు మరో అంజని పుడుతుందని పిల్లల్ని కనలేదు. అదే పనిని నా నుండి ఎలా ఆశిస్తారు?' అన్నాను. వారి దగ్గర సమాధానం లేదు. నేను మీనుండి సంతానాన్ని ఆశించలేదు. కనీసం ఓ ఫ్రెండ్‌గా వుంటారనుకున్నాను. అందుకు కూడా మీరు ధైర్యం చేయలేకపోయారు. అది మీ తప్పుకాదు. నేను మిమ్మల్ని అర్థం చేసుకోగలను. నా మిత్రుడిగా మీకు ఓ సూచన చేస్తున్నాను. మనం ఎవరి బతుకులు వారు బతుకుదాం. మీ ప్రపంచాన్ని మీరు నిర్మించుకోండి. హాయిగా, ఎవరికీ భయపడకుండా బతకండి!" అని బ్యాగ్ నుండి రెండు నోట్ల కట్టలు అందించింది.

అనామకుడు తల అడ్డంగా వూపాడు.

"ఆస్తి వుండి నాకు ఉపయోగం లేదు. ఇవి మీకు అవసరం. కాదనకండి!" అంది అంజని.

"అంజని గారూ... ఈ ఆస్తుల కోసమో, పరువు కోసమో మా అమ్మ, అమ్మ కుటుంబం నన్ను రోడ్ల మీద వదిలేశారు. నేను చిన్నప్పటి నుండి అభద్రతతో బతికాను. ఎవరినీ కాదనలేను. అందుకే నా గురువు, దైవం చెప్పినప్పుడు కాదనలేకపోయాను. మిమ్మల్ని పెళ్లి చేసుకున్నా నేను మీ కళ్లల్లోకి చూడటానికి భయపడ్డాను. మనకు పిల్లలు పుడితే ఎలా వుంటారో అన్న భయం కలిగింది. మరో అనాథను అందించబోతున్నామా అని అల్లాడిపోయాను. అదే సమయంలో నన్ను ఈ లోకం ఎగతాళి చేస్తున్నట్లు వూహించుకున్నాను. తెల్లవారితే నేను మీ ఇంటి నుండి వెళ్లటమా, ఆత్మహత్య చేసుకోవటమా అనేది ఆలోచిస్తున్నప్పుడు మీరు మాట్లాడారు. మీ పుస్తకాలు చదివాను. ఇప్పుడు నాకు కావలసింది డబ్బు కాదు. ధైర్యం. అది నేను సాధించాక మీ దగ్గరికి వస్తాను. నన్ను క్షమించండి!" అని లేచాడు.

నాలుగు అడుగులు వేసి వెనక్కివచ్చాడు.

"అంజని గారూ... మీరు నా ఫ్రెండ్... ఫిలాసఫర్... మీ కంటే పెద్ద వారు మీలో దేవతను ఎందుకు చూశారో నాకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. నాది చిన్న కోరిక!"

అతన్నే చూస్తోంది.

"మీరు కూడా ఇంట్లో కూర్చోనవసరం లేదు. ధైర్యంగా సమాజం ముందుకు రండి. మనిద్దరం కలుసుకునే మంచి రోజు రావాలని నేను కోరుకుంటున్నాను!"

అంజని అనామకుడ్ని చూస్తోంది. సముద్రపు అల ఆమె పాదాలను తడిపి వెళ్లింది!

# రాచనాగు



7588630243

ద్వితీయ బహుమతి పొందిన కథ

## సలీం

*1959 లో ఒంగోలు త్రోవగుంట గ్రామంలో జన్మించిన సయ్యద్ సలీంగారు ఎమ్.యస్సి. చదివారు. మూడు కవితా సంపుటాలు, పదకొండు కథా సంపుటాలు, ముప్పై నవలలు.. సలీం గారి సాహితీ బ్యాంకులో చోటు చేసుకున్నాయి. సలీం గారి "కాలుతున్న పూలతోట" నవలకు 2010 లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. వారి రచనలెన్నో ఆంగ్లం, హిందీ, మరాఠీ, ఒరియా, కన్నడం, మలయాళం, తమిళ భాషలలోకి అనువాదం చేయబడ్డాయి. బాలల కోసం ఆరు సైన్స్ నవలికలు వ్రాసారు. వీరి "వెండి మేఘం" నవల తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీలలో ఎమ్. ఏ. తెలుగు సిలబస్‌లో చేర్చబడింది. మరికొన్ని రాయలసీమ యూనివర్సిటీలో పాఠ్యాంశంగా చేర్చారు. ఎన్నో పురస్కారాలు అందుకున్న సలీం గారి రచనల మీద పన్నెండు మంది పి. హెచ్. డి/ఎమ్. ఫిల్. చేశారు.*

***రాచనాగుల ఆహారం మిగతా జాతి పాములే! కొన్నిసార్లు రాచనాగులు తమ జాతి పాముల్ని కూడా తినేస్తాయి. ముఖ్యంగా మగపాములు ఆడపాముల్ని తింటాయి. ఆడదైనంత మాత్రాన బలహీనురాలు మాత్రం కాదని నిరూపించే సంఘటనలు అప్పుడప్పుడూ జరుగుతుంటాయి. ఆ మగపాము మీద ఎన్నిరోజుల్నుంచి దాచుకున్న కసీ కోపమో ఆ ఆడపాముకి.. అమాంతం మింగేసింది!"***

మన్ననూర్ గెస్ట్‌హౌస్‌లో బ్యాగేజ్ పడేసి, భుజానికి క్యానన్ కెమేరాని తగిలించుకుని, నల్లమల అడవి లోపలికి ప్రయాణం... వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీ నా హాబీ! దారిలో జింకల గుంపు కన్పించింది. మరికొంతదూరం వెళ్ళాక అడవిపంది తన పిల్లల్తో రోడ్డు దాటుతూ కన్పించింది. ఈసారి అడవిలోకి వెళ్తోంది జింకల్నో, చిరుతపులుల్నో ఫోటోల్లో బంధించడానికి కాదు. పాముల్లో కేవలం కింగ్‌కోబ్రా పాములు మాత్రమే గుడ్లు పెట్టడానికి ముందు గూళ్ళు కడ్తాయని చదివినప్పటినుంచి నా ఆసక్తి అంతా అవి గూడుకడ్తున్న దృశ్యాల్ని చిత్రించాలనే... మొదట అడవిలో కింగ్‌కోబ్రాలు తిరుగాడే ప్రాంతాలేమిటో తెల్సుకోవడం అవసరం.

చెంచుపెంటల్లో నివసించేవాళ్ళకు తప్పకుండా ఆ సమాచారం తెల్సిఉంటుందన్న నమ్మకంతో ఓ గూడెంలోకి ప్రవేశించాను. ప్రాథమిక పాఠశాల అని బోర్డు పెట్టిఉన్న ఆవరణలో బర్రెగొడ్లని అదిలిస్తూ ఓ యాభైయేళ్ళ వ్యక్తి కన్పించాడు.


"ఈ అడవిలో పాములు ఎక్కువగా ఎక్కడ కన్పిస్తాయో నీకు తెలుసా?" అని అడిగాను.

"పాములా? ఎందుకు?" నా వైపు అనుమానంగా చూస్తూ అడిగాడు.

"ఫోటోలు తీయడానికి" భుజానికున్న కెమేరాను చూపిస్తూ అన్నాను.

ఓ వైపు చేయి చూపిస్తూ "ఇట్టా నేరుగా మైలు దూరం ఎల్లావనుకో, పాడుబడిన ఓ గుడి కన్పడ్తది. దాని సుట్టుపక్కలే పాములు తిరగతా ఉంటయ్!" అన్నాడు.

"నాగుపాముల్లో రాచనాగులని ఉంటాయే... అవి కూడా కన్పిస్తాయా?"



అతను కొద్దిసేపు ఆకాశం వైపుకి తల గోక్కుంటూ చూశాడు. మళ్ళా నా వైపు తిరిగి "నువ్వు సెప్పేది నాగరాజుల గురించా? ఆ ఇసయం మా గూడెంలో సింగినడిగితే సెప్తది. మా గూడేల్లో సింగి సదివినంత సదువు ఎవ్వలూ సదవలా! పాముల యవ్వారాలు ఏమడిగినా సిటికెలో సెప్పేత్తది. అబ్బో.. శానా గ్యానం ఉందిలే. పాము కర్సిన మడిసిని సూత్తే సాలు... కర్సింది ఏజాతి పామో ఇట్టే సెప్పేత్తది!" అన్నాడు.

సింగి ఉండే గుడిసేదో కనుక్కుని, మెల్లగా అటు వైపుకి నడిచాను. గుడిసె తలుపు తీసే ఉంది. నన్ను చూసి ఓ ఇరవై యేళ్ళ అమ్మాయి బైటికొచ్చింది.

"సింగిని పిలుస్తావా మాట్లాడాలి!" అన్నాను.

"నేనే సింగిని. ఏంటో చెప్పండి" అంది నా వైపు పరిశీలనగా చూస్తూ.

సింగి అనే ఆవిడకు నలభయ్యో, యాభయ్యో వయసుంటుందనుకున్నా! ఇరవయ్యేళ్ళ అమ్మాయా? ఆశ్చర్యపోతూ ఆమె వైపు చూశాను. తెల్లటి కలువపూవుల్లా చారెడేసి కళ్ళు... ఉంగరాల జుట్టు... బుగ్గల్లో నిగారింపు... ఐదడుగుల రెండంగుళాల ఎత్తుతో సన్నగా జాజిమల్లె తీగలా ఉంది. రంగు చామన ఛాయైనా ఇప్పసారాయిలా మత్తెక్కించే అందం ఆమెది.

"ఈ అడవిలో కింగ్‌కోబ్రాలు అంటే రాచనాగులు తిరుగాడే స్థలాల వివరాలు కావాలి. వాటి ఫోటోలు, వీడియోలు తీసి యూట్యూబ్‌లో పెట్టడానికి" అన్నాను.

అప్పటివరకు ప్రసన్నంగా ఉన్న ఆమె మొహం ఒక్కసారిగా కోపంతో ఎర్రబడింది. "మీ ఫోటోగ్రాఫర్లందరూ ఎగబడేది రాచనాగుల మేటింగ్ డ్యాన్స్ని రికార్డు చేయడానికేగా. వాటి మానాన వాటిని బతకనీయరా? ఎందుకు వాటి ప్రశాంతతని పాడుచేస్తారు? మీరు మీ ఆడోళ్ళతో ఉన్నప్పుడు ఎవరైనా చూస్తే మీకెలా ఉంటుంది? వెళ్ళిపొండి. మా అడవి జోలికి రాకండి!" అంది.

ఇందాక నీలం రంగు నేతచీరలో అందమైన ఆకాశంలా కన్పించిన సింగి, ఇప్పుడు మెరుపుల కొరడాలు ఝుళిపిస్తూ, ఉరుముతున్న మేఘంలా కన్పించి, భయమేసి, అక్కణ్ణుంచి వేగంగా బైటపడ్డాను. ఇంకా నయం... కింగ్‌కోబ్రాల గూళ్ళను ఫోటో తీయాలనుకుంటున్నానని చెప్పి ఉంటే, శివంగిలా నా మీదకు దూకి రక్కేసి ఉండేది.

సమయం నాలుగ్గంటలు కావస్తోంది. యిందాకటి మనిషి చూపించిన దారి వైపు నడుచుకుంటూ అడవిలోకి వెళ్ళాను. కొంత దూరం వెళ్ళాక శిథిలమైన ఆలయం కన్పించింది. గోడలు కూలిపోయి, వాటిల్లో మొక్కలు మొల్చుకొచ్చాయి. లోపలికెళ్ళి చూశాను. శివలింగం... దాని ఎదురుగా సగానికి పైగా విరిగిపోయిన నంది విగ్రహం... ఆలయానికి కొద్ది దూరంలో పెద్ద చెరువు... దాన్లో విశాలంగా పర్చుకున్న పచ్చటి తామరాకుల మధ్య తెల్లటి తామరపూలు... గట్టు మీద రక్షకభటుల్లా నిలబడిఉన్న రకరకాల చెట్లు...

సమయం ఆరు కావస్తోంది. సంధ్యారుణ కాంతులు అడవి మీద గులాబీపూల దుప్పటి కప్పినట్టు మనోహరమైన దృశ్యం...

రెండు ఫర్లాంగులు వెనక్కి నడిచి ఓ చెట్టెక్కి కూచున్నాను.

చుట్టూ దట్టమైన అడవి. వెన్నెల చెట్ల సందుల్లోంచి దూరి నేల మీద మడుగులు కడ్తోంది. అప్పటికి నాలుగ్గంటల నుంచి చెట్టు మీద కూచుని, ఎదురుచూస్తున్నాను. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌కి ఉండాల్సిన మొట్టమొదటి లక్షణం ఎన్ని గంటలైనా, ఎన్ని రోజులైనా ఓపిగ్గా ఎదురుచూడటం... దూరం నుంచి ఏవో జంతువుల అరుపులు విన్పిస్తున్నాయి. పగటిపూట వెల్తురులో అందమైన ఆకుపచ్చ అద్భుతంలా అలరించే అడవి, రాత్రయ్యేసరికి అనంతమైన రహస్యాల్ని దాచుకున్న మంత్రనగరిలా భయపెడ్తోంది. అడుగడుగునా ఆపదల్ని దాచిపెట్టిన ప్రహేళికలా అడవి...

చెట్లమీద విశ్రాంతి తీసుకుంటున్న పక్షులు, ఏదో పీడకల కన్నట్టు, రెక్కలు టపటపా కొట్టుకుంటూ ఉలిక్కిపడి లేచి మళ్ళా నిద్రలోకి జారుకున్నాయి. ఏదైనా అడవి జంతువు వస్తున్నదానికి అది హెచ్చరికలా అన్పించి, అప్రమత్తమై జాగ్రత్తగా కిందికి చూశాను. అది చెట్ల నీడల్లోంచి మెల్లగా పాకుతోంది. దాదాపు పదిహేను అడుగుల పాము... కింగ్‌కోబ్రా...

స్వతహాగా కింగ్‌కోబ్రా జాతి పాములు సిగ్గరివి. మనుషులు కన్పిస్తే చాటుకి తప్పుకుంటాయి తప్ప... ఎదురుపడి, బుసలు కొట్టి, భయపెట్టవు! అది కొంతదూరం వెళ్ళేవరకు ఆగి, కిందికి దిగి, దాన్ని నిశ్శబ్దంగా అనుసరించసాగాను.

మే నెల మొదటి వారం... ఆడ కింగ్‌కోబ్రాలు గుడ్లను పొదిగే కాలం... ఎండా కాలంలోనే ఈ పాములు సంభోగలాలసతో తోడుకోసం వెతుక్కుంటాయి. పొందు కోరుకునే ఆడపాము ఓ రకమైన వాసనని వెదజల్లుతుంది. మగపాము ఎంత దూరంలో ఉన్నా ఆ వాసనని గ్రహించి, ఆడపామును చేరుకుంటుంది.

నేను అనుసరిస్తున్న పాము మగపామై ఉంటుంది. ఆడపాములు పన్నెండడుగుల పొడవుని మించి ఉండవు. కింగ్‌కోబ్రా ఆహారం కోసం పగటిపూటే వేటకు బయల్దేరుతుంది. ఈ పాము రాత్రి పూట బైటికొచ్చిందంటే తప్పకుండా ఆడపాము పొందుకోసమేనని నిర్ధారణకు వచ్చాను.

వెన్నెల వెలుగులో పాము సరసరా ముందుకు పాకుతోంది. పాడుపడిన శివాలయం దాటి, పాము మరికొంత ముందుకు పోయింది. అక్కడ చెరువు గట్టునున్న చెట్టు మొదళ్ళో ఎదురుచూస్తున్న ఆడపామును చేరుకుంది.

సగానికి పైగా విరిగిపోయిన గుడి ప్రహరీగోడను చాటుగా చేసుకుని, నా కెమేరాని ఎక్కుపెట్టి షూట్ చేయడం మొదలెట్టాను. కింగ్ కోబ్రాల సమాగమ నృత్యం అద్భుతంగా ఉంటుంది. కానీ నా ఆసక్తి అందులో లేదు. ఇంటర్నెట్ తెరిచి చూస్తే అటువంటి వీడియోలు చాలా దొరుకుతాయి. నా దృష్టంతా ఆడపాము గుడ్లని పెట్టటం కోసం గూడు కట్టుకునే విధానాన్ని చిత్రించడం పైనే ఉంది. అది ఇప్పటివరకూ ఎవ్వరూ సాహసించని పని! ఆడపాములు తమ శరీరాన్ని లూప్‌లా చేసి, ఆకుల్ని, మట్టిని, చెత్తని ఓ చోటకు లాగి దాదాపు రెండడుగుల ఎత్తు, నాలుగడుగుల వెడల్పు ఉండేలా గూడుని ఏర్పాటు చేసుకుంటాయి. దాన్లోని ఓ అరలో ఇరవై నుంచి యాభై గుడ్ల వరకు పెడ్తాయి. వేరే జంతువుల నుంచి గుడ్లని రక్షించుకోవడం కోసం ఆడపాము చాలా భీకరంగా పోరాడుతుంది.

ఎటొచ్చీ ఇప్పుడు దొరికిన అవకాశాన్ని వదులుకోవడం ఇష్టం లేక వాటి సమాగమ నృత్యాన్ని చిత్రించే పనిలో నిమగ్నమైనాను. మగపాము ఆడపాము శరీరాన్ని తన బలమైన శరీరంతో చుట్టి, నాలుకని బైటపెడ్తూ ఆడపాముని ఆకట్టుకోడానికి రకరకాల విన్యాసాలు చేస్తోంది. ఆడపాము ముందుకు జరిగినపుడల్లా మగపాము కూడా ముందుకు జరిగి దాని శరీరాన్ని తన శరీరంతో పెనవేసి, ఆడపాముని లొంగదీసుకునే ప్రయత్నం చేస్తోంది. దాదాపు ఇరవై నిమిషాల తర్వాత ఆడపాము సమాగమానికి అనుకూలంగా తన శరీరాన్ని మెలి తిప్పింది!

నా వెనక ఏదో కదిలినట్టనిపించింది. కెమేరాని కదలకుండా పట్టుకుని, పక్కకు తిరిగి చూశాను.

సింగి! గోధుమరంగు నేతచీరలో... గోధుమరంగు తాచుపాములా బుసలు కొడ్తోంది. ఆమె కళ్ళు మిన్నాగుల్లా మెరుస్తున్నాయి. "ఏం చేస్తున్నారిక్కడ?" మీదకు దూకబోతున్న చిరుతపులిలా నా వైపు కోపంగా చూస్తూ అంది.

నేను షూట్ చేస్తున్నదేమిటో అర్థమైనదానిలా, "మీ మైదానపోళ్ళు మా అడవికెందుకొస్తారు? ప్రశాంతమైన మా జీవితాల్లో ఎందుకు అలజడి లేపుతారు? మీకు ముందే చెప్పాగా రాచనాగులు సంగమించే సమయంలో వాటిని చూడకూడదని... వాటి ఏకాంతానికి భంగం కలిగించకూడదని!" అంది.

పాములు రెండూ విడివడ్తున్నాయి. వీడియోని ఆపేసి, ఆమె వైపు చూస్తూ "సారీ" అన్నాను. అదే సమయంలో శివాలయం వెనక వైపునుంచి ఓ మగ వ్యక్తి వేగంగా నడుచుకుంటూ వెళ్ళడం గమనించాను.

సింగి యింకా కోపంగానే ఉండటం గమనించి, "సారీ... యిక వాటి జోలికి వెళ్ళను. ఫోటోలు తీయను. ప్రామిస్!" అన్నాను.

కొద్దిసేపటి తర్వాత సింగి మొహం ప్రశాంతంగా మారింది. ఆమె పక్కన మెల్లగా నడుస్తూ "ఈ సమయంలో నువ్విక్కడెందుకున్నావు?" అని అడిగాను.

"శివాలయం ఎదురుగా ఉన్న చెరువులో ఎన్ని తామరపూలో.. వెన్నెట్లో చెరువు గట్టున కూచుని వాటిని చూడటం నాకెంతిష్టమో..."

"ఇంత రాత్రిపూట?"

"వెన్నెల కురిసేది రాత్రులేగా!" అంటూ నవ్వింది.

ఆమె చెప్పింది అబద్ధమని తెలుస్తోనే ఉంది. "ఎవరతను?" అని అడిగాను.

"చూశావన్నాంట... నా ప్రియుడు."

"పెళ్ళి కాకుండా తప్పు కదా!" అన్నాను.

"ఇష్టమైన మగాడితో సమాగమం తప్పు కాదు. మా గూడెం మనుషులు ఈ అడవిలోని జంతువుల్లా, పక్షుల్లా స్వేచ్ఛాజీవులు. మీ మైదానపోళ్ళకు మల్లే మాకేమీ సంకెళ్ళు లేవు."

"ఐనా ఇంత రాత్రి... ఆరుబయట... ఏ విషప్పురుగో కుడితే... ఏ జంతువో దాడి చేస్తే..."

"ఈ అడవి మా దేవత... ఈ చెట్లు మమ్మల్ని సాకే తల్లులు! మమ్మల్ని కాపాడుతూ ఉండే ఆకాశ దేవర... మాకేమీ కాదు!" అంది.

గూడెం దగ్గర పడింది. "నేను వెళ్తాను" అన్నాను.

"ఎక్కడికి వెళ్ళేది? ఈ చీకట్లో అడవిలో ప్రయాణం ఎంత ప్రమాదమో తెలుసా? ఈ రాత్రికి నా గుడిసెలో పడుకుని, ఉదయం వెళ్ళండి!" అంది.

ఏదో సుగంధ మూలికను నూరి మెడకింద, చెంపలపైన గంధంలా పూసుకున్నట్టుంది... ఆమె వొంట్లోంచి వస్తున్న వాసన చాలా మత్తుగా ఉంది. ఆడపాము వెదజల్లిన సెంట్ వాసనకు ఆకర్షించబడిన మగపాములా ఆమెతో పాటు గుడిసెలోకి వెళ్ళాను.

నాలుగడుగుల పొడవున్న మద్ది దుంగతో నెగడు వెలిగించింది. దానికటువైపు తను, ఇటువైపు నేను చాపలు పర్చుకుని పడుకున్నాం.

"ఇది రాత్రంతా మండుతూ ఉంటుంది. జంతువులూ విషకీటకాలూ ఏవీ లోపలికి రావు. భయపడకండి!" అంది నవ్వుతూ.

ఆమె శరీరం వెదజల్లుతున్న సువాసన విస్కీకన్నా మత్తుగా ఉంది. నాలో కోరిక నెగడులా మండుతోంది. ఆమె వొంపుల మీద తచ్చాడుతున్న నా చూపుని పసిగట్టి "నేను కావాలా?" అని అడిగింది.

నాలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న దేహవాంఛ... 'తట్టుకోలేకుండా ఉన్నాను. నన్ను కరుణించు' అనేలా ఆశగా చూశాను.

ఆమె పెద్దగా నవ్వింది. తెరలు తెరలుగా నవ్వింది. "ఇందాకేగా పెళ్ళికాకుండా సంగమిస్తే తప్పు కాదా అని అడిగారు. ఇప్పుడు మీతో కలిస్తే తప్పు కాదా?" అంది.

నా కోరిక మీద కుండెడు నీళ్ళు చల్లుతున్నట్టు... ఆ నవ్వులో వెటకారం.

"అందుకే మాకు మైదానపోళ్ళంటే ఇష్టం ఉండదు. పాముకున్నట్టు వాళ్ళకు రెండు నాల్కలుంటాయి. మనసులో ఒకటి, బైటొకటి మాట్లాడతారు. కపటం... కల్మషం... మా గూడెపోళ్ళలా నిజాయితీగా ఉండరు."

"నేనలా అనడం తప్పే. నన్ను మన్నించు. నా కోరికను కాదనకు."

"మీకు నామీద కోరిక కలిగితే సరిపోదు. నాక్కూడా మీమీద కోరిక కలగాలిగా. లేదు. కలగదు."

"ఎందుకు? శివాలయం దగ్గర నువ్వు కలిసిన మగవాడికంటే నేను తీసిపోయానా?"

"మీరు మాట్లాడేది బాహ్య సౌందర్యం గురించైతే మీరతనికన్నా బావుంటారు. కానీ ఆత్మ సౌందర్యం గురించి మాట్లాడాల్సి వస్తే, మా గూడెం వాళ్ళే అందగాళ్ళు!"

"అతన్నే పెళ్ళి చేసుకోలేకపోయావా? ఇలా చాటుగా అడవిలో కలవడాలుండవుగా."

"మా గూడెంలో ఎవరేం చేసినా చాటుగా చేయరు. ఆరుబైట అడవి మధ్యలో వెన్నెట్లో కలవడంలో ఉన్న ఆనందం ఏమిటో మీ మైదానపోళ్ళకు తెలియదు. అతనికి పెళ్ళయింది. నాకు బావౌతాడు. స్వయానా మా అక్క మొగుడు."

"అలానా? నువ్వతనితో సంబంధం పెట్టుకున్న విషయం మీ అక్కకు తెలిస్తే బాధపడదా?"

"బతికుంటే బాధపడేదేమో... ఏడాది క్రితం చనిపోయింది."

"చనిపోయిందా? ఎలా?"

"పాము కాటేసి... చనిపోయింది. దుంపలేరుకోడానికి అడవిలోకి వెళ్ళిందట. పాము కాటేసింది. నాగుపాము!" ఆమె కళ్ళలో పాములా చుట్టచుట్టుకుని పడుకుని ఉన్న విషాదం.

"అక్క ఎలాగూ లేదుగా. పెళ్ళి చేసుకుంటే తప్పేమిటి?"

"అక్క బతికున్నా పెళ్ళి చేసుకోవడంలో మాకు తప్పులేదు. మా గూడెంలో ఇద్దరు పెళ్ళాలున్నవాళ్ళు చాలామంది ఉన్నారు. కానీ అతన్ని చేసుకోవడం నాకిష్టం లేదు."

"ఎందుకు?"

"చాలా దుర్మార్గుడు. మా అక్కను రోజూ హింసించేవాడు. అక్క బతికున్నన్ని రోజులు నరకం చూపించాడు. నాకు మా అక్కంటే ఎంతిష్టమో... అక్కక్కూడా నేనంటే ప్రాణం. నాలా అది చదువుకోలేదు. ఉత్త అమాయకురాలు. నాకు మొదటి నుంచీ చదువంటే ఆసక్తి. పెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగం చేయాలని కలలు కనేదాన్ని. డిగ్రీ రెండో సంవత్సరం పరీక్షలు జరుగుతున్న సమయంలో అక్క చనిపోయిన వార్త తెలిసింది. పరీక్షల్ని సగంలో వదిలేసి గూడేనికి వచ్చేశాను. మళ్ళా హాస్టల్‌కి తిరిగెళ్ళలేదు." ఆమె కళ్ళల్లోంచి జారుతున్న కన్నీటి చుక్కలు నెగడు మంటలో ఎర్రగా నిప్పురవ్వల్లా కన్పించాయి.

"అసలు వాళ్ళ మధ్య గొడవలెందుకు వచ్చేవి?"

"నా వల్లనే. పెళ్ళిలో మా బావ నన్ను మొదటిసారి చూశాడు. అప్పటినుంచి నా వెంటపడి వేధించసాగాడు. పెళ్ళి చేసుకుందామని బలవంతపెట్టసాగాడు. నాకిష్టం లేదని ఎంత చెప్పినా వినేవాడు కాదు. నువ్వు ఒప్పుకోకపోతే అక్కను వదిలేస్తానని బెదిరించేవాడు. నన్ను లొంగదీసుకోవడం కష్టమని అర్థమై, అక్క వైపు నుంచి ప్రయత్నించడం మొదలెట్టాడు. 'నీ చెల్లిని పెళ్ళికి ఒప్పిస్తావా లేదా?' అంటూ అక్కను గొడ్డుని బాదినట్టు బాదేవాడు."

నాకు వెంటనే ఓ అనుమానం వచ్చింది. "మీ అక్క నిజంగానే పాము కరిచి చనిపోయిందా?" అని అడిగాను.

"నోట్లో నురగను తుడిచేశానన్నాడు. పిక్క మీద రెండు గాట్లు... పాము కరిచిందనే నమ్మారందరూ. నా నమ్మకంతోనో, అపనమ్మకంతోనో ఒరిగేదేముంది? నిజమేమిటో ఎవరికి తెలుసు? అడవిలోని చెట్లు, ఆకాశ దేవుడు సాక్ష్యాలు. కానీ వాళ్ళకు నోరు లేదుగా."

"అతను దుర్మార్గుడంటున్నావు. అతనంటే ఇష్టం లేదంటున్నావు. ఇష్టం లేనపుడు కలవడం దేనికి?"

"చెరువు గట్టున ఆడపాము శరీరం కోరికతో ఎలా దహించుకుపోయిందో చూశారుగా. నాకూ శరీరముందిగా. మరి దానికి కోరికలుండవా? అవి తీర్చకోవాలంటే ఓ మగతోడు అవసరం కదా."

నాకు ఆమె మనస్తత్వం అర్థం కాలేదు. అతన్తో పెళ్ళి ఇష్టం లేదంటుంది. అక్కను హింసించాడంటుంది. కోరికలు తీర్చుకోడానికి మాత్రం అతను కావాలంటుంది.

"అతనే ఎందుకు? మీ గూడెంలో యింకెవరూ లేరా నీ కోరిక తీర్చడానికి?"

"నా పొందుకోసం ఐదేళ్ళనుంచి పరితపించిన వ్యక్తి కదా. అందుకనీ... జాలిపడి..." అంటూ అదోలా నవ్వింది. ఆ నవ్వు పాము బుసలా విన్పించింది.

★★★

ఉదయం లేచాక గెస్ట్‌హౌస్‌కి చేరుకున్నాను. కానీ సింగికి మాటిచ్చినట్టు రూం ఖాళీచేసి, వెళ్ళిపోలేదు. రాత్రి మళ్ళా కింగ్‌కోబ్రాల్ని వెతుక్కుంటూ అడవిలోకి బయల్దేరాను. చెరువుగట్టునున్న చెట్ల కింద గూడు కట్టుకునే అవకాశం ఉంది కాబట్టి నేరుగా శిథిలమైన శివాలయం దగ్గరకు చేరుకున్నాను.

పౌర్ణమి రాత్రి... వెన్నెల జలపాతంలా కురుస్తోంది. కెమేరాను జూమ్ చేసి చెరువుగట్టున ఉన్న చెట్ల కింద పరిశీలించసాగాను. గూళ్ళు కన్పించలేదు... గూడు కడ్తున్న ఆడపాములూ కన్పించలేదు. కానీ ఓ చెట్టు మొదల్లో సమాగమనృత్యం చేస్తున్న పాముల జంట కన్పించింది. ఎన్నిసార్లు రికార్డ్ చేసినా అదేగా అన్పించి, కెమేరాని ఆవలిగట్టు వైపుకు తిప్పాను. రెండు మానవ దేహాలు... నగ్నంగా... నాగుపాముల్లా పెనవేసుకుని... బుసలు కొడ్తూ... మొహాలు స్పష్టంగా కన్పించడం లేదు. మరింత జూమ్ చేసి చూశాను. సింగి... ఆ మగతను ఆమె బావై ఉంటాడు. నా లోపల రాజుకుంటూ ఈర్ష్య...

కెమేరాని మళ్ళా పాముల సమాగమం వైపు ఫోకస్ చేశాను. కొద్దిసేపటి తర్వాత విసుగు పుట్టి, రికార్డింగ్ ఆఫ్ చేయబోతున్న సమయంలో కంట పడిందా దృశ్యం... మగపాము తల ఆడపాము నోట్లో ఉంది. ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయాను. రతికార్యం తర్వాత కొన్నిసార్లు మగ కింగ్‌కోబ్రా, ఆడపాముని తినేస్తుందని చదివాను. మగపాము, ఆడపాము కంటే మూడ్నాలుగు అడుగులు పొడవుగా, బలంగా ఉంటుంది కాబట్టి ఆడపాము తప్పించుకోలేదు. కానీ నా కళ్ళముందు ఆడపాము మగపాముని కొద్దికొద్దిగా మింగుతోంది. మగపాము శరీరం గిలగిలా కొట్టుకుంటోంది. మెల్లగా అతి మెల్లగా మొత్తం పాముని మింగేసింది.

నా భుజం మీద చేయి పడటంతో ఉలిక్కిపడి చూశాను. సింగి... ఆమె కళ్ళు వెన్నెట్లో వజ్రాల్లా మెరుస్తున్నాయి. రతికార్యం వల్ల కలిగిన సంతృప్తి వల్ల కావొచ్చు!

"మిమ్మల్ని మీ వూరికి తిరిగెళ్ళమన్నాను కదా. మళ్ళా అడవిలోకి ఎందుకొచ్చారు?" అంది.

"రాబట్టేగా ఆడపాము మగపామును తినే అరుదైన దృశ్యాన్ని చూడగలిగాను!" అన్నాను.

"అందుకే మీ నగరవాసులంటే నాకిష్టం ఉండదు. మాటకు కట్టుబడని జాతి!" అంది.

ఇద్దరం గూడెం వైపుకు నడుస్తున్నాం.

"నేను హాస్టల్ వదిలేసి గూడేనికొచ్చినప్పటినుంచి రాచనాగుల మీద ఆసక్తి ఏర్పడింది. రాచనాగుల ఆహారం మిగతా జాతి పాములే! కొన్నిసార్లు రాచనాగులు తమ జాతి పాముల్ని కూడా తినేస్తాయి. ముఖ్యంగా మగపాములు ఆడపాముల్ని తింటాయి. ఆడదైనంత మాత్రాన బలహీనురాలు మాత్రం కాదని నిరూపించే సంఘటనలు అప్పుడప్పుడూ జరుగుతుంటాయి. ఆ మగపాము మీద ఎన్నిరోజుల్నుంచి దాచుకున్న కసీ కోపమో ఆ ఆడపాముకి... అమాంతం మింగేసింది!" అంది.

"ఈ రాత్రికి కూడా నా గుడిసెలోనే మీ విడిది. తప్పుడు ఆలోచనలు చేయరుగా! నేను కూడా మీరు చూసిన ఆడ రాచనాగులాంటిదాన్నే. జాగ్రత్త!" అంటూ పెద్దగా నవ్వింది. ఆ నవ్వుకి నా వొళ్ళు జలదరించింది.

నెగడుకి ఆ వైపు తను, ఈ వైపు నేను... చాలాసేపటివరకు నిద్ర పట్టలేదు. కళ్ళముందు ఆడపాము మగపామును మింగిన దృశ్యమే కన్పిస్తోంది. అర్ధరాత్రి దాటాక మాగన్నుగా నిద్రపట్టింది. ఏవేవో పీడకలలు... ఓ కలలో చెరువు గట్టున నేనూ సింగి... నగ్నంగా పాముల్లా పెనవేసుకుని... సింగి నన్ను మింగేస్తోంది... మెల్లమెల్లగా... కొద్దికొద్దిగా... చిన్నగా కేకపెడ్తూ లేచి కూచున్నా! సమయం ఆరు కావస్తోంది.

గూడెం అంతా హడావుడిగా ఉంది!

"శివాలయం దగ్గరున్న చెరువులో ఎవరిదో శవం తేలిందట. వెళ్ళి చూసొద్దాం రండి!" సింగి నన్ను తొందరపెడ్తూ అంది.

మేము చెరువుని సమీపించేటప్పటికే శవాన్ని బైటికి తీసి గట్టుమీద పడుకోబెట్టారు.

"మా బావ!" అంది గుసగుసగా సింగి.

"సెర్వులో దూకి ఆత్మహత్య సేస్కునేంత పిరికోడు కాడే. సంపాలనే ఈడ్ని సెర్వులోకి తోసేసి ఉంటారు. తామరతూళ్ళు కాళ్ళకు అడ్డుపడి ఈదలేక సచ్చిపోయి ఉంటాడు!" ఒక ముసలతను అన్నాడు.

"అతనే మా గూడెం పెద్దమడిసి" సింగి స్వరాన్ని తగ్గించి నాకు విన్పించేలా చెప్పి, శవాన్ని సమీపించింది.

పాదాల్ని, పిక్కల్ని జాగ్రత్తగా పరిశీలించింది. కళ్ళను విప్పదీసి చూసింది. "లేదు తాతా... పాము కాటేసి చచ్చిపోయాడు. ఇదిగో ఎడం పిక్కమీద గాటు... రాచపాము కాటేసింది.. అరగంటలో ప్రాణం పోయి ఉంటుంది. ఆ బాధని ఓర్చుకోలేక గట్టుమీంచి దొర్లి నీళ్ళలో పడిపోయి ఉంటాడు. అందుకే నోట్లో నురగ కన్పించడం లేదు!" అంది.

శవాన్ని అంతిమ సంస్కారం కోసం మోసుకెళ్ళారు.

ఇద్దరం గూడెం వైపుకు నడుస్తున్నప్పుడు, "రేపు నేను హాస్టల్‌కి వెళ్తాను. నాకిష్టమైన చదువుని పూర్తిచేయాలిగా!" అంది సింగి.

ఇప్పుడామె కళ్ళు మిన్నాగుల్లా లేవు. కోనేటిలో పూసిన తెల్ల తామరల్లా ఉన్నాయి.



9441254044

తృతీయ బహుమతి పొందిన కథ

# ఎదురుబదురు

పెనుమాక నాగేశ్వరరావు

*పెనుమాక నాగేశ్వరరావుగారు 1957 లో గుంటూరు లో పుట్టి, అక్కడే డిగ్రీ వరకు చదివి, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేసి, రిటైర్ అయ్యాక కూడా అక్కడే స్థిరనివాసంలో ఉన్నారు. 1981 లో ప్రారంభమయిన ఉద్యోగజీవితంతో పాటే మొదలయిన సాహిత్య ప్రక్రియలో ఇప్పటి వరకు దాదాపు రెండువందలయాభైకు పైగా కథలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. కొన్ని కథలు బహుమతులు పొందాయి. ఆల్ ఇండియా రేడియోలో కొన్ని కథలు, నాటికలు ప్రసారం అయ్యాయి. సుమిత్ర గారి ఇల్లు, నాన్నలూ జాగ్రత్త ,అమరసుఖం, ఫారెన్ సెంట్ కథాసంపుటాలు, లెక్కల కాపురం, ఆత్మబలం అనే రెండు అనుబంధ నవలలు స్వాతి మాసపత్రికలో వెలువడ్డాయి. దేవుడిపాట ఆంధ్ర ప్రభ వారపత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడి, నవలగా ముద్రించబడింది. వీరి కొన్ని కథలు ఆంగ్లములోనికి అనువాదం అయ్యాయి .. ఆ కథలను నేక్టార్ ఆఫ్ లైఫ్ అనే పేరున సంపుటిగా వెలువరించటం జరిగింది. సాహితీ ప్రక్రియల్లో కథలంటేనే ఎక్కువ ఇష్టం. కష్టసుఖాల కల్నేతగా సాగే ఈ జీవన ప్రయాణంలో కడదాకా కథలతోనూ, కలంతోనూ కలిసి సాగాలని కోరిక నాగేశ్వరరావు గారిది!.*

***“అనారోగ్యంగా వుంటే వుండేమో, తల్లి తన దగ్గరకి వస్తున్నదంటే వీలయినంతవరకు ఆమెకు మరింత మెరుగైన వైద్యం చేయించాలనుకుంటే సహజంగా వుంటుంది.***
***కానీ ఆమె అంత్య క్రియలకి కావలసిన ఏర్పాట్లు చేస్తున్న నారాయణ నా మనసుకు వింత మనిషిగానే కాదు... వికృతమైన మనిషిగా కూడా కనిపిస్తున్నాడు!”***

వారం రోజుల క్రితం మా ఎదురింట్లో అద్దెకు దిగిన ఆ నరుడి పేరు నారాయణ అని తెలిసింది మా పనిమనిషి ద్వారా. ఆయన అర్ధాంగి పేరు రాజ్యలక్ష్మి అని కూడా మా పనిమనిషి పార్వతే చెప్పింది. తాను పని చేసే ఎనిమిది ఇళ్ళల్లో ఎవరింటికి బంధువులు వచ్చారో, ఎవరింట్లో ఏయే వేడుకలకు ఎలాంటి ఆలోచనలు చేస్తున్నారో, ఎవరింట్లో కలహాల కాపురాలు జరుగుతున్నాయో కథలు కథలుగా, కమ్మకమ్మగా, వినసొంపుగా వినిపిస్తుంటుంది పార్వతి! ఎవ్వరూ తనని కూర్చోపెట్టుకుని మరీ ఆ విషయాలు చెప్పరు. ఇంట్లో వాళ్ళ సంభాషణలను బట్టి తాను అర్థం చేసుకున్నదానికి మరికొంత మసాలా జోడించి చెప్పటం పార్వతి చాతుర్యం!

ఏది ఏమైనా ఈ వారం రోజులుగా నాకు ఉదయాన్నే ఈ లక్ష్మీనారాయణుల దర్శనమవుతున్నది. వాళ్ళు సామానుతో వచ్చి ఆ ఇంట్లో చేరిన రోజునే మా ఆవిడ ఇంట్లో వుండివుంటే కాఫీకి పిలిచి వుండేది. ఈ పాటికి ఆడువారి ఇద్దరి మధ్యనా స్నేహం కూడా కుదిరి వుండేది. కానీ పాపం (పుణ్యం!) మా ఆవిడ బంధువులతో కలసి తీర్థయాత్రలకు వెళ్ళి రాత్రే ఇల్లు చేరింది. గడిచిన రెండు వారాలుగా నాది స్వయంపాకం. చేతులు కాల్చుకుంటూ, ఆకులు పట్టుకుంటూ (మసిగుడ్డ) అవస్థ పడుతున్నాను. ఇక వాళ్ళని పిలిచి కాఫీలేం పెట్టి ఇస్తాములే అని ఊరుకుండిపోయా!

ఉదయాన్నే నిద్రలేచి తలస్నానం చేసి వచ్చిన శ్రీమతి నన్ను కూడా స్నానానికి తొందరపెట్టింది. ఎదురు ప్రశ్నలు వేయకుండా హడావుడిగా స్నానం ముగించేశాను. ఓ పెద్ద స్టీలు పళ్ళెంలో నా కాళ్ళు రెండూ పెట్టమంది. ఓ పెద్ద చెంబెడు నీళ్ళతో నా



కాళ్ళు రెండూ కడిగి ఆ నీళ్లని తన నెత్తిన చల్లుకుని, తాను తెచ్చిన గంగాజలాన్ని నా నెత్తిన చల్లింది. నా కాళ్ళకు నమస్కారం చేసుకుంది. మంగళసూత్రాన్ని భక్తిగా కళ్ళకద్దుకుంది. ప్రసాదం పొట్లాం విప్పి తనే నా రెండు కళ్లకూ అద్ది నా నోట్లో పెట్టింది. ప్రసాదం తింటూ కళ్ళు మూసుకున్నాను. ఆ ప్రసాదం రుచికి నా కళ్ళు మూత పడ్డాయో, భక్తి భావం పొంగి పొరలి మూతపడ్డాయో... ఆ భగవంతుడికే ఎరుక!

“భర్త చేసుకున్న పుణ్యంలో భార్యకు వాటా వుంటుందట కానీ, భార్య చేసిన పుణ్యంలో భర్తకు కనీసపు వాటా కూడా దక్కదని కదూ మొన్నా పెద్దాయన చెప్పింది!” అనుమానంగా అడిగాను నా కాళ్ళ తడిని తన కొంగుతో తుడుస్తున్న అర్ధాంగిని.

“అందుకేగా ముందు జాగ్రత్తగా మీరు దేవుడి జోలికీ పోరు, పుణ్యం జోలికీ వెళ్లరూ! మీకు వచ్చే పుణ్యం మాట ఎలా ఉన్నా, నాకు వుచితంగా వాటా ఎందుకు రావాలని కదూ మీ ఆలోచన! వెనకటికెవడో తపస్సు చేసి, దేవుడు కనిపించి వరం కోరుకొమ్మంటే... అవతల వాడేం కోరుకున్నాడో అంతకు రెట్టింపు కావాలని కోరుకొని రెండూ కళ్ళూ పోగొట్టుకున్నాడే... అదీ మీ వరస!”

“ఓసీ పిచ్చి ముఖమా, నీకు మళ్ళీ చెబుతున్నాను విను... దేవుడికి, పుణ్యానికీ అస్సలు సంబంధమే లేదు. దేవుడు దేవుడే, పుణ్యం పుణ్యమే!”

"బాగుంది సంబడం, ఆకలికీ అన్నానికీ సంబంధం లేదంటే ఎట్లా వుంటుందో, మీరు చెప్పేది అట్లా వుంది!"

"సరే మనం మళ్ళీ తీరిగ్గా పోట్లాడుకుందాం కానీ, నీ తీర్థయాత్రల విశేషాలేమిటో చెప్పు కాసేపు!"

"ఆ... ఏముంటై? ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్లల్లో వివరాలు చెప్పుకుంటూనే వున్నాంగా! ఇంకా కొత్తగా నేను చెప్పేందుకుకు, మీరు వినేందుకు ఏమీ లేవు గాని, కాసిని కాఫీ నీళ్ళు పెట్టుకు వస్తాను కూర్చోండి!"అని వంట గదిలోకి నడిచింది శ్రీమతి.

నేను అడిగాను కాబట్టి అలా తేల్చిపారేసింది గాని, కాఫీ గ్లాసు చేతిలో పెట్టి నాకు క్లాసు తీసుకోవడం మొదలుపెడుతుంది! ఆ మొదలుపెట్టిన క్లాసు ఓ పది పదిహేను రోజులు విడతలు, విడతలుగా కథలు కథలుగా కొనసాగుతుంది. ఇది నా స్వీయానుభవం! విడతలు, విడతలుగా చెప్పడం ఆమె చూసే టీ.వీ సీరియళ్ళ అనుభవం!

అయిదు నిమిషాల్లో వేడి వేడి కాఫీ గ్లాసు నాకు అందించి, తానూ ఓ గ్లాసు చేత పట్టుకుని మరో కుర్చీలో కూర్చుంది కాంతం.

తీర్థయాత్రల్లో నడచి, నడచి ఆ నడక వల్ల తన ఆరోగ్యం మెరుగుపడ్డదో, వేళకు తిండీ, నిద్రా లేక ఆరోగ్యం కాస్త దెబ్బ తిన్నదో తెలీదు కానీ, కాంతం కొద్దిగా చిక్కిపోయినట్లనిపించింది నా కంటికి. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నారు పెద్దలు... అది వేరే విషయం!

"అవునుగానీ, వాళ్ళు ఎదురింట్లోకి వచ్చి వారం రోజులవుతుంటే, వాళ్ళని పిలవకపోతే మానే, మీరన్నా వాళ్ళ ఇంటికి వెళ్ళి పలుకరించి రాకూడదటండీ!"

"నువ్వు పక్కన లేకుండా ఒంటరిగా వెళ్ళటానికి మనసు రాలేదు కాంతం!"

"అల్లాటప్పా కబుర్లు నాకు చెప్పకండి. ఇరుగు ఇంగలం, పొరుగు మంగలం అయితే ఎట్లా? పరదాలు తొలగించుకోవాలండీ, పరిచయాలు పెంచుకోవాలి!" అనునయంగా అన్నది కాంతం.

"అందరికీ అన్నీ చాతకావు కాంతం! పరిచయాలు చేసుకోవాలన్నా, పరిచయాల్ని స్నేహాలుగా మార్చుకోవాలన్నా, ఏళ్ళు గడిచినా, వూళ్ళు మారినా ఆ స్నేహాల్ని అలా కొనసాగించాలన్నా, నీలాంటి వారికే సాధ్యం, నువ్వు పక్కన లేకపోతే నాకవి అసాధ్యం!"

"చాల్లే వూరుకోండి, ఎవరైనా వింటే నవ్విపోతారు, సాయంత్రం ఇద్దరం వాళ్ళ ఇంటికి వెళ్ళి పరిచయం చేసుకుని, వాళ్లని మనింటికి కాఫీకి రమ్మని పిలిచి వద్దాం!"

"ఓ యస్... అదెంత పని! మన సంసారం అనే రైలు బండికి డ్రైవరువి, గార్డువి అన్నీ నువ్వే, నేను మధ్యలో కంపార్ట్మెంట్‌ని అంతే!" అనేసి నవ్వేను.

"పోనీలే పాపం... రైలుపట్టాని అనలేదు కొంత నయం! సరే... టిఫెన్ ఏం చేయమంటారూ?" అడిగింది కాంతం.

"ఈ రోజుకు రెస్టు తీసుకో కాంతం! ఈ రెండు వారాలూ తిన్నట్లే కృష్ణాహోటల్లో నేను తిని, నీకు పార్సిల్ తెస్తాను!"

"ఆ పని చేయండి స్వామీ, మీకు పుణ్యం వుంటుంది!" అని కుర్చీలో వెనక్కి వాలి కూర్చుంది.

"తీర్థయాత్రలతో నీకు పుణ్యం... నీకు విశ్రాంతిని కలిగిస్తే నాకు పుణ్యం!"అంటూ హోటల్‌కు బయలుదేరాను.

కృష్ణా హోటల్లో పెసరట్టు అంటే ప్రాణం పాపం కాంతానికి. అందుకే కాస్త ఆలస్యం అవుతుందన్నా ఆమెకు ఓ ప్లేటు నెయ్యి ఇడ్లీ, ఓ పెసరట్టు పార్సిల్ చేయమని చెప్పి, నాకు కావలసినవేవో నేను తిని చేయి కడుక్కున్నాను. డబ్బులిచ్చి పార్సిల్ చేత పట్టుకుని ఇంటిముఖం పట్టాను.

సాయంత్రం ఎదురింటికి వెళ్లాలన్న ఆలోచనతో కాబోలు పెందలాడే వంట చేసేసింది కాంతం. భోజనాలయ్యాక ఓ అరగంట కునుకు తీయడం నా అలవాటు. సామాన్యంగా పగలు నిద్రపోదు కాంతం. ఆ టైములో రామాయణమో, మరోటో చదువుకుంటూ కూర్చుంటుంది.

నేను నిద్ర లేచేసరికి తల దువ్వుకుని, జరీ అంచు చీరె కట్టుకుని కూర్చుంది కాంతం. ఇద్దరం ఎదురింటికి బయలుదేరాం.

“నమస్కారం అన్నయ్యగారూ... నా పేరు కాంతం... సూర్యకాంతం! మావారు కృష్ణమూర్తిగారు, రిటైర్డ్ తహశీల్దార్. వదిన గారు పనిలో వున్నట్లున్నారు!” వరసలు కలుపుతూ పరిచయ కార్యక్రమం పూర్తిచేసింది కాంతం.

“కూర్చోండి... కూర్చోండి. మీరు తీర్ధయాత్రలకు వెళ్లారని పార్వతి చెప్పింది. రాత్రే వచ్చినట్లున్నారు!” అంటూనే వంటగదిలోనుంచి హాల్లోకి వచ్చింది రాజ్యలక్ష్మి.

“నాలుగైదు రోజులుగా మీ ఇంటికి రావాలనే అనుకుంటున్నాను. మీ శ్రీమతిగారు వచ్చాక ఇద్దరం వెళ్ళి వద్దాంలెండి అంటూ మా రాజ్యం నన్ను ఆపేసింది. అన్నట్లు నా పేరు నారాయణ, మా ఆవిడ పేరు రాజ్యలక్ష్మి! ఆమెను నేను రాజ్యం అని పిలుస్తుంటాను. నన్ను అందరూ లక్ష్మీనారాయణ అని పిలుస్తారు!” అని నవ్వేశాడు నారాయణ. అంతలోనే కాఫీలు తెచ్చి ఇచ్చింది రాజ్యలక్ష్మి.

“ఇల్లు సర్దుకోవటం అంతా పూర్తయినట్లుంది!” ఇల్లంతా కలియ చూస్తూ అన్నది కాంతం.

“ఆ... అయింది. లోపలికి రండి!” ఆమె అనటం, కాంతం కుర్చీలోనించి లేవటం దాదాపు ఒకేసారి జరిగినై. లోపల ఇద్దరూ కబుర్లల్లో పడ్డారు కాబోలు, కాసేపు మగవాళ్ళిద్దరం పేపర్ కబుర్లు మాట్లాడుకుంటూ కూర్చున్నాం. ఆడువారు, అందులోనూ మొదటి పరిచయం! అంతా తేలిగ్గా ముగిస్తారా ముచ్చట్లూ! ఆర్థిక శాస్త్రం నుండి ఆడబిడ్డల సంసారాల దాకా, కట్టుకునే చీరల దగ్గరి నుంచీ కట్టుకున్న వాడి వైపు బంధువర్గం దాకా, పుట్టింటి విషయాలు పిల్లలు, వగైరాలన్నీ చోటుచేసుకుంటై కదా... ఓ పట్టాన తెగి చావవు... ఈ బంధాల అనుబంధాల ఆరాలు అదీ ముఖ్యంగా ఆడువారి మధ్యలో! అందుకే ‘ఇక వెళ్దామా?’ అనికాస్త బెరుగ్గానే ఓ చిన్న పిలుపు వేయక తప్పలేదు నాకు!

“ఆ... వచ్చేస్తున్నా” అన్న పది నిముషాలకు వంటగది, పడకగది, పెరడు చూసి గాని బయటపడలేదు కాంతం. “ఓసారి వీలు చేసుకుని, మా ఇంటికి రండి మరి” ఆ దంపతుల్ని ఆహ్వానించి బయలుదేరాం.

“అలాగే తప్పకుండా...” అంటూ ఇద్దరూ బయటదాకా వచ్చి వాళ్ళ వీధి గేటులోనే కాసేపు నిలుచుని మరీ లోపలికి వెళ్ళిపోయారు.

“ఇద్దరూ కాస్త మొహమాటస్తుల్లా అనిపించారు నాకయితే...” అంటూ మొదలుపెట్టింది మా ఇంటి తలుపు గడియ తీస్తూనే కాంతం.

“ఒక్క అయిదు నిముషాలు వుండు... ఆ న్యూస్ హెడ్ లైన్స్ చూసి ఆనక నీ వ్యూస్ వింటాను!” అని టీవీ ఆన్ చేశాను

"అవునవును... ముందు దేశం ముఖ్యం మనకి. చూస్తూ వుండండి నేను కుక్కర్ పొయ్యి మీద పెట్టి వస్తా!" అంటూ వంటగదిలోకి వెళ్లింది కాంతం

"ఆయన వయసు అరవై నాలుగట. ఆమెకు యాభై ఎనిమిదిట. ఓ వంద కిలోమీటర్ల దూరంలో అదేదో వూళ్ళో ఆయన చెల్లెలు వుందట. బావగారు బడిపంతులుగా చేసి రిటైరయ్యాడట. ప్రస్తుతం నారాయణ తల్లి, వాళ్ళ దగ్గర వుంటున్నదట. ఎప్పుడో త్వరలోనే వీళ్ల దగ్గరికి వస్తుందట. నారాయణకు ఇద్దరు కొడుకులట. పెద్దవాడు ఇండియా రాజధానిలోనూ, చిన్న కొడుకు అమెరికా రాజధానిలోనూ, లెక్కలేనంత డబ్బు, లెక్క లేకుండా సంపాదిస్తూ, లెక్క పెట్టి మరీ ఖర్చు చేస్తుంటారట. ప్రస్తుతం ఢిల్లీలో పనిచేస్తున్న పెద్దకొడుకు ఆఫీసు పని మీద అమెరికా వెళ్లాడట. అమెరికాలో పనిచేస్తున్న చిన్నకొడుకు అంతరిక్షంలోకి వెళ్లాడట. వాళ్ళకూ్కడా ఒకరో ఇద్దరో పిల్లలని చెప్పినట్లుంది. మొగుడూ పెళ్ళాలిద్దరూ ఒకప్పుడు ఒకే ఆఫీసులో కలసి పనిచేశారుట. కొలీగ్స్ అంటే అదేగా? ఆ మాటే చెప్పింది. బహుశా ప్రేమించి పెళ్లి చేసుకున్నారేమో! కారణం చెప్పలేదు కానీ, ఆమె వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని ఇంట్లోనే వుంటున్నదట ఎప్పటినుంచో!" పక్కనే కూర్చుని వివరాలన్నీ వివరించింది కాంతం.

"ఇన్ని విషయాలు ఎప్పుడు తెలుసుకున్నావే కాంతం?"

"ఆయనా, మీరూ ప్రత్యేక హోదా గురించీ, అతి విశ్వాసం, అవిశ్వాసం గురించి, రాజీనామాల గురించి... ప్రయోజనం లేని మాటలు మాట్లాడుకుంటూ కూర్చున్నారే అప్పుడు! అప్పుడే మేమిద్దరం వంటగదిలో ఈ విషయాలు మాట్లాడుకున్నాం!" చెప్పింది కాంతం

"మావి ప్రయోజనం లేని మాటలా... నువ్వు సేకరించిన విషయాలు ప్రయోజనం వున్నవా!"

"ఎదురు బదురు వుంటున్నాం, ఆమాత్రం ఒకరి విషయాలు ఒకరం తెలుసుకోవటం ప్రయోజనం కాదూ? ఎవరో చేతకాని వాళ్ళు టీవీల్లో మాట్లాడే మాటలు వినటమే టైం వేస్ట్! మళ్ళీ వాటిని ఇంకొకరితో ముచ్చటించటం ఇంకా టైం వేస్ట్!! పదండి భోజనానికి..." అంటూ నన్ను దులిపి, కొంగు దులుపుకుంటూ వంటగదిలోకి దారితీసింది. ఆమె వెనుకే నేనూ!

మరో రెండు రోజులక్కాబోలు ఎదురింటి ముందు ఆటో ఆగిన చప్పుడు అయింది. ఆత్రంగా తలుపు తెరిచి గుమ్మంలోనే నిలబడింది నా భార్య.

"ఏమండోయ్ నారాయణగారి అమ్మ, చెల్లి వచ్చినట్లున్నారు!" గడపలో నుంచునే గడగడా చెప్పేస్తోంది కాంతం.

"కాస్త లోపలికన్నా రాకూడదూ! నీ గొంతు చిన్నదా? వాళ్ళకూ్కడా వినిపిస్తాయి నీ మాటలు!" అన్నాను కొంచం విసుగ్గా.

"నిజమే... వాళ్లకన్నా వినిపిస్తాయి కానీ, పక్కనే వున్నా మీకు మాత్రం సరిగ్గా వినిపించవుగా! ఇలా రండి చూద్దురుగానీ" అంటూనే కాస్తంత పక్కకి జరిగింది నా కోసం.

వాళ్ళకి నేను పూర్తిగా కనిపించకుండా, కాంతానికి వెనుకగా నుంచున్నాను.

"ఇంకేం, బయలుదేరు. వెళ్ళి పరిచయ కార్యక్రమాలు మొదలుపెట్టు" అన్నాను.

"అయ్యో రామా. వాళ్ళని ఇంట్లోకి సరిగ్గా అడుగు పెట్టనివ్వండి. మీరూ మీ తొందరానూ"

సాయంత్రం కాస్త చల్లబడిన తర్వాత నారాయణ ఇంటికి వెళ్ళి వచ్చింది కాంతం. కావలసినంత సమాచారం సేకరించుకుని వచ్చింది. వాళ్ళ ఊళ్ళో గతంలో వున్న ఆస్తులూ, కాలక్రమంలో అమ్ముకున్న పొలాలు, స్థలాలు, ఉమ్మడి కుటుంబాలు, కలతలు, కష్టాలు, అనారోగ్యాలు వగైరా వగైరాలన్నీ విని వచ్చింది. విడతలు విడతలుగా నాకూ వినిపించింది కాంతం.

★★★

"కృష్ణమూర్తిగారు... కృష్ణమూర్తి గారూ" నారాయణ పిలుపులో ఆదుర్దా వినపడింది మాకు.

"ఏమిటేమిటేమిటి? కంగారూ పడుతున్నారెందుకో... కూర్చోండి ముందు" సావధానంగా అన్నాన్నేను.

"కూర్చోటం తర్వాత. ముందు మీరు నాకో సహాయం చేయాలి. ఈ వూళ్ళో, మీ ఎరుకలో అపరకర్మలు శాస్త్రోక్తంగా చేసే శాస్త్రిగారెవరో, ఆయన చిరునామా వగైరా నాకు చెప్పాలి!"

"ఏమిటయ్యిందేమిటి?" ఆదుర్దా పడటం నా వంతయ్యింది.

"ఇంకా ఏం కాలేదు స్వామీ... కాటికి కాళ్ళు చాపి కూర్చున్న మా తల్లిగారు రేపో మాపో నా దగ్గరే వుండేందుకు వస్తున్నది. మా చెల్లెలు ఆమెను తీసుకు వస్తున్నది. అక్కడి డాక్టర్లు ఆమె ఆరోగ్యం గురించీ, ఆయుష్షు గురించీ హామీ ఇవ్వలేమన్నారట! నాకా ఈ ఊరు కొత్త. ఏ ఏ రంగాల్లో ఎవరు ఘనాపాఠీలో, ఎవరికి డొక్కశుద్ధి వుందో, ఎవరికి చిత్తశుద్ధి వుందో నాకు తెలియదు కదా! అపర కర్మలన్నీ శాస్త్రోక్తంగా జరగాలని మా అమ్మగారి కోరిక... అలాగే జరపాలని నా కోరిక! అందుకే ముందుగా వివరాలు సేకరిస్తున్నాను!"

నారాయణ మాటలు నాకు విస్మయాన్ని కలిగించాయి! నాకు తెలిసిన ఇద్దరి ముగ్గురి పేర్లు, వాళ్ళ ఫోన్ నంబర్లూ ఆయనకి చెప్పాను. వ్రాసుకున్నాడు. వ్యాపారంగా మారిన విద్య గురించి, వైద్యం గురించి, అంతరించిపోతున్న ఆత్మీయతల గురించి కొద్దిసేపు ముచ్చటించి వెళ్లిపోయాడు నారాయణ.

"ఇదెక్కడి చోద్యం! అనారోగ్యంతో వున్న తల్లో తోడో... వస్తుంటే వారిని చూపించటానికి మంచి డాక్టర్ ఎవరని విచారిస్తారు ఎవరైనా! ఈయనెవరండీ బాబూ... అపరకర్మలు చేసే పురోహితుడి గురించి వాకబు చేస్తాడు!" మొత్తుకుంది కాంతం

"చెప్పాడుగా... అక్కడి డాక్టర్లు లాభం లేదని చెప్పారని! ఆయన ఆదుర్దా ఆయనది పాపం. కొత్త చోటు, కొత్త మనుషులు, కొంచెం ముందు జాగ్రత్తపడుతున్నాడులే!" ఆయన్ని వెనకేసుకొచ్చాను నేను.

"బానే వుంది సంబడం. ఏమో... నాకయితే ఆయన చేస్తున్నపని సబబుగా అనిపించటం లేదు!"

మా ఇద్దరి సంభాషణ ఆలకించిన పార్వతి, దొడ్లో తోముతున్న అంట్ల గిన్నెల్ని వదిలేసి, చేతులు కడుక్కుని కొంగుకు తుడుచుకుంటూ వడివడిగా మా దగ్గరికి వచ్చింది

"ఏమిటి పార్వతీ అప్పుడే అయిపోయాయా అంట్లు! ఎక్కడిదక్కడే వుంచి నీళ్ళతో తొలిచి అవతల పారేస్తున్నట్లున్నావ్..." మందలింపుగా అన్నది కాంతం.

"అబ్బా అదేం కాదులే అమ్మగారూ... మీ మాటలు విని అంట్లు అలా వదిలేసి వచ్చా... మీకో విషయం చెప్పాలని... " ఆత్రుత పడుతూ చెప్పింది పార్వతి

"ఓసీ నీ ఆత్రం పాడుగానూ... సరే చెప్పు ఏమిటో" అన్నది తన ఆత్రాన్ని కప్పిపుచ్చుకుంటూ కాంతం.

"ఆయనో రోజు మహాప్రస్థానానికి వెళ్ళి అక్కడ వారిని ఫీజు ఎంత కట్టాలి? వాహనానికి ఎంత చెల్లించాలి, ఐస్‌బాక్స్ ఎక్కడ దొరుకుతుంది? వాళ్ళు ఎంత తీసుకుంటారు? వగైరా వివరాలన్నీ అడిగి వచ్చాడట. వస్తూ వస్తూ చీమల మందు పొట్లాం కొనుక్కుని వచ్చాడట. చీకిపోయిన చాపనీ, రాయిలా మారిన దిండునీ, దుమ్ము దులిపి భద్రపరిచాడట. ఎండిన తులసి కొమ్మని ఎక్కడినుంచో తెచ్చి జాగ్రత్త చేశాడట. చెబితే నమ్మరు గానీ ఓ పాతిక పిడకల్ని కూడా కొని తెచ్చి డాబా మెట్ల కింద దాచాడట.' ఈ విషయాలన్నీ చెప్పి పడిపడి నవ్వింది పార్వతి.

"అనారోగ్యంగా వుంటే వుందేమో, తల్లి తన దగ్గరకి వస్తున్నదంటే వీలయినంతవరకు ఆమెకు మరింత మెరుగైన వైద్యం చేయించాలనుకుంటే సహజంగా వుంటుంది. కానీ ఆమె అంత్యక్రియలకి కావలసిన ఏర్పాట్లు చేస్తున్న నారాయణ నా మనసుకు వింత మనిషిగానే కాదు... వికృతమైన మనిషిగా కూడా కనిపిస్తున్నాడు!" నాతో సూటిగా అన్నది కాంతం.

తల్లినో, తండ్రినో చనిపోకుండానే శ్మశానంలో వదిలి వస్తున్న కన్నపిల్లల గురించి వింటున్నాం! ఆస్తుల కోసం అమ్మానాన్నల్ని హతమారుస్తున్న పిల్లల గురించీ వింటున్నాం! ఇంకా కొన్ని మెట్లు దిగజారి, ఇంటి కోసమో, పొలం కోసమో, స్థలం కోసమో, నగల కోసమో, నగదు కోసమో కన్నబిడ్డల్నే కడతేరుస్తున్న కసాయి తల్లితండ్రుల గురించీ వింటున్నాం! 'కలికాలం' అని తేలిగ్గా చప్పరించేస్తున్నాం!

వీటన్నికీ భిన్నంగా తోచింది నారాయణ ప్రవర్తన నాకు కూడా!

★★★

ఓ వారం రోజుల తర్వాత అనుకుంటాను... ఓ అర్ధరాత్రి మా ఇంటి తలుపులు గట్టిగా బాదినట్లు చప్పుడవ్వటంతోనూ, అంతలోనే మోగిన కాలింగ్‌బెల్ శబ్దంతోనూ గాబరాగా లేచి వెళ్ళి తలుపులు తీశాం. ఎదురుగ్గా నారాయణ తల్లి!

"ఏమండీ మా నారాయణకి ఏదో అయింది. పిలిస్తే పలకటంలేదు. కళ్ళు తెరచి చూట్టం లేదు. రొప్పుతున్నాడు. కాస్త సాయం చేయండి. దగ్గర్లో మంచి డాక్టర్ ఎవరున్నారో, ఏం చేయాలో కాస్త సాయం చేయండి!" అంటూ లబలబలాడింది.

ఆమెను అనునయించ సాగింది కాంతం. అంతలోనే అంబులెన్స్‌కు ఫోన్ చేశాను. ఆమెకు ధైర్యం చెప్పాను. నారాయణ భార్య రెండు సంచుల్లో కావలసినవేవో సర్దుకుని నారాయణ మంచం పక్కనే కూర్చున్నది. మేం ఇద్దరం వాళ్ళ ఇంటికి వెళ్ళి నారాయణ పరిస్థితి చూశాం. రాజ్యలక్ష్మికి ఓదార్పు మాటలు చెప్పాం. అంతలోనే అంబులెన్స్ రావడం, నారాయణను తీసుకుని హాస్పిటల్‌కు వెళ్ళటం జరిగిపోయింది. వెనకనే ఆటోలో నేనూ కాంతం కూడా వెళ్ళాం.

పది రోజుల తర్వాత నారాయణ ఇంటికి తిరిగి వచ్చాడు. కొంచెం కొంచెంగా కోలుకోసాగాడు. రెండు రోజులకొకసారి నేను వెళ్ళి పరామర్శించి వస్తున్నాను. కాంతం అయితే రోజూ నారాయణ వాళ్ళ భార్యతోనో, తల్లితోనో ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేస్తూనే వున్నది.

ఆ రకంగా మా ఇద్దరి కుటుంబాల మధ్యనా కాస్త స్నేహం కుదిరింది. నారాయణ కూడా నాకు దగ్గర మనిషిలా మారాడు. ఓ నెల రోజుల వ్యవధిలో బాగానే కోలుకున్నాడు నారాయణ.

ఆ చనువుతోనే ఓ సాయంత్రం మా ఇంటికి వచ్చిన నారాయణతో, "ఏం నారాయణా... మీ అమ్మగారు ఊరి నుంచి

వస్తున్నారని తెలియగానే నువ్వు మహాప్రస్థానం పనులు గురించి జాగ్రత్త పడ్డావు. మీ అమ్మగారేమో నీ అనారోగ్యం గురించి బెంగపడి మంచి డాక్టర్ కోసం వాకబు చేసి నిన్ను దక్కించుకుంది. నువ్వెందుకలా జాగ్రత్త పడ్డావో మాకు అర్థం కాలేదు!" అన్నాను చనువుగా.

"మీరు చెప్పింది నిజమే! మా అమ్మ ఆరోగ్యం గురించి డాక్టర్లు పెదవి విరిచారు. రోజుల్లో పోవచ్చని కూడా చెప్పారు. పైగా వయసు పెద్దది! నాకలా అనిపించి ఆ పనులు గురించి ఆరా తీశాను. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే... కొరివి పెట్టాల్సిన కొడుకు పక్కనే వున్నాడన్న ధైర్యంతో బతుకుతున్న మనిషి మా అమ్మ... విదేశాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న నా కొడుకులిద్దరూ నాకు ఆఖరి చూపుకైనా వస్తారని నమ్మకం లేని దిగులు బతుకు నాది! ఒకవేళ నాకే ఏదన్నా అయితే ఆమె పరిస్థితి ఏమిటనే బెంగ నాది! అంతే తేడా!" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు నారాయణ.

నోరెళ్లబెట్టాం నేనూ, కాంతం!



9553586346

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# చిక్కుముడి

మంగు కృష్ణకుమారి

*శ్రీమతి మంగు కృష్ణకుమారిగారు విశాఖపట్నం ఇండియన్ నేవీలో 37 సంవత్సరాలు ఉద్యోగం చేసి ఆఫీసు సూపరింటెండెంట్‌గా రిటైర్ అయ్యారు. చిన్నప్పటినించీ సాహిత్యం అంటే చాలా ఇష్టం. కథారచన చిన్నప్పుడే చేసినా, రిటైర్ అయిన తరవాతే ఎక్కువగా రాస్తున్నారు.*

***"చిక్కుముడి పడ్డ దారంబంతిలా ఉన్నావు! దారం తెగకుండా, చిక్కు విప్పి మళ్ళా బంతిలా చేయాలి! శైలూ, నువ్వు ఒకటి గురుతు ఉంచుకో. మన ఆఫీసులో ఎక్కువమందికి స్కాండల్స్ వినడం ఇష్టం. అలాగని అవే నిజం అనుకోరు. అందరూ ఒకలా ఉండరు.***

పద్మలత తలెత్తి చూసింది. శైలజ!

"మీ సెక్షన్‌కి వచ్చేసేనండీ" అంది.

"స్వాగతం... పే సెక్షన్ వర్క్ నేర్చుకుందికి మంచి సెక్షన్!" అంది పద్మలత.

శైలజ భర్త ఇదే ఆఫీసులో మెకానిక్‌గా చేసేవాడు. రోడ్ ఏక్సిడెంట్‌లో మరణించేడు. శైలజకి క్లర్కుగా ఉద్యోగం వచ్చింది. అందుకు దివాకరం చాలా సాయం చేసేడు. పద్మలతకి శైలజ అంటే చాలా ఇష్టం!

శైలజకి ఇద్దరు పిల్లలు. బాబు ఫిఫ్త్. పాప సెకండ్. ఆమెని చూస్తే, ఇద్దరు పిల్లల తల్లిలా అనిపించదు. చాలాసార్లు దివాకరం శైలజని తన స్కూటర్ మీద దింపడం చూసింది పద్మలత.

"పద్మగారూ... దివాకరం రికమెండ్ చేసిమరీ, శైలజని మీ సెక్షన్‌కి మార్పించేడట" అంది వెంకుమాంబ.

"ఏమో నాకు తెలీదండీ..." అంది పద్మలత.

ఎందుకోగానీ... పద్మలతకి మనసు పాడయింది! ఇద్దరు పిల్లల తల్లి శైలజ గురించి, ఇలా పదిమందీ అనుకోడం ఆమెకే నష్టం!

పద్మలతతో మాటాడుతూ శైలజ తన చేతిలో ఉన్న డబ్బులున్న పర్స్ పద్మలత టేబిల్ మీద వదిలేసి, హడావుడిగా వెళ్ళిపోయింది. మర్నాడు సెలవు పెట్టింది.

★★★

శైలజ పర్స్ ఇవ్వడానికి, ఆఫీసునుంచి శైలజ ఇంటికి వెళ్ళింది పద్మలత!

శైలజ ఇంటికి వెళ్ళేసరికి హాల్లోనే కనపడ్డాడు దివాకరం. పద్మలతని చూసి, "రండి మేడమ్..." అంది శైలజ.



"శైలూ, నిన్న డబ్బులున్న పర్స్ నా టేబుల్ మీద మరచిపోయేవు. ఇద్దామని తెచ్చేను!" కుర్చీలో కూలబడింది పద్మలత.

"ఈ పాటిదానికి మీరు శ్రమపడి వచ్చేరా? నాకు ఇచ్చి ఉంటే, నేను ఇచ్చేసి ఉండేవాడినిగా!" అన్నాడు దివాకరం.

పద్మలతకి ఒళ్ళుమండింది. తన స్నేహితురాలింటికి తను వస్తే, తనకి శ్రమని అనేంత హక్కు శైలజ ఇంట్లో దివాకరానికి వచ్చేసిందా?

"కాఫీ తెస్తాను" అని లోపలికి వెళ్ళింది శైలజ.

కాఫీ తాగినా దివాకరం కదిలేటట్టు కనిపించలేదు. పద్మలత తనే లేచి బయల్దేరింది.

పద్మలతకి శైలజ గురించి వర్రీ ఎక్కువ అయింది. శైలజతో మాటాడాలని మనసు పీకుతోంది. ఎలా అడగాలో బోధపడటం లేదు.

★★★

పద్మలత అట్టే శ్రమపడాల్సిన అవసరం లేకుండా శైలజే అడిగింది, "మేడమ్ ఈ రోజు ఆఫీసునించీ మా ఇంటికి రాగలరా?"

శైలజ గంటముందే పర్మిషన్ అడిగి వెళ్లిపోయింది. పద్మలత ఆఫీసునుంచి వెళ్ళింది. శైలజ చాలా దిగాలుగా ఉంది. లేచి కాఫీలు తెచ్చింది. కాఫీలవగానే పద్మలత అడిగింది. "ఏమిటి శైలూ..."

నల్లమబ్బులకి తగిలిన చిన్నగాలికి ఆకాశం కురిసినట్టు, శైలజ ఏడుపు మొదలెట్టింది. ఏడుపు అయి ముఖం కడుక్కు వచ్చింది.

"అదే మేడమ్... ఈ దివాకరం నాకు శనిలా తగిలేడు. ఎలా వదుల్చుకోవాలో తెలీటం లేదు!"

"వివరంగా చెప్పు శైలూ..."

"మేడమ్ నేను ఇంటర్ వరకే చదివేను. పెళ్ళి అవడం, పిల్లలు... ఇల్లే స్వర్గంలా బతికేను. మా ఆయన పోయినప్పుడు నిస్సహాయంగా ఏడిచేను. అటు, అమ్మానాన్నలూ, ఇటు అత్తమామలూ లేరు. ఎలా బతకడమా అన్న బెంగకి జవాబులా దివాకరం వచ్చి ఆదుకున్నాడు!"

"మీ అన్న ఏం సాయం చేయలేదా?"

"దుఃఖపడ్డాడు! ఎక్కడో ఢిల్లీలో ఉద్యోగం. ఏం చేస్తాడు?

"సరే చెప్పు"

"అప్పట్లో దివాకరం దేవుడిలాగే కనపడ్డాడండీ! ఉద్యోగం వచ్చేట్టు చేసేడు. తరవాత 'నువ్వు తెలివయినదానివి, పే సెక్షన్‌కి వచ్చీ' అని మన సెక్షన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించేడు. అప్పటిదాకా బాగానే ఉంది. అక్కడనించీ మొదలయింది. ఏదో వయసులో చిన్నదాన్ని కాబట్టీ నువ్వు అనొచ్చు! 'శైలూ...' అంటూ పిలుపు, అది చాలక, ప్రతీది అతన్నే అడగాలనడం, నా అవసరానికి సెలవు పెట్టుకోవాలన్నా అతని పర్మిషన్ ఉండాలన్నట్టు బిగించేడు!"

"నువ్వు ఎప్పుడూ ఖండిస్తూ మాటాడలేదా?"

"మొదట్లో మొహమాట పడ్డాను. తరవాత భయపడేట్టు చేస్తున్నాడు. అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చీవాడు. కృతజ్ఞతగా మాటాడేసరికి... ఇప్పుడు రోజూ వస్తున్నాడు. కాఫీ కావాలని అడగడం, కాఫీ కలుపుతూ ఉండగా, వెనక్కి వచ్చి నిలబడ్డం... ఇవన్నీ నాకు చాలా ఎంబరాసింగ్‌గా తయారయేయి!"

"నువ్వు ఓర్చవలసిన అవసరం ఏమిటి శైలూ..."

"లేదండీ నా పరిస్థితి ఎలా అయిందంటే, మొదట్లో కృతజ్ఞత! తరవాత మొహమాటం. అందులోంచి అతని అతి చనువు. ఒకటి రెండుసార్లు నాకు పని ఉందని చెప్పినాసరే కదలకపోడం, నిప్పుల మీద నడిచేట్టు అయింది. కొత్తగా... పిల్లలని చూస్తే కిట్టనట్టు మొహం పెడుతున్నాడు. "పొండి. హాయిగా ఆడుకోండి" అని వాళ్ళని బయటకి వెళ్ళిపోమంటున్నాడు. నేను చాలా తీవ్రంగా దెబ్బలాడేను. 'పిల్లలని మేమిద్దరం ఎప్పుడూ ఒక్కమాట అనలేదు దివాకరంగారూ... వాళ్ళని అలా బయటకి వెళ్ళిపోమని అనకండి' అన్నాను. మొహం మాడ్చుకొని ఊరుకున్నాడు. మొన్న ఏం చేసేడో తెలుసా?"

"ఏమయింది?" నీరసంగా అడిగింది పద్మలత.

"నాలుగు రోజుల కిందట 'మా ఆవిడ కూడా వస్తుంది. సినిమాకి టిక్కెట్టు తెస్తాను. మీ పిల్లలని కూడా తీసుకురా' అన్నాడు. మొదట నాకు అవదు అనేసేను కానీ, మరీ మరీ బలవంతపెడితే, తప్పక ఒప్పుకున్నాను! ఆవిడకూడా వస్తుంది కదా... అనుకున్నాను. పిల్లలని తయారుచేసి నేనూ రెడీ అయేను. అతనే ఆటోలో వచ్చి మమ్మలని తీసుకెళ్ళేడు. తిన్నగా సినిమా హాలుకి తీసికెళ్ళకుండా, ఎవరో ఇంటి ముందు ఆపేడు. పిల్లలిద్దరినీ లోపలికి తీసుకెళ్ళి ఒక్కడూ వచ్చేడు!"

గాభరాగా చూసింది పద్మలత.

"పిల్లలేరి? అని అడిగేను. తప్పనిసరిగా ఏదో బర్త్‌డే పార్టీ ఉందిట. తన పిల్లలని దింపేడట. నా పిల్లలని వాళ్ళకి తోడుగా ఉంచేడట. నాకు గుండె ఆగింది. వణుకుతూ 'మా పిల్లలెందుకండీ.. ఇప్పుడు సినిమా వద్దు ఏదీ వద్దు. పిల్లలని తెచ్చీండి. ఇంటికి వెళ్ళిపోతాను' అని ఏడుపు గొంతుతో అన్నాను. పిల్లలందరూ ఆటల్లో ఉన్నారని, హాలు దగ్గర వాళ్ళావిడ వెయిట్ చేస్తూ ఉంటుందని తీసుకెళ్ళిపోయేడు. అక్కడ ఆవిడ లేదు. ఆవిడ వచ్చేస్తుందని లోపలికి వెళ్ళిపోదాం అన్నాడు. తీరాచూస్తే అదో పాత హిందీ సినిమా. సగం హాల్ ఖాళీ. దీనికి టిక్కెట్టు తెప్పించడం ఏమిటో... వణుకుతూ కూచున్నాను. అప్పటికి బోధపడింది. అతను చాలా దుష్టబుద్ధితో ఉన్నాడని! కోపంగా ఇంట్రవల్‌లో లేచి ఇంటికి వెళ్ళిపోయేను. గంటలో పిల్లలిద్దరినీ,

తీసుకొచ్చి వదిలి, వెళ్ళిపోయేడు!"

"పిల్లలని నువ్వు అడగలేదా?"

"అడిగేను. బర్త్‌డే పార్టీ నిజమే. ఆడుకున్నారట. అయినా నాకు చాలా మొండితనం వచ్చేసింది. మర్నాడు అతను వస్తే కోపంగా మాటాడేను. ఇలాటి తిరుగుళ్ళు నాకు నచ్చవని గట్టిగా చెప్పేను. మాటాడకుండా వెళ్ళిపోయేడు!"

"మంచిదేగా..."

"అంత తొందరగా వదిలేరకం కాదేమోనండీ... మర్నాడే మళ్ళా వచ్చి మాములుగా కబుర్లు మొదలెట్టేడు.

నేను మొహం చిట్లించి నాకు పని ఉంది అన్నాను. అంతేనండీ, ఒకరకమయిన బెదిరింపు మాటల్లాటివి మొదలెట్టేడు. నాకు అతనంటే ఇష్టం అని ఆఫీసంతా తెలుసుట. ఇప్పుడు అతన్ని వదిలేయడం నాకే నష్టం అంటూ వాగుడు! నేను ఏడుపు ఆపుకోలేకపోయేను. వెళ్ళిపోయేడు."

"ఆ మాటమీదే ఉండు శైలూ... అతని బెదిరింపులకి భయపడకు. దరిద్రుడు!" అంది పద్మలత.

"నా అసలు భయం... ఎంత విదిలించినా, ఇతనికి సిగ్గూ శరం లేవేమో! నేనా ఒంటరిదాన్ని. ఇంకా ఎంత రెచ్చుతాడో అని భయం వేస్తోంది. ఎలా వదుల్చుకోవాలో తెలీక మిమ్మలని సలహా అడుగుతున్నాను. ఇవాళ అతనికి జ్వరంట. నా అదృష్టం... రాడు లెండి!" దీనంగా అంది శైలజ.

"జరిగినదాంట్లో నీ తప్పుకూడా ఉందేమో శైలూ!"

"లేదని నేను అనటం లేదండీ! చెప్పేను కదండీ... కృతజ్ఞత, మొహమాటం ఉండేసరికి అతను తెగ వాడుకున్నాడు. ఇప్పుడు నేను ధైర్యంగా మొహం మీద పొమ్మని చెప్పగలను. కానీ అతను గొడవ చేస్తాడు, మానడు. ఒంటరిదాన్నిఎలా ఎదుర్కోవాలి?"

"నీకు పెద్దదిక్కు ఎవరూ లేరా? మీ అన్నయ్యా వదినా సాయం చేయగలరా?"

"అమ్మో... మా వదినకి తెలిస్తే ఇంకేమన్నా ఉందా? నా బతుకు అందరికీ టముకు వేస్తుంది!"

"చిక్కుముడి పడ్డ దారంబంతిలా ఉన్నావు! దారం తెగకుండా, చిక్కువిప్పి మళ్ళా బంతిలా చేయాలి! శైలూ, నువ్వు ఒకటి గుర్తు ఉంచుకో. మన ఆఫీసులో ఎక్కువమందికి స్కాండల్స్ వినడం ఇష్టం. అలాగని అవే నిజం అనుకోరు. అందరూ ఒకలా ఉండరు. నువ్వు ఇతన్ని వదలించుకొని, నిబ్బరంగా బతుకు. అందరూ అన్నీ మరచిపోతారు!"

"ఒక్క అవకాశం నాకు వస్తే, మళ్ళా ఇలాటి పరిస్థితి తెచ్చుకోనండీ!" బేలగా అంది శైలజ.

"శైలూ, పోనీ నీకు తెలిసిన ఎవరయినా, నీతో కొన్నాళ్ళు ఉండగలిస్తే బాగుండు!" అంది పద్మలత.

శైలజ చటుక్కున అంది "మేడమ్... మా పిన్నివరస అయే ఒకావిడ ఉంది. మా బాబాయి పోయి, ఇప్పుడు ఒక్కతే ఉంది. అచ్చం మీలాగే మాటాడుతుంది. తనని రమ్మని అడుగుతాను!"

పద్మలత సంతోషంగా లేచింది. "ఆవిడ వస్తే, నేను ఆవిడతో మాటాడుతాను సరేనా!"

"రేపే వెళ్ళి స్వయంగా పిన్నిని తెస్తాను!" దృఢంగా అంది శైలజ.

★★★

రెండు రోజుల్లో శైలజకి పిన్నివరస అయిన శాంతలక్ష్మి వచ్చింది. పద్మలత ఆమెతో కాసేపు మాటాడి చాలా రిలీఫ్ ఫీల్ అయింది.

శాంతలక్ష్మికి అపారమయిన లోకజ్ఞానం, సాహిత్య పరిజ్ఞానం ఉండడమే కాదు, సమస్యని అర్థం చేసుకోగలదు. మానవ స్వభావాలని కాచి వడబోసింది.

ఆమె పద్మలత, శైలజ చెప్పిందంతా విని, ఒకటే చెప్పింది. "దివాకరం పీడ వదిలిస్తాను. కానీ శైలూ, అతను వచ్చినపుడు నేను చెప్పినట్టు నడుచుకో!"

శైలజ సంతోషంగా బుర్రూపింది.

శైలజ ఇంట్లో గొప్ప సన్నివేశాలు మొదలయేయి.

★★★

దివాకరం యథాప్రకారం సాయంత్రం వచ్చేసరికి, శైలజ ఎక్కడికో బయలుదేరే ప్రయత్నంలో ఉంది. పిన్ని కూచుని ఉంది.

"కూచోండి! పిన్నీ, దివాకరంగారని చెప్పేనే... ఈయనే, మాటాడుతూ ఉండు" అని బేగ్ తీసుకొని వెళ్ళిపోయింది.

"కూచో నాయనా... మీ ఆవిడని కూడా తేలేకపోయేవా?"

"శైలజ ఎక్కడకి వెళ్ళింది? ఎంత సేపట్లో వస్తుంది?"

"అదేమో నాయనా... వస్తుందిలే, నీకేమయినా పని ఉంటే చెప్పు. అదొచ్చిన తరవాత చెప్తాను!"

మరో రోజు...

"కూచోనాయనా, శైలమ్మ పనిలో ఉంది."

శైలజ పైకి వచ్చి కాఫీలు అందించి "మీరు మాటాడుతూ ఉండండి. నాకు పని ఉంది" అని వెళ్ళిపోయింది.

"అవును, బాబూ... ఈ ఊళ్ళో చూడవలసిన ప్రదేశాలు ఏమిటి? మరేం లేదు. నువ్వూ, మీ ఆవిడా వెళితే నేను వద్దామని..."

ఇంకోసారి...

"అలా బొడ్డుకోసి పేరుపెట్టినట్టు శైలూ అంటావేమిటయ్యా... అదేం చిన్నదా, చితకదా? ఇద్దరు పిల్లలతల్లి."

ఏ వేళప్పుడు దివాకరం వచ్చినా, శాంతలక్ష్మే కనిపిస్తుంది. శైలజ మాయం. కనపడ్డా, శాంతలక్ష్మే మాటాడుతుంది.

"పనీ పాటూ లేకుండా ఈ కుచ్చుటప్పాలు నేర్చేవేమిటే శైలూ... వెళ్ళి పిల్లల బట్టలు సద్దు. ఇంటికి ఎవరయినా వస్తే నేను చూసుకుంటానులే!"

"అయినా శైలూ, ఇంటికివచ్చిన అతిథులని ముందుగది దాటి రానివ్వకూడదు. ఆ తరవాత ఏది కనపడకపోయినా ఒక మాటకి మరొకమాట!"

"అవునూ దివాకరం, నీకెంతమంది పిల్లలు అన్నావూ? ముగ్గురు కదూ... రోజూ ఇలా ఇటు వస్తే, పిల్లలు నీ గురించి అడగరూ? కొన్నాళ్ళు పోతే వాళ్ళ తండ్రిని వాళ్ళు పోల్చలేకపోతారు సుమా!"

"ఈరోజు పేపరు చూసేవే? మొగుడు ఏ జన్మాన ఇంటికి రాడట. ఆఫీసూ, తిరుగుళ్ళేనట. ఆ పెళ్ళాం మొగుడి ఫ్రండుతో లేచిపోయిందిట. ఏం చేస్తుంది పాపం... వాడికి తగ్గశాస్తి జరిగిందిలే!"

దివాకరం కోపంతో ఊగిపోతూ ఒకసారి "ఈ దెయ్యాన్ని ఎప్పుడు పంపిస్తావ్? నోటికి వచ్చినట్టు పేలుతోంది!" అన్నాడు.

"మిష్టర్ దివాకరం, నోరు సంబాళించుకోండి దయచేసి! ఆవిడ నాకు తల్లి తరవాత తల్లిలాటిది. మా బాబాయి పోయిన దుఖంలో ఉంది. ఆవిడ ఎక్కడకీ వెళ్ళదు. ఆవిడ బాధ్యత నాది. ఆవిడ చెప్పినట్టు వినడమే నేను చేసేది! అన్నట్టు మా పిన్ని మీ ఇంటికి తీసుకెళ్ళమని గోలపెడుతోంది. మీ శ్రీమతిని చూడాలని ఉందిట. బహుశా ఆవిడతో స్నేహం కలుపుకోవాలని ఉందేమో..."

దివాకరం కోపంతో ఉడుకుతూ, "ఏమీ అక్కరలేదు. మీ మొహాలు చూసే ఉద్దేశం నాకు లేదు. మళ్ళా ఇక్కడకి రాను!" అంటూ వెళ్ళిపోయేడు.

నెల తిరక్కుండా దివాకరం గోవాకి ట్రాన్స్‌ఫర్ పెట్టుకొని వెళ్ళిపోయేడు!

శైలజమొహం సంతోషంతో వెలిగిపోతోంది. పద్మలత నవ్వుతూ చూస్తోంది.

శాంతలక్ష్మి "అయితే, అమ్మాయ్ నీ సమస్య తీరిందికదా... నేను బయల్దేరనా?" అంది.

"ఎక్కడకి పిన్నీ... నీ పూచీ నాదే అని దివాకరంతో నిజంగానే అన్నాను! నీ కోసం కాకపోయినా నా పిల్లల కోసమయినా, నువ్వుండాల్సిందే సుమా, తమ్ముడితో నేను మాటాడతానుగా!" అంది శైలజ ప్రేమగా.

"మంచివాళ్ళకి ఆఖరికి మంచే జరుగుతుంది శైలూ! పిన్నిగారిలాటి పెద్దవాళ్ళు ఇంటింటా ఉండితీరాలి" అంది పద్మలత నవ్వుతూ.



9948847427




# గమ్యం వైపుగమనం

సి. వి. శాస్త్రి

*శ్రీ సి.వి. శాస్త్రిగారు భారతీయ స్టేట్ బ్యాంక్‌లో పనిచేసి పదవీ విరమణ చేసి, విశాఖపట్నంలోనే స్థిరనివాసం! అప్పుడప్పుడు కథలు, కవితలు రాయడం. ఎక్కువగా పుస్తకాలు చదవడం చాలా ఇష్టం.*

***ఒక పెట్టెలో ఓ పది చీరలు, మరో పెట్టెలో తనకు బాగా నచ్చిన ఓ వంద పుస్తకాలు... ప్రస్తుతం తన ఆస్తి ఇంతే! ఊరి చివరనున్న వృద్ధాశ్రమానికి చేరుకుంది.***
***ఓ గది, రెండు చెక్క బీరువాలు, నాలుగు కుర్చీలు అంతే. బయట మొక్కలు, చెట్లు!***

గుడి మండపంలో కూర్చుని సూర్యాస్తమయాన్ని చూస్తోంది మయూరి! చిన్నప్పట్నించీ సూర్యోదయం, సూర్యాస్తమయం చూడడం చాలా ఇష్టం మయూరికి. గుడి ముందు ప్రవహించే కాలవలోని నీటి చల్లదనాన్ని మోసుకొస్తున్నాయి, గుడి ముందున్న వేప చెట్టు కొమ్మలు, రెమ్మలు! మేమిక్కడ ఉన్నామంటున్నాయి, తులసి, సంపెంగ, గన్నేరు వాసనల్ని వెదజల్లుతూ! గుళ్ళో పూజారిగారు చదివే మంత్రాలు తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది.

మయూరికి ఆ నిశ్శబ్దం ఇష్టం. ఆ సువాసనలు ఇష్టం. ఆ వాతావరణం ఇష్టం! రోజూ ఓ గంట అక్కడ కూర్చోకుండా దినచర్య పూర్తవదు. ఆ గంటలో ఆమెకి బాధలు గుర్తు రావు, ఆనందాలు గుర్తు రావు. కష్టాలు, సుఖాలు ఏమీ గుర్తు రావు. ఏ ఆలోచనలూ రావు. నిజం చెప్పాలంటే ఆ గంటా మెదడు పనిచెయ్యదు. మౌనిలా ఉండిపోతుంది!

ఇది సుమారు ముప్పయి సంవత్సరాలుగా ప్రతిరోజూ ఆమె దినచర్యలో ఓ భాగం! పిల్లలు స్కూలు నుంచి వచ్చాక ఇక్కడకు తీసుకొచ్చేది. వాళ్ళు ఆడుకుంటుంటే తనిక్కడే కూర్చునేది సూర్యాస్తమయాన్ని చూస్తూ!


అమ్మాయీ, అబ్బాయీ బాగా చదువుకున్నారు. మంచి ఉద్యోగాలు వచ్చాయి. ఒకళ్ళు అమెరికా, ఒకరు లండన్. పెళ్ళిళ్ళయిపోయాయి. మనవలు కూడా! భర్త రిటైరయ్యాక ఓసారి, వాళ్ళ పిల్లల చిన్నప్పుడు ఓసారి వెళ్ళారు. అక్కడ బావుండదా అంటే బానే వుంటుంది కానీ ఇలా వుండదు!

"అమ్మా! హారతి తీసుకోండి." పూజారిగారు పిలిచారు.

లోపలకెళ్ళింది మయూరి. దేవుడ్ని చూస్తూ ఒక్కసారి కళ్ళు మూసుకుంది. దేవుడ్ని ఏదో కోరడం మయూరికి నచ్చదు. మనకేది కావాలో, మనకేం ఇవ్వాలో దేవుడికి తెలియదా?

పూజ పూర్తయింది. బయటకొచ్చి పూలమొక్కల దగ్గర నిల్చుంది. రోజూ వచ్చి మొక్కల్ని పలకరించడం మయూరికి అలవాటు. అవి తలలూపుతూ సమాధానాన్నిస్తాయి.

రేపట్నించి... తలపుకొచ్చేసరికి ఒక్కసారి మయూరి కళ్ళలో నీళ్ళు!



పిల్లలు విదేశాలకి వెళ్ళినప్పుడు బాధపడలేదు. వాళ్ళు అప్పుడప్పుడు వస్తారనే ధైర్యం! భర్త పోయినప్పుడు బాధపడలేదు. మరెప్పుడూ తిరిగి రాడనే దైన్యం! పాపం రేపట్నించీ తనని చూడాలన్నా చూడలేని ఈ మొక్కలు బెంగపెట్టుకుంటాయేమో... అందుకే ఈ కన్నీళ్ళు!

గుడికి తాళం వేసి బయటకొచ్చారు పూజారిగారు. ఇల్లు ఓ ఫర్లాంగు దూరం. మెల్లగా నడుస్తోంది మయూరి. పక్కన హరికేన్ లాంతరు పట్టుకుని పూజారిగారు.

“రేపటి నుంచి మీరు రారంటే బెంగగా ఉందమ్మా!” అయన మాటల్లో నిజమైన బాధ.

“ఎంతదూరం పూజారిగారూ! ఇరవై కిలోమీటర్లేగా... మధ్య మధ్యలో వస్తుంటాను!” మాటయితే అంది కానీ, మళ్ళీ రాగలననే నమ్మకం లేదు మయూరికి! రావడం కష్టమని కాదు. మళ్ళీ బంధాలు పెంచుకోవడం ఇష్టం లేక!

రాత్రి నిద్రపట్టలేదు. భర్త పోయేముందు ఇద్దరూ మాట్లాడుకున్న మాటలు గుర్తొచ్చాయి. తన నిర్ణయానికి పిల్లలు బాధపడ్డం, తను వాళ్ళని కన్విన్స్ చెయ్యడం... అంతా గుర్తొచ్చింది!

నలభైయేళ్ళు వెనక్కెళ్ళింది. ఆ సాయంత్రం పార్కులో సిమెంటు బెంచిమీద కూర్చున్నారు మయూరి, రాఘవ. రేడియోలో ప్రాంతీయ వార్తలు వస్తున్నాయి. ఒకే కాలనీలో ఇళ్ళు, ఒకే ఆఫీసులో ఉద్యోగాలు. ఇంటికెళ్తూ ఈ పార్కులో ఓ పావుగంట కూర్చుని వెళ్ళడం అలవాటు.

"మయూరీ, మనం పెళ్ళిచేసుకుందామా?" అడిగాడు రాఘవ.

ఆ ప్రశ్న ఇద్దరి మనసుల్లోనూ చాలా రోజులుగా బయటకు రాకుండా తచ్చాడుతున్నదే! ఎవరు ముందడిగినా రెండోవారి సమాధానం కూడా ఇద్దరిలో ఉన్నదే. రాఘవ ముందడిగాడు. మయూరి సమాధానం చిరునవ్వు. వాళ్ళిద్దరూ చాలా ప్రాక్టికల్... ఆ వయసులో కూడా!

"పెద్దవాళ్ళకి చెబుదాం. వాళ్ళు ఓకే అంటేనే! కాదంటే కాదు!"

పెద్దవాళ్ళు కాదనలేదు!

కాలం కదులుతూనే వుంది. వాళ్ళకి పిల్లలు, చదువులు, వాళ్ళ పెళ్ళిళ్ళు, ఉద్యోగాలు, వాళ్ళిద్దరూ సీనియర్ సిటిజెన్స్ అవ్వడం!

ఒకరోజు రాఘవ అన్నాడు "మయూరీ... మనం ఎన్నాళ్ళుంటామో తెలియదు. ఒకేసారి వెళ్ళడమనేది జరగకపోవచ్చు. ఎవరో ఒకరు ఒంటరిగా గడపాలనేది నిజం. దానికి మనం సిద్ధపడాలి! ఈ బంధాలు, వ్యామోహాలు అన్నీ వదిలేసుకుని ఇద్దరమే ఉండడానికి, కొన్నాళ్ళ తర్వాత ఒంటరి జీవితానికి సిద్ధం కావాలి!"

వినడానికి కష్టంగా అనిపించినా... అది నిజమే కదా అనిపించింది మయూరికొ్కూడా!

ఇప్పుడుంటున్న ఇల్లు కాక, మరో రెండు ఇళ్ళున్నాయి. నాలుగు ఎకరాల కొబ్బరితోట వుంది. పిల్లలు వచ్చినపుడు ఇద్దరి పేరా చెరో ఇల్లూ, రెండేసి ఎకరాలు రాసేసారు. వియ్యాలవారు ఇద్దరూ ఇక్కడే ఉంటున్నారు. పిల్లలు వచ్చినపుడు ఆ దాక్యుమెంట్లు ఇచ్చేసి వాటి బాధ్యత వియ్యాలవారికి అప్పచెప్పేసారు!

ప్రస్తుతం వాళ్ళుంటున్న ఇల్లు మాత్రమే వారి పేరున వుంది. ఎకరం స్థలంలో కట్టిన పెద్ద ఇల్లు. కింద ఎనిమిది గదులు, పైన రెండు గదులు ఉన్నాయి. ఈ ఇల్లు కూడా వాళ్ళ తర్వాత ఊరికి ఉపయోగపడేలా చెయ్యాలనే దానిలో ఇద్దరిదీ ఒకే అభిప్రాయం!

ఏడాది క్రితం రాఘవ పోయాడు! మయూరి ఒంటరిదైపోయింది. పిల్లలు వచ్చి ఓ నెల రోజులున్నారు. ఇద్దరూ చెప్పారు వాళ్ళతో వచ్చేయమని. ఈ మట్టిలోనే కలిసిపోవాలనే సెంటిమెంట్ కొంత, తను వెళ్తే వాళ్ళకి ఇక్కడకొచ్చే అవకాశం అసలుండదనే భయం కొంతా... మయూరి రానని చెప్పేసింది!

అప్పుడు ఊరివాళ్ళు స్కూల్ భవనం కట్టే ఆలోచనలో ఉన్నారని తెలిసి, మయూరి తన ఇంటిని ఆ స్కూల్‌కి ఇద్దామనే ఆలోచనని పిల్లలకి చెప్పి, ఒప్పించి, పెద్దలని పిలిపించి తన అభిప్రాయం చెప్పింది. పిల్లలు అభ్యంతరం చెప్పలేదు కానీ ఆ ఇంటితో అనుబంధం పూర్తిగా తెగిపోతుందని బాధపడ్డారు! మయూరి స్కూలు వాళ్ళతో చెప్పింది... 'కిందనంతా పూర్తిగా వాడుకోమని, పై రెండు గదులూ మాత్రం అలాగే ఉంచాలని, పిల్లలు వచ్చి ఉన్నన్నాళ్ళు పిల్లలూ తనూ ఇక్కడే ఉంటామని!' ఆ ఆలోచన పిల్లలకీ నచ్చింది.

"మేడం మీరు ఎప్పుడూ ఇక్కడే ఉండచ్చు కదా, కిందన పాఠశాలకు ఉపయోగిద్దాం. పైన మీరు ఉంటే బాగుంటుంది."

"లేదండి, ఇక్కడే ఉంటే ఈ ఆస్తి నాదనే అహంకారం, అంతా నన్ను గౌరవించాలనే అహంభావం ఉంటాయి! అవి నా దగ్గరకు రాకూడదంటే నేనిక్కడ్నించి దూరంగా వెళ్ళాలి... "

ఎవరూ మాట్లడలేదు.

రాఘవ దహన కార్యక్రమాలు జరిపించినపుడు పంతులుగారు "ఆత్మ ఒక సంవత్సరం పాటు పోయిన చోటే తిరుగుతూ ఉంటుంది. తర్వాత స్వర్గానికి చేరుతుంది!" అని చెప్పారు.

అందుకే మయూరి సంవత్సరం వరకూ ఆ ఇంట్లోనే ఉంది. వారం క్రితమే సంవత్సరీకాలు అయిపోయాయి. పిల్లలు వచ్చి కార్యక్రమం పూర్తిచేసి వెళ్ళిపోయారు.

రాత్రంతా ఆలోచనలతో నిద్రపట్టలేదు. తెల్లవారింది. చివరిగా ఇంటిని, పరిసరాల్ని తనివితీరా తిరిగి తిరిగి చూసింది. ఈ రోజుతో ఇంటితో పూర్తిగా బంధం తెగిపోతోంది.

ఒక పెట్టెలో ఓ పది చీరలు, మరో పెట్టెలో తనకు బాగా నచ్చిన ఓ వంద పుస్తకాలు... ప్రస్తుతం తన ఆస్తి ఇంతే!

ఊరి చివరనున్న వృద్ధాశ్రమానికి చేరుకుంది. ఓ గది, రెండు చెక్క బీరువాలు, నాలుగు కుర్చీలు అంతే. బయట మొక్కలు, చెట్లు!

చాలా ప్రశాంతంగా వుంది. ఓ ఏభై మంది వరకు ఉన్నారు. నెలకి ఇరవై వేలు ఇవ్వాలి. మొత్తం అన్నీ వాళ్ళే చూస్తారు. పెన్షన్ నెలకి నలభై వేలు వస్తుంది. చాలా ఎక్కువ!

గేటు తీసి లోపలకి అడుగులు వేస్తోంది మయూరి. ఉన్నవన్నీ తృణప్రాయంగా వదిలేసి ఏమీ లేని స్థితిలోకి అడుగులు వేస్తోంది. జీవితం అంతా అనుభవించేసింది. జీవితానికి గమ్యమైన మరణం తనకి ఇక్కడే. ఈ ఆశ్రమంలోనే!

మయూరి మెల్లగా నడుస్తోంది. ఆ నడక గమ్యం వైపు గమనం!



9393129945




# కాలజ్ఞాని

డా. ఎం.. సుగుణరావు

*డాక్టర్ ఎమ్. సుగుణరావు గారు ముప్ఫయ్యేళ్ళుగా రచనా వ్యాసంగంలో ఉన్నారు. ఇప్పటి వరకు దాదాపు మూడొందల పాతిక పైచిలుకు కథలు రాసారు. వీరు రాసిన "ఆకాశంలో ఒక నక్షత్రం" కథ ఆంగ్ల నాటకం గా మారి, బొంబాయి టాటా ఫెస్ట్ అంతర్జాతీయ స్థాయి ఇంగ్లీష్ నాటకాల పోటీలలో లక్ష రూపాయల బహుమతి పొందింది. వీరికి జీవిత స్పర్శ కలిగిన కథలు చదవడం, రాయడం చాలా ఇష్టం.*

***ప్రభుత్వం అనుమతి లేకుండా పర్యావరణాన్ని పాడుచేసే విత్తనాలను నాగరాజు రైతులకు అమ్ముతున్నాడు. ఆ విత్తనాలు వాడిన రైతులు తర్వాత కలుపు మొక్కలను చంపడానికి విషపూరిత రసాయనాలను పంటచేలల్లో పిచికారీ చేస్తున్నారు. అది చల్లిన ప్రాంతంలో పంట మొక్కలు తప్ప అన్ని చెట్లూ నల్లగా మాడిపోతాయి. ఈ రసాయనాలు వాడితే రైతు పంటకే కాకుండా పర్యావరణానికి కూడా ముప్పే!***

వేకువనే లేచాను. ఆ బ్రహ్మ ముహూర్తంలోనే స్నానం చేసాను. ఇది నా దైనందిన బ్రతుకుచిత్రం!

ఆ కొండ మీద నుంచి చూస్తున్నాను. దగ్గరలో ఉన్న ఇళ్లన్నీ నాకు కనిపిస్తున్నాయి. ఆ ఊరిలో సూర్యుడు లేచినా... ఇద్దరు పెద్దమనుష్యులు మాత్రం నిద్రలోంచి లేవలేదు. ఆ ఇద్దరివీ ఆ ఊళ్లో ఎదురెదురు ఇళ్లు! రమణారావుది మూడంతస్తుల భవనం అయితే వీరభద్రయ్యది వెల్లవేయని గోడలున్న పాతకాలంనాటి పెంకుటిల్లు.

ఇద్దరూ ఒకే సమయంలో లేస్తారు. రమణారావు లేవడం మాత్రం ఉదయం నడక కోసం. అయితే వీరభద్రయ్య లేవడం తన పొలం పనుల కోసం. రమణారావు ఉదయం పూట నడుస్తూ, తను అప్పు ఇచ్చిన వాళ్లను పలకరిస్తాడు. వడ్డీలు వసూలు చేసుకుంటాడు. కొత్తవాళ్లకు అప్పులు ఇవ్వడం కోసం వారి దగ్గరి నుంచి పత్రాలు తీసుకుంటాడు. అప్పుడప్పుడు అప్పులు ఇవ్వనివాళ్లకు తనదైన రీతిలో కోపాన్ని ప్రదర్శిస్తూ, తన నడక పని ముగిస్తాడు.

'ఇంతకీ మీకు నేనెవరో అర్థమయ్యిందా? ఈ బంధాలు శాశ్వతం 'కావు కావు' అంటూ గొంతెత్తి అరుస్తాను కదా! ఈ అందమైన రంగుల లోకంలో నా రంగుతో ధైర్యంగా తిరిగే జీవిని. మనిషికి మచ్చిక కాకపోయినా మనుష్యుల దగ్గర మసలుతాను. వాళ్లు విదిలించినా వాళ్ల చుట్టూనే తిరుగుతూ ఉంటాను. నేను మనుష్యుల్ని బాగా అర్థం చేసుకున్నాను. నా నుంచి మనుష్యులు అలాగే క్రొత్త పాఠాలు నేర్చుకుంటూ ఉంటారు. ఇదేమిటి ఈ గోల! అని విసుక్కోకండి. మళ్లీ కథలోకి వద్దాం.

వీరభద్రయ్య తన పొలానికి వెళ్తూ చెట్టును, పైరును, మొక్కలను పలకరిస్తాడు. పంట ఎలా ఉందో తెలుసుకుంటాడు. అలా తన ఉదయపు సమయాన్ని ముగిస్తాడు.

ఆ ఇద్దరికీ ఒక కొడుకు, కూతురు. రమణారావు, వీరభద్రయ్య ఇద్దరూ తమ కూతుళ్లకు పెళ్లి చేసారు. వీరభద్రయ్య తన గుండెల మీద భారాన్ని కూతురు పెళ్లి చేయడంతో వదిలించుకున్నాననుకున్నాడు గానీ, అది రమణారావు దగ్గర తీసుకున్న

ఋణభారంతో గుండెల మీద బరువెక్కువయ్యింది. రమణారావు కొడుకు, వీరభద్రయ్య కొడుకు ఇద్దరూ ఒకే కాలేజీలో అగ్రికల్చరల్ బిఎస్సీ చదువు పూర్తి చేసారు.

రమణారావు కొడుకు నాగరాజు. చదువు అయిపోయిన తర్వాత వ్యాపారంలోకి దిగాడు. తన చదువుకు సంబంధించిన వ్యాపారం మొదలుపెట్టాడు. అదే విత్తనాల కంపెనీ. తన తండ్రి గారి ద్వారా అప్పులు తీసుకున్న రైతులకు తన కంపెనీ నుంచి విత్తనాలు తీసుకోవాలని షరతు పెట్టాడు. అందువల్ల విధిలేక రమణారావు దగ్గర అప్పు తీసుకున్న రైతులందరూ అతని కొడుకు నాగరాజు దగ్గర తప్పనిసరిగా విత్తనాలు కొనడం మొదలుపెట్టారు. అలా రమణరావు వడ్డీ వ్యాపారంతో పాటు అతని కొడుకు నాగరాజు విత్తనాల వ్యాపారం కూడా బాగా సాగుతోంది. చదువు అయిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తోన్న వీరభద్రయ్య కొడుకు సంతోష్ ఖాళీగా ఉండడం ఇష్టంలేక, ఒరిస్సాలో ఒక రైతు వికాస కేంద్రంలో రైతుల కోసం పని చేస్తున్నాడు, జీతం తక్కువైనా!



అయితే ఆ రోజు రమణారావు, వీరభద్రయ్య ఇద్దరూ నిద్రలోంచి లేవలేదు. నాకేదో అనుమానం వచ్చింది. చెవులు రిక్కించి విన్నాను. ఆ ఇళ్లల్లోంచి ఏడుపులు, పెడబొబ్బలు వినిపించాయి. అప్పుడు నాకర్థమయ్యింది. వీరభద్రయ్య, రమణారావు కాలధర్మం చెందారని. అయితే డబ్భై ఏళ్లు దాటిన ఆ ఇద్దరిది సహజ మరణం అనుకున్నారు. ఆయాసం లేకుండా మరణం, సునాయాసంగా జీవించడం... అందరూ కోరుకునేదే! అయితే అది రమణారావు విషయంలో జరిగింది. వీరభద్రయ్యది ఒడిదుడుకుల జీవితం. 'వాన రాకడ 'ప్రాణం పోకడ' అంటారు. అలా అతివృష్టి, అనావృష్టి, నాసిరకం పురుగుమందులు, పొలం మీద చేసిన అప్పులు, ఆ తర్వాత కూతురు పెళ్లి కోసం దా'రుణం'గా పెరిగిన భారం. వీటితో అతని జీవితం సునాయాసంగా సాగలేదు. మరణం మాత్రం ఆయాసం లేకుండా నిద్రలోనే చనిపోయాడు అనుకున్నారు ఆ ఊరిలో వాళ్లు.

అయితే వీరభద్రయ్య మరణం కూడా ఆయాసం లేకుండా జరగలేదని ఆ ఇంట్లోవాళ్లకు మాత్రమే తెలుసు. అతను రోజూ నిద్ర పట్టడానికి మాత్ర వేసుకుంటాడు. ఆరోజు రాత్రి ఆ మాత్రలను శాశ్వతనిద్ర కోసం తీసుకున్నాడు. ఆ విషయం ఇంట్లోవాళ్లకి తప్ప బైట ప్రపంచానికి తెలియదు. అంతకుముందే చేసిన అప్పు గురించి, చెల్లించవలసిన వడ్డీ జాప్యం గురించి రమణారావు అందరి ముందు తనను అవమానించాడని వీరభద్రయ్య మథనపడ్డాడు. ఆ అవమానభారాన్ని తట్టుకోలేక ఆ నిర్ణయం తీసుకొన్నాడు. ఇది నేను వీరభద్రయ్య ఇంటి గోడ మీద వాలగానే వాళ్లు ఏడుస్తూ ఆ ఇంటి పెద్ద గురించి అనుకొన్న మాటలలో తెలిసింది. నాకు జాలి కలిగింది. ఆ గోడమీదే ఉండి అంతా గమనిస్తున్నాను.

వీరభద్రయ్య కొడుకు సంతోష్, తండ్రి మరణవార్త తెలుసుకొని పరిగెత్తుకుంటూ వచ్చాడు. తండ్రిది సహజమరణం కాదని, ఆత్మహత్య చేసుకున్నాడని... దానికి కారణం గురించి అతను తెలుసుకోవడం మొదలుపెట్టాడు. ఈలోగా తండ్రి పెద్దకర్మ రోజు దగ్గర పడింది.

నాకు ఏమిటో అన్నీ అలా తెలిసిపోతూ ఉన్నాయి! బహుశా నేను దేవుని వాహనాన్ని కదా! ఆ దేవుడంటే భయమే అందరికీ. శని దేవుడ్ని ఎవరూ ఇంట్లో పెట్టుకోరు. అలాంటి దేవుడి వాహనమైన నన్ను ఎందుకు గౌరవిస్తారు? అయితే నాకూ ఒక రోజు వస్తుంది. ఆ రోజు ఏంటో మీకూ తెలుసు! అందుకే ఆరోజు కోసం నేను ఎదురుచూస్తున్నాను!

ఆరోజు, దగ్గర బంధువులు, ఊళ్లోని వాళ్లు వీరభద్రయ్య ఇంటికొచ్చారు. పూజ ముగిసిన తర్వాత అందరికీ భోజనాలు ఏర్పాటు చేసాడు సంతోష్. తండ్రిగారికి ఇష్టమైన వంటకాలు ఒక విస్తరిలో పెట్టి, అతని తల్లి తమ ఇంటి గోడపై ఉంచింది. అప్పటికే మధ్యాహ్నం మూడు దాటింది. ఎండ సుర్రుమంటోంది. ఆకాశంలో ఒక్క పిట్ట జాడ లేదు.

అదే సమయంలో వీరభద్రయ్య ఇంటి ఎదురుగా ఉన్న రమణారావు ఇంట్లోనూ పెద్దకర్మ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. అతని ఆర్థికస్తోమతను బట్టి భారీగా భోజనాలు ఏర్పాటు చేసాడు అతని కొడుకు నాగరాజు. అతని తల్లి అదే సమయంలో రమణారావుకి ఇష్టమైన ఆహార పదార్థాలను వెండి కంచంలో పెట్టి తమ ఇంటి గోడపై ఉంచింది.

ఆ చనిపోయిన ఆత్మలు సంతృప్తిపడాలంటే... నేను ఆ భోజనం తినాలి అనుకుంటూ ఇరు కుటుంబాల వారు ఆకాశం వంక చూస్తూ నిలబడ్డారు.

ఇలా కాకికి ఎందుకు పిండాలు పెడతారో మీకు తెలుసా? దీని వెనుక ఒక కథ ఉంది. రావణుడికి భయపడి యముడు నా రూపాన్ని ధరించి మాకు గొప్ప వరాలు ఇచ్చాడు. తను ప్రాణులకు రోగాలను కలిగించేవాడు కనుక తనే స్వయంగా మా రూపాన్ని ధరించినందున మమ్మల్ని చిరాయువుగా ఉండమని దీవించాడు. అలా కాకులు కలకాలం బ్రతుకుతాయని నానుడి పుట్టింది.

యమలోకంలో నరక బాధలను భరించలేని బంధువులు చనిపోయినప్పుడు వారికి సమర్పించిన పిండాలను మేము తినడం వల్లనే నరక లోకంలో ఉన్నవారికి తృప్తి కలుగుతుంది. అలా యముడు మాకు ఈ వరం ఇచ్చినందువల్లనే పితృకర్మల్లో మాకు పిండాలు పెడుతున్నారు. అయితే రమణారావు ఆత్మను తృప్తిపర్చడం నాకిష్టం లేదు. వారు షడ్రషోపేతమైన భోజనం నా కోసం ఉంచినా నేను దాన్ని ముట్టలేదు.

క్షణం గడిచింది. నిమిషాలు దొర్లాయి. ఇంతలో నేను అరుచుకుంటూ వచ్చి వీరభద్రయ్య ఇంటి మీద వాలాను. గోడ మీద వీరభద్రయ్య ఆత్మ సంతృప్తి కోసం ఉంచిన ఆహారాన్ని నోట కరిచాను. ప్లేట్‌లో ఉన్న పదార్థాలు రుచి చూసాను. బూరెలు, గారెలు, పాయసం.

రమణారావు ఇంట్లోవారు, వీరభద్రయ్య ఇంటి మీద వాలిన నేను తమ ఇంటిపై వాలుతుందేమోనని ఆశగా చూసారు. అలా చూస్తూనే ఉన్నారు. అయితే నేను వారి ఇంటి మీద వాలలేదు. అక్కడి నుండి రివ్వున ఎగిరి కొండ శిఖరం మీద కూర్చున్నాను. బాగా భోజనం చేయడంతో నిద్ర పట్టేసింది. నిద్రలో ఏవో కలలు. నాకు ఒక ఆడ కోకిల కలలోకి వచ్చింది. మెల్లగా నా గూటిలో గుడ్లు ఉంచుతోంది. దిగ్గున లేచాను. చిన్నగా నవ్వుకున్నాను. నేనెంత తెలివి గల పక్షినైనా, కోకిల చేతిలో మోసపోతూ ఉంటాను. ఆడ కోకిల నా గుడ్లలో కొన్ని గుడ్లు ప్రక్కకు పెట్టి, వాటి స్థానంలో తన గుడ్లు ఉంచుతుంది. అవి నా గుడ్లు కాకపోయినా ఆ కోకిల పిల్లల్ని నేను పొదిగి పిల్లల్ని చేస్తాను. తల్లి కోయిలే కాదు, పిల్ల కోయిలలు నన్ను మోసం చేయడంలో ఆరితేరతాయి. నా గూటిలో ఉన్నంత కాలం కాకిలా అరుస్తాయి. అవి ఎగిరిపోయేందుకు సిద్ధంగా ఉన్నప్పుడు

కోకిలలా అరుస్తూ రెక్కలు విప్పుకొని వెళ్లిపోతాయి. మనుష్యుల్లో కూడా ఇలాంటి మోసకారితనం ఉందేమో!

ఆ విషయం రమణారావుని, అతని కొడుకును చూసి నాకు అర్థమైంది. యథా తండ్రి, తథా కొడుకు. మళ్లీ రివ్వున ఎగిరి రమణారావు ఇంటి మీద వాలాను.

రమణారావు ఇంటి గోడ మీద ఉన్న పళ్లెం రుచికరమైన వంటకాలతో నిండుగానే ఉంది. ఒక్క క్షణం నోట్లో నీళ్లు ఊరాయి. వెంటనే వీరభద్రయ్య ఇంటి మీద వాలాను. వీరభద్రయ్య కొడుకు ఇంట్లోవాళ్లతో మాట్లాడుతున్న విషయం అర్థమైంది. తన తండ్రి హఠాత్తుగా జీవితాన్ని చాలించడానికి కారణం రమణరావు దగ్గర చేసిన అప్పులు. అలాగే అతని కొడుకు నాగరాజు దగ్గర కొన్న నకిలీ విత్తనాలు. ఆ విషయమే ఇంట్లో వాళ్లంతా తర్కించుకుంటున్నారు. నేను మళ్లీ రమణారావు ఇంటి గోడ మీద వాలాను. రమణారావు కొడుకు నాగరాజు తన మనుష్యులకు ఏవో చెబుతున్నాడు. అప్పుడు నాకు కథ మొత్తం అర్థమైంది.

ప్రభుత్వం అనుమతి లేకుండా పర్యావరణాన్ని పాడుచేసే విత్తనాలను నాగరాజు రైతులకు అమ్ముతున్నాడు. ఆ విత్తనాలు వాడిన రైతులు తర్వాత కలుపు మొక్కలను చంపడానికి విషపూరిత రసాయనాలను పంటచేలల్లో పిచికారీ చేస్తున్నారు. అది చల్లిన ప్రాంతంలో పంట మొక్కలు తప్ప అన్ని చెట్లూ నల్లగా మాడిపోతాయి. ఈ రసాయనాలు వాడితే రైతు పంటకే కాకుండా పర్యావరణానికి కూడా ముప్పే! ఇది నాగరాజు చేసిన నిర్వాకం. అందుకే సంతోష్ తన తండ్రి మోసపోయినట్టుగా మిగతా రైతులు మోసపోకూడదని ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఆ విషయం ఆ ఇంట్లోవాళ్లకు చెబుతుంటే విన్నాను.

"తొలకరి వానలు పడతాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు కావాలి. అందుకే నా తండ్రి వారసత్వంగా ఇచ్చిన వ్యవసాయం చేస్తూ రైతులకు విత్తనాల మీద అవగాహన కలిగిస్తున్నాను."

ఇదంతా వింటే నాకు చాలా సంతోషం కలిగింది. నేను చేయవలసిన పనేమిటో నాకు అర్థమైపోయింది. రమణారావుకు ఏం చెయ్యాలో నిర్ణయించుకున్నాను. వీరభద్రయ్య ఔన్నత్యం, సంతోష్ గొప్పతనం ముందు రమణారావు, అతని కొడుకు నాగరాజు వెలవెల పోయారు. అంతే. వీరభద్రయ్య ఇంటి మీద వాలి అతని పిండాన్ని తిన్న నేను రమణారావు కోసం అతని కుటుంబం పెట్టిన పిండాన్ని అలాగే వదిలేసాను.

ఆ ఊళ్లోవాళ్లతో పాటు నాకూ బలంగా ఒక విషయం అర్థమైంది. రమణారావు నాటిన విత్తనం విషపూరితం. అయితే వీరభద్రయ్య నాటిన విత్తనం పంటకు ఉపయోగం. రమణారావు కొడుకు విషపూరిత విత్తనం. వీరభద్రయ్య కొడుకు మేలురకపు మంచి విత్తనం. మంచి విత్తనాన్ని వీరభద్రయ్య ఆ ఊరికి అందించాడు. అందుకే నోరులేని మూగజీవి అయిన నేను కూడా ఆ విషయం గ్రహించి ఆ ఇంటిపై వాలాను.

రమణారావు ఇంటివాళ్లు నా వంక దీనంగా చూస్తున్నారు. వాళ్ల మొహాల్లో భయం!

సూర్యోదయం దాటింది. మెల్లగా చీకటి తెరలు వ్యాపిస్తున్నాయి. సూర్యాస్తమయం కూడా అయిపోయింది. వాళ్లు ఆ గోడ మీద ఉంచిన ఆహారం ఎండిపోయింది. కనీసం ఏ పురుగూ కూడా ఆ వైపుకు రాలేదు. ఇక సూర్యాస్తమయం అయితే ఆహారం ముట్టుకోను కదా. అంతే! అక్కడి నుంచి కదిలి నా గూటికి చేరుకున్నాను. అలా ఆ ఇంటి మీద వాలిన నేను ఎదురుగా ఉన్న రమణారావు ఇంటి మీద వాలలేదు. ఈ విధంగా నేను న్యాయం చేసాను. ధర్మాన్ని నిలిపాను. ఎందుకంటే నేను కాలజ్ఞానిని కదా!



9381232456




# నది

అశోక్ ఆనంద్

సినిమా రంగ ఔత్సాహిక రచయిత మరియు దర్శకుడు.

***'మనలో చాలామంది ప్రపంచాన్ని చూడాలంటే పాస్పోర్ట్ కావాలనో లేక డబ్బులు కావాలనో భ్రమలో బ్రతికేస్తుంటారు. నిజానికి... టైమ్ ఉంటే సరిపోతుంది. బోర్డర్లు దాటలేకపోయినా, డాబా మీదకెళ్ళి గాలి పీల్చుకున్నా సరిపోతుంది. నా దగ్గరెన్ని డబ్బులున్నా... నేను తిరిగే పబ్బులు, గడుపుతున్న ఇంటర్నెట్... ఇవే ప్రపంచమనే భ్రాంతిలో బ్రతికేవాణ్ణి. అప్పుడే వచ్చింది, నది. నేను మిస్సవుతున్న ప్రతీ అణువు పనిలోనూ ఓ విశ్వముందని గుర్తించేలా చేసింది.***

'ఆర్నెల్ల ముందు ఆ ఒక్క ఉత్తరానికి నేను రెస్పాండ్ అవ్వకుండా ఉండాల్సింది.' అని అర్ణవ్ గుండెలో మెదిలిన ఈ మాట, ఎదురుగా ఉన్న సముద్రానికి వినిపించిందో ఏమో... ఒక్కసారిగా భయపడ్డ అలలు, తీరంలో నిల్చున్న అర్ణవ్ బూట్లను తాకకముందే స్తంభించిపోయాయి!

ఆర్నెల్ల ముందు...

సాయంత్రం ఆరున్నరౌతుంది. పాల ప్యాకెట్ కోసం బయటకెళ్ళిన అర్ణవ్ కారొచ్చి అతని గుమ్మం ముందు ఆగింది. అర్ణవ్ కళ్ళు ఇంటి ముందునున్న లెటర్‌బాక్స్ మీద ఆగాయి.

★★★

కాఫీ తయారైంది. కప్పును బాల్కనీ టేబుల్ మీద పెట్టి, లెటర్ కవర్ను చించాడు.

ఒక శిల్పి శిల్పాన్ని చెక్కుతున్నప్పుడు ఎంత శ్రద్ధగా చెక్కుతాడో, అచ్చం అలానే ఉంది ఈ చేతి వ్రాత! ఇంద్రధనుస్సు అటూ ఇటూ చెదిరిపోకుండా ఎంత పర్ఫెక్ట్‌గా ఉంటుందో, అంతే నిర్దోషంగా అమర్చి ఉన్నాయి... అందులోని అక్షరాలు!

వాతావరణంలో కమ్ముకుంటున్న కాఫీ పొగలో ఈ ఉత్తరపు అక్షరాలు కూడా జత కట్టడం మొదలుపెట్టాయి.

'పూర్తిస్థాయి వాణిజ్యపరంగా మారిపోతున్న ఇప్పటి ఎంటర్టైన్మెంట్ మాధ్యమాల్లో, ఈ రోజుక్కూడా నేను ఎఫ్.ఎమ్. వింటున్నానంటే కారణం, మీ భావాల చాటున భావుకత. Yes, I'm talking about your podcasts. అందరి అక్షరాల ఖాళీల మధ్య అబద్ధముంటే, మీ అక్షరాల ఖాళీల మధ్య మాత్రం అవసరముంది. ఇప్పటి మనుషులు తెలుసుకోవాల్సిన... నేర్చుకోవాల్సిన అవసరం! మిమ్మల్ని రోజూ అభినందించే వందమందిలో, నేనూ ఒకరినని నాకు తెల్సు! కానీ వందలాది అభినందనల్లో నాది ఒకటిగా మిగిలిపోవడం ఇష్టం లేకనే, ఇలా ఉత్తరం రాయాల్సొచ్చింది. ఒక కళాకారుడికి, అందులోనూ ముఖ్యంగా రచయితకి 'అభినందన' కంటే బలమింకేది ఉండబోదు. And you can erase a whatsapp message. But you can't tear a paper. కవికి కాగితం కాలక్షేపం కాదు. కన్నీటిని తుడిచే కౌగిలి కూడా. ఎట్టి పరిస్థితుల్లోనూ




మీ అక్షర ప్రస్థానం మాత్రం మహాప్రస్థానమొందకూడదని నా మనవి! మీకు ఇబ్బంది లేదనిపిస్తే మీ అరచేతిని ఓ కాగితంపై ఆన్చి, దాని చుట్టూ పెన్సిల్తో గీసి నాకు పంపించగలరు. అలా ఎందుకడిగానో ఇంకెప్పుడైనా చెప్తాను. మిమ్మల్ని కలిసి మీతో ఓ సెల్ఫీ అడగడానికి నా ఆత్మాభిమానం అడ్డురాకపోయినా, దాన్ని చూడాలంటే మాత్రం నా అంధత్వం అడ్డొస్తుంది – నది.'

కాఫీ అయిపోయింది. అర్ణవ్ జీవితంలో అతను తయారు చేసుకున్న కాఫీ కంటే మొదటిసారి ఓ మనిషి మాటలు అందంగానూ, అర్థవంతంగానూ తోచాయి.

★★★

పేపర్, పెన్సిల్ అందుకున్నాడు.

★★★

'నాకు లేనిది చూపు మాత్రమే, మెదడు కాదు. By the way నమ్మితే నమ్మండి. లేదంటే లేదు... ఈ ఉత్తరాన్ని చూడటంలో మరో మనిషైతే నాకు సాయం చేయలేదు. Sorry for wasting your time. Goodbye. – నది.'

చదివి, కవర్లో పెట్టి, ఆలోచనలో పడ్డాడు అర్ణవ్.

'నాకేమాత్రం నమ్మశక్యంగా లేదు. కానీ నేను పంపింది నా చేతిగీతలు కాదు, పిచ్చిగీతలు అని ఎవరి సాయం లేకుండానే మీరు కనిపెట్టడం అనేది నిజమైతే... నాకు ఇప్పుడే మిమ్మల్ని కలవాలనుంది. మీకు సమ్మతమైతే దీనికి ప్రత్యుత్తరంగా మీ ఫోన్ నంబర్ పంపగలరు' అని రాసి ముగించాడు అర్ణవ్.

★★★

నది ఫోన్ మ్రోగింది. అర్ణవ్ కాకుంటే అది కస్టమర్ సర్వీస్ కాల్ అయ్యుండాలి.

"నదీ... how's it possible?"

"Everything is possible when you pour your mind into it."

"Shall I meet you?"

"I would like to"

"నన్ను రమ్మంటావా?"

"నేనే వస్తాను."

★★★

అర్ణవ్ ఇంటి కాలింగ్ బెల్ మ్రోగింది. నిస్సందేహంగా అది నది మాత్రమే అయ్యుంటుంది.

ఇద్దరూ చెరో కాఫీ కప్పుతో బాల్కనీలో కూర్చున్నారు.

"Arnav, I don't know how... but ఇదంతా ఎవరికైనా చెప్పినా నమ్మరు. And ఇప్పటివరకూ ఎవరితోనూ చెప్పుకోవాలన్న సందర్భం కూడా రాలేదు. I can sense and feel every little thing. సాధారణంగా మనుషుల సొంతమైన దేనిమీదైనా వాళ్ళకి నిర్లక్ష్యం ఉంటుంది. అందులో మొదటిది ఆరోగ్యం, శరీరం! జబ్బు చేస్తే గానీ ఆరోగ్యం విలువ, వృద్ధాప్యం వస్తే గానీ శరీరం విలువ ఎవ్వరికీ అర్థం కావు! కళ్ళున్నాయనే ఒక ధీమాతో ఈ మనుషులందరూ చూడటం మానేసి కొన్ని యుగాలౌతుంది. నా వరమనుకుంటా, ఇలా పుట్టడం. ప్రతీదీ చూడగల్గుతున్నాను. శ్రద్ధతో! You really don't need eyes to observe and to feel things. నేనుండేది ఇక్కడ్నుంచి నాలుగు కిలోమీటర్లు. నడుచుకుంటూనే వచ్చాను. ప్రకృతి మీద నాకు నమ్మకముంది కానీ మనుషుల అలవాట్ల మీద లేదు. అందుకే చెప్పులేసుకుని నడవాల్సొచ్చింది."

నది మాటలేవీ అర్ణవ్‌కు ఆశ్చర్యంగా అనిపించడం లేదు. కానీ ఆ మాటల లోతుల్లో ఒక సత్యమేదో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

"సరే అయితే నా చేతినెందుకు అడిగినట్లు!" అన్నాడు.

"I can feel your face with your touch" తడుముకోకుండా చెప్పింది.

"Interesting Nadhi. BTW You're looking beautiful."

"I know"

“ఎలా! నీ చేతుల్ని నువ్వే పట్టుకుని చూస్కున్నావా!” వెటకారం జోడించాడు.

“దయచేసి నువ్ కామెడీ మాత్రం రాయకే.. ప్లీజ్” అంది.

నవ్వులు!

★★★

అలల నురగలు చెప్పుల్లేని అర్ణవ్ పాదాలను ముంచెత్తుతున్నాయి. దూరం నుంచి నడుచుకుంటూ వస్తుంది నది. తడుముకోకుండా. ఆత్మస్థైర్యంతో!

“హాయ్” పలకరించాడు.

“నీ గొంతులోని వైబ్రేషన్ వింటుంటే జీవితంలో ఎప్పుడూ ఇంత ఆనందంగా ఉన్నట్లు లేదే!” నవ్వుతూ జవాబిచ్చింది.

“నదీ... కాళ్ళకు చెప్పుల్లేకుండా సముద్రంలో తిరగడంలో ఇంత అద్భుతమైన ఫీలింగ్ ఉంటుందని తెలిస్తే పాతికేళ్ళు వృథా చేసేవాణ్ణి కాదు!” అన్నాడు.

“అర్ణవ్... కళ్ళు మూసుకో” అంది. మూసుకున్నాడు.

“Observe the travel of your breath. మనం చేసే ప్రతీ ‘చిన్న పని’ అనుకుంటున్న పనిలోనూ ఒక జీవం ఉంటుంది. దాన్ని గమనించడానికి కాస్త టైమ్ ఇవ్వగలిగితే చాలు. ప్రాక్టికల్గా మాట్లాడుకుంటే మన శరీరంలో ‘మనసు’ అనే వస్తువు ఫిజికల్గా ఎక్కడుందో ఎవ్వరికీ తెలీదు. It is all about the MIND. I don’t believe in God things. But I always believe in the process of the Universe. మనలో ఎంత కావాలో అంతా ఇంద్రజాలాన్ని అది వరమిచ్చేసింది. దాన్ని use చేసుకునే వాళ్ళు కాబట్టే అప్పట్లో ఈ మునులు, యోగుల మైండ్స్‌కు వయసు సోకేది కాదు. That’s why they’re so powerful in doing miraculous things. కానీ మనమేం చేస్తున్నాం. ద్వేషం అనే పొరలతో మెదడుకో ముసలి చర్మాన్ని తొడుగుతున్నాం.”

ఒక పెద్ద అలొచ్చి అర్ణవ్ మోకాళ్ళను తడితే గానీ నది మాటల నుండి స్పృహలోకి రాలేకపోయాడు అర్ణవ్.

★★★

మాసాలు మాసిపోయాయి.

నది సాన్నిహిత్యంలో తనో రచయితనన్న విషయం పూర్తిగా మర్చిపోయి, ఓ విద్యార్థిగా మారిపోయాడు అర్ణవ్. తను కల్పించుకునే ప్రపంచం నుంచి బయటకొచ్చి నిజమైన ఉనికి గల ప్రపంచాన్ని వెతుక్కునే కార్యంలో నిమగ్నమై ఉన్నాడు అర్ణవ్.

★★★

రాత్రి తొమ్మిదిన్నర. F.M లో అర్ణవ్ podcast ప్లే అవుతుంది. అది వింటూ తన గదిలో తల స్నానం చేస్తుంది నది. అర్ణవ్ తన ఇంట్లో నుంచి బయల్దేరాడు. మొదటిసారి నది ఇంటికి వెళ్ళబోతున్నాడు. కార్ కీస్‌ను సోఫా పైకి విసిరేసి, దారిపై అడుగులు మోపాడు అర్ణవ్. అర్ణవ్ ఊర్లో ఉన్న విషయం నదికి తెలీదు. ఈరోజు ప్లే అవ్వబోయే podcast ను మాత్రం వినమని చెప్పాడు. నది వింటుంది. అర్ణవ్ నడుస్తున్నాడు.

★★★

'మనలో చాలామంది ప్రపంచాన్ని చూడాలంటే పాస్పోర్ట్ కావాలనో లేక డబ్బులు కావాలనో భ్రమలో బ్రతికేస్తుంటారు. నిజానికి... టైముంటే సరిపోతుంది. బోర్డర్లు దాటలేకపోయినా, డాబా మీదకెళ్ళి గాలి పీల్చుకున్నా సరిపోతుంది. నా దగ్గరెన్ని డబ్బులున్నా... నేను తిరిగే పబ్బులు, గడుపుతున్న ఇంటర్నెట్... ఇవే ప్రపంచమనే భ్రాంతిలో బ్రతికేవాణ్ణి. అప్పుడే వచ్చింది, నది. నేను మిస్సవుతున్న ప్రతీ అణువు పనిలోనూ ఓ విశ్వముందని గుర్తించేలా చేసింది.

డియర్ నది.. పెళ్ళి, ప్రేమ, స్నేహం లాంటి పదాల చాటున బంధాల కోసం నాకు నిజంగా తెలీదు. కానీ, నువ్వు నా పక్కనుంటే ప్రపంచం అందంగా కనపడుతుంది. నాలో ఆనందం కనపడుతుంది. నా నుంచి ఏమీ అడగకుండానే, నీ నుంచి అన్నీ నేర్చుకునేలా చేసింది నీ సాన్నిహిత్యం. నీకు అభ్యంతరం లేకపోతే.. నీ నీడలోనే నిరంతర విద్యార్థిగా చచ్చేవరకూ బ్రతకాలని అభ్యర్థిస్తూ... అర్ణవ్'

★★★

నది ఇంటి తలుపుపై అర్ణవ్ చేయి పడినంతనే, నీలం రంగు చీర కట్టుకున్న ఓ అమ్మాయొచ్చి, అర్ణవ్ చేయి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళి, ఒక ఆల్బమ్‌ను అతని ముందు పడేసింది. అందులో ఉన్న చాలామంది అమ్మాయిల ఫోటోల వైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు అర్ణవ్.

"ఏంటలా చూస్తున్నావ్! త్వరగా సెలెక్ట్ చేసుకుంటే నైట్ కి రేట్ చెప్పి, అమ్మాయిని పంపిస్తాను. రూమ్ మాత్రం నీదే!" అంది.

ప్రపంచం దాని పని అది చేసుకుపోతుంది. ఎవరి బాధ కోసమూ అది ప్రళయాలు పుట్టించదు. సునామీలు సృష్టించదు. భూమి తిరుగుతోంది. అర్ణవ్ మాత్రం ఆగిపోయాడు. ఆగిపోయిన అణువుల్ని తనలోకి లాక్కునే విశ్వం, అర్ణవ్‌ని మాత్రం వదిలేసింది. జాలిపడి ఉండొచ్చు. మొహంలో ఏ భావం లేని అర్ణవ్ అరచేయి, ఆల్బమ్‌లోని నది ఫోటో పైకి వెళ్ళింది.

"ఈ గుడ్డిదా! దీనికేమైందో, ఈ మధ్య ఎవరి పక్కలోకీ వెళ్ళనని ఆకలితోనే పడుకుంటుంది." అని చెప్పింది.

★★★

ప్రస్తుతం...

బూట్లతోనే సముద్రంలో నిల్చున్న అర్ణవ్ దగ్గరకి అలలు రావడానికి భయపడుతున్నా, నది మాత్రం వచ్చి నిల్చుంది.

"చెప్పుండాల్సింది నది" అన్నాడు, క్రింద రాలిపడుతున్న కన్నీటి కనులతో. బహుశా ఈ సముద్రం ఇలానే సృష్టించబడిందేమో.

"అబద్ధం ఎప్పుడైనా చెప్పానా?" అంది.

ప్రపంచానికి వినిపిస్తున్న సముద్ర ఘోష వీళ్ళిద్దరి చెవుల ముందు మాత్రం విఫలమైంది. అర్ణవ్ బూట్లను తీసి విసిరేశాడు. అతని అరచేతి స్పర్శతో అర్ణవ్ మొహాన్ని, చెప్పాలనుకుంటున్న భావాన్ని ఫీలవ్వగల్గింది నది.

ఎంతమంది విటులు నదిలో వ్యర్థాన్ని విడిచిపెట్టినా, పారే నది ఎన్నటికీ మలినం కాదు!

# సంస్కార వృక్షాలు




**శింగరాజు శ్రీనివాసరావు**



9052048706

*స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అధికారిగా పదవీవిరమణ అనంతరం గత ఆరు సంవత్సరాలుగా సాహిత్యం మీద అభిలాషతో కవితలు, కథలు వ్రాయడం మొదలుపెట్టిన శ్రీ శ్రీనివాసరావు గారు వ్రాసిన ఎన్నో కథలు, కవితలు వివిధ పత్రికలలో ముద్రణకు నోచుకున్నాయి. అందులో సుమారు 40 కథలు, 30 కవితలు బహుమతులను కూడ పొంది ఉన్నాయి. వీరి స్థిరనివాసం ఒంగోలు.*

***తల్లిదండ్రులుగా మీ బరువు, బాధ్యతలలో మీరు మునిగిపోవడం వలన, పిల్లలను పెద్దగా పట్టించుకునే సమయం ఉండదు. అటువంటప్పుడు ఇంట్లో పెద్దవాళ్ళుంటే ఆ పిల్లల ఆలనా, పాలనా చూసుకుంటూ, వారికి మంచి, చెడులు నేర్పుతారు. మన దేశంలో ఈ రోజులలో న్యూక్లియర్ కుటుంబాలు ఏర్పడి, పిల్లలకు తాతయ్యంటే ఎవరో, అవ్వలంటే ఎవరో తెలియకుండా పోతున్నది.***

చాలా హడావుడి పడుతున్నాడు డెబ్బై సంవత్సరాల వయసున్న భానుమూర్తి. పెద్ద కంపెనీలో మంచి హోదాలో పదవీ విరమణ చేసిన అతను, ఉద్యోగంతో పాటు భార్య కూడ అతనిని వీడిపోవడంతో కొడుకు శ్రీధన్య వద్దకు చేరాడు.

శ్రీధన్య బెంగుళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్ నాయకుడిగా ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య హిమజ కూడ యాక్సిస్ బ్యాంకులో అధికారిగా పనిచేస్తున్నది. వాళ్ళకు ఒక్కగానొక్క కొడుకు అధర్వ. భార్య దూరమయిన తరువాత కొడుకు వద్దకు భానుమూర్తి చేరేటప్పటికి అధర్వకు రెండు సంవత్సరాలు.

కొడుకు, కోడలు ఉద్యోగస్థులు కావడంతో ఇంట్లో ఉండి మనవడిని చూసుకునే అదృష్టం కలిగింది భానుమూర్తికి. దానితో మనవడికి బాగా దగ్గరయ్యాడు. పగలంతా తన సంరక్షణలో ఉన్నా, తల్లిదండ్రులు రాగానే, వారు పిలవడంతో అక్కడికి వెళ్ళి రాత్రి అక్కడే పడుకునేవాడు అధర్వ!

మొదట పెద్దగా అనిపించక పోయినా, ఈ మధ్య మాత్రం మనవడు తనతోటే ఉంటూ, తన దగ్గరే పడుకోవచ్చు కదా అనే ఆలోచన రాసాగింది భానుమూర్తికి. ఇంచుమించు అదే పరిస్థితి అధర్వకు కూడ. ఇప్పుడిప్పుడే ఊహ తెలుస్తుండడం, తాతయ్య బోలెడన్ని కథలు, శతకాలు చెబుతుండడం, ఏదడిగనా కాదు అనకుండా కొనిస్తుండడంతో, ఆ పసిమనసుకు తాతయ్యంటే బోలెడంత ఇష్టం మొదలయింది. కానీ అది బయటకు చెప్పే వయసు లేక తల్లి పిలవగానే ఆమె దగ్గరకు వెళ్ళేవాడు.

ఇవాళ అధర్వ పుట్టినరోజు. అయిదు సంవత్సరాలు నిండుతాయి అధర్వకు. వచ్చే నెల నుంచి కొడుకును స్కూలుకు పంపాలని నిర్ణయించుకున్నాడు శ్రీధన్య. అందుకే ఈ పుట్టినరోజును ఘనంగా జరపాలని నిర్ణయించుకున్నాడు. ఆ పండుగ వ్యవహారమంతా తనే చూసుకుంటానని నెత్తిమీద వేసుకుని హడావుడి పడుతున్నాడు భానుమూర్తి.



"ఇక చాలు నాన్నా... ఆపండి! ఉదయం నుంచి ఒకటే హంగామా చేస్తున్నారు. పనివాళ్ళకు చెప్పి చేయించమంటే, సగం పని మీరే స్వయంగా చేస్తున్నారు. ఎక్కువ శ్రమ తీసుకుంటే మీ ఆరోగ్యం దెబ్బతింటుంది!" అంటూ వచ్చాడు శ్రీధన్య.

"అయిపోయిందిలేరా... ఇంకెంత... ఆ బెలూన్లు కట్టిస్తే అంతా అయిపోయినట్లే!" అన్నాడు భానుమూర్తి చేతులు దులుపుకుంటూ.

"సరే... అవి చింతయ్య కడతాడు గానీ, మీరు వెళ్ళి స్నానం చేసిరండి!"

"మరి వచ్చే అతిథులకు ఏవో బహుమతులు ఇస్తానన్నావు కదురా. మరి అవి తెచ్చావా?"

"అన్నీ సిద్ధంగా ఉన్నాయి నాన్నా. మీరు స్నానం చేసి వచ్చి అధర్వను ఆశీర్వదిస్తే, ఆ తరువాత మనం మన కార్యక్రమాన్ని ప్రారంభించుకోవచ్చు!"

"మరి వాడు తయారయ్యాడా"

"తాతయ్యా... నేను రెడీ!" అంటూ పరిగెత్తుకొచ్చాడు అధర్వ.

అసలే పసిమిరంగు, చక్కని తలకట్టు, వాళ్ళ అమ్మలా చారెడేసి కళ్ళు, దొరబాబులా ఉన్న మనవడిని చూసి మురిసిపోయాడు భానుమూర్తి.

"బంగారం నాన్నా నువ్వు. నేను స్నానం చేసి వచ్చాక నిన్ను ఎత్తుకుంటాను. ఒరేయ్ ధన్యా... వీడికి గడ్డం కింద చిన్న దిష్టిచుక్క పెట్టమని హిమజకు చెప్పు. ఎవరి కళ్ళు ఎలాంటివో చెప్పలేం!" అంటూ లోపలికి వెళ్ళాడు భానుమూర్తి.

★★★

శ్రీధన్య పిలిచిన అతని సహచరులు, అక్కడి కాలనీలో ఉండే మిత్రులు రావడంతో ఆ ప్రదేశమంతా వారితో, వారి పిల్లలతో సందడి సందడిగా తయారయింది. అక్కడికి వచ్చిన వారి పిల్లలలో ఎక్కువమంది పది సంవత్సరాలలోపు పిల్లలే! వారితో కలిసిపోయి ఎంతో హుషారుగా ఆడుకుంటున్నాడు అధర్వ. వచ్చిన వారిని ఆహ్వానించి వారికి అతిథి మర్యాదలు చేయడంలో మునిగిపోయారు శ్రీధన్య దంపతులు. అంత సందడిలోను ఒక కన్ను మనవడి వైపు వేసి తిరుగుతున్నాడు భానుమూర్తి.

ఇంతలో చింతయ్య కేకును తీసుకువచ్చి ఒక ప్రక్కగా బల్లమీద అమర్చాడు. అందరినీ అక్కడ సమావేశపరచి కొవ్వొత్తిని వెలిగింపజేశారు. పిల్లలంతా అధర్వకు ఆంగ్లంలో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పాట పాడారు. అధర్వ కేకును ముందు హిమజకు, తరువాత శ్రీధన్యకు, భానుమూర్తికి తినిపించాడు. అందరికీ కేకు ముక్కలను పంచిన తరువాత అందరూ భోజనాల వైపుకు దారితీశారు. అధర్వ భానుమూర్తిని తన వెంట తీసుకెళ్ళి, అక్కడ ఉన్న పిల్లలకు "మా తాతయ్య... నాకు మంచి స్నేహితుడు!" అంటూ అందరికీ పరిచయం చేశాడు. "అదేమిటి... అంత పెద్దాయన నీకు స్నేహితుడా?" అని అడిగిన వారికి, "అవును... తాతయ్యే చెప్పారు... ఆయన నాకు మొదటి స్నేహితుడని!" చెప్పాడు.

అది విని ఎంతో పొంగిపోయాడు భానుమూర్తి. భోజనాలు ముగిశాక అందరూ ఒకచోట చేరి పిల్లలతో పాటలు పాడించడం మొదలుపెట్టారు. ఒకరిద్దరు తప్ప అందరూ ఆంగ్లంలో వాళ్ళు నేర్చుకున్న చిన్నచిన్న పాటలను పాడారు. అందరూ బలవంతం చేస్తే అధర్వ, భానుమూర్తి నేర్పిన భగవద్గీత శ్లోకాలను అయిదింటిని శ్రావ్యంగా పాడాడు. ఆ పసివాని ప్రతిభకు అందరూ ఆశ్చర్యపోయారు. అవి నేర్పినది తన తండ్రేనని శ్రీధన్య చెప్పడంతో అక్కడి వారంతా భానుమూర్తిని అభినందించారు. వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు శ్రీధన్య.

"మా ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన మిత్రులకు, వారి కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈరోజు మా అధర్వ అయిదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాడు. వాడిని ఇక పాఠశాలలో చేర్పించాలని అనుకుంటున్నాము. ఈ సందర్భంలో వాడికి మీరు, మీ ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నాను. నా శ్రేయోభిలాషులంతా అధర్వను మూడవ యేటనే పాఠశాలలో చేర్పించమని సలహా ఇచ్చినా, మా నాన్నగారు అందుకు ఒప్పుకోలేదు. ప్రతి మనిషి జీవితంలో అతి ముఖ్యమైనది... మరణం వరకు మరువలేనిది 'బాల్యం' అన్నారు. ఆ బాల్యాన్ని స్వేచ్ఛగా అనుభవించి, ఆ జ్ఞాపకాలను మనసులో పదిలంగా దాచుకునేలా పిల్లలను పెంచాలని చెప్పారు. నిజానికి నన్ను కూడ అలానే పెంచారు.

మా నాన్న ఎప్పుడూ మనిషికి చదువు కంటే సంస్కారం ముఖ్యమని చెబుతుంటారు. పిల్లలు ప్రతిదీ మనలను చూసే నేర్చుకుంటారు కనుక మన ప్రవర్తన ఎప్పుడూ వారికి మార్గదర్శకంగా ఉండాలని చెబుతుంటారు. వారి మాట మేరకు బాబును ఇప్పటివరకు పాఠశాలకు పంపలేదు. కానీ అధర్వ, వాళ్ళ తాతగారి వద్ద శతకాలు, చాటువులు, బాల రామాయణం, భగవద్గీతలో కొన్ని శ్లోకాలు నేర్చుకున్నాడు. తెలుగు మీద మమకారం పసితనం నుంచే రావాలని పట్టుబట్టి మా నాన్నగారు వాడికి ఇవన్నీ నేర్పారు.

వారి అనుభవం నుంచి నేను నేర్చుకున్న మరో పాఠం ఏమిటంటే, మనుషులను ప్రేమించినట్లే మొక్కలను ప్రేమించాలని. ఆయనకు ఇష్టమైన మనవడి పుట్టినరోజును పురస్కరించుకుని, మీ అందరికి మా అధర్వ చేతుల మీదుగా వాటిని అందిస్తాము. వాతావరణంలో కాలుష్యం పెరిగిపోయి మనిషి మనుగడకే ప్రమాదమైన ఈరోజులలో మనవంతుగా మనం మొక్కలను పెంచి కొంతమేర వరకు మన వంతు కర్తవ్యం మనం నిర్వర్తించాలనే ఉద్దేశ్యంతో, మా అధర్వ పుట్టిన రోజు బహుమతిగా మీకు మొక్కలను అందిస్తున్నాము. మనం పెంచే మొక్కల వలన మన కన్నా, మన ముందు తరం వారికి ఎంతో మేలు కలుగుతుందని విజ్ఞులు చెబుతారు. మనం ఈ విషయాలను పిల్లలకు వివరించి మొక్కల పెంపకంపై వారికి మమకారం కలిగేలా చూడాలని నా ఆలోచన!" అని చెప్పాడు శ్రీధన్య.

అతని మాటలకు అందరూ తమ ఆమోదాన్ని కరతాళధ్వనులతో తెలియజేశారు. అనంతరం... వచ్చిన వారికి అధర్వ చేతి మీదుగా మొక్కలను ఇప్పించాడు శ్రీధన్య.

"ధన్యా... చాలా సంతోషంగా ఉందిరా. మొక్కలను అందరికీ బహుమతిగా ఇవ్వడం అనే విషయం కంటే, బాల్యాన్ని బ్రతకనివ్వాలనే మీ తండ్రి నిర్ణయాన్ని మన్నించి, మీ వాడిని అయిదేళ్ళు నిండే వరకూ స్వేచ్ఛగా వదిలేశావే... అది మాకు బాగా నచ్చిందిరా! ఒక రకంగా మా అందరికీ నువ్వొక గుణపాఠం నేర్పించినట్లుంది. పిల్లలకు మాటలు వచ్చీ రాకముందే తీసుకువెళ్ళి పాఠశాలలో బంధించి, నాలుగు సంవత్సరాలకే మోయలేని భారాన్ని వారిపై మోపుతున్నాము. బందెల దొడ్డిలో పశువుల్లా బంధించి వారికి చదువు అనే శిక్ష వేస్తున్నాము. చదువును ఇష్టంగా కాక, కష్టంలా చదివేలా చేస్తున్నాము. మీ తండ్రి గారి మార్గదర్శకత్వంలో నువ్వు నీ బిడ్డకు మంచి సంస్కారం నేర్పిస్తున్నావురా. మీ తండ్రి మీ దగ్గర ఉండడం మీ అదృష్టంరా. సరేగానీ... ఇంతకూ అధర్వను ఏ స్కూలులో చేరుస్తున్నావు? మన హేమచంద్ర వాళ్ళ అబ్బాయి చదివే ఇంటర్నేషనల్ స్కూలు బాగుందట. అక్కడ చేర్చు!" అన్నాడు శ్రీధన్య మిత్రుడు కార్తీక్.

కార్తీక్ అలా అనగానే ఒక చిరునవ్వు నవ్వి చెప్పసాగాడు శ్రీధన్య.

"నేను నా బిడ్డను ఎక్కడో అంతర్జాతీయ పాఠశాలలో చేర్చి, హాస్టలులో ఉంచి చదివించాలనుకోవడం లేదు. ఆ చదువు వాడికి డబ్బును సంపాదించి పెట్టవచ్చుగానీ, బంధాల విలువలను చెప్పలేదు. ఆ విలువలు తెలిసి, వాడిలో సంస్కారం పెరగాలంటే ఇంటివద్దనే ఉండాలి. అదికూడ మా నాన్నగారి చేతికింద. అందుకే అధర్వను ఉన్నత విలువలతో సాగే ఒక తెలుగు మీడియం పాఠశాలలో చేర్చాలనుకుంటున్నాను. వాడి ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలనే నా అభిమతం. తరువాత కావాలంటే ఆంగ్ల మాధ్యమానికి మారవచ్చు. అన్నిటి కంటే ముఖ్యం... వాడికి ప్రేమల విలువ తెలియడం! వాడికి, వాడి తాతగారంటే ప్రాణం. ఆయనకు కూడ అంతే. ఆయన చల్లనినీడలో వాడొక సంస్కార వటవృక్షంగా ఎదుగుతాడని నా నమ్మకం!" అని చెప్పి అధర్వను తీసుకుని భానుమూర్తి వద్దకు వచ్చి అతని పాదాలకు నమస్కరించాడు.

భానుమూర్తి మనసు ద్రవించింది. శ్రీధన్యను పైకిలేపి గుండెలకు హత్తుకున్నాడు. తండ్రి యెడల శ్రీధన్యకున్న గౌరవానికి, ప్రేమకు అక్కడందరూ సంతోషించారు.

"ఇక్కడ ఉన్నవారందరూ నాకంటే చిన్నవాళ్ళే. మీకు నా దీవెనలను అందిస్తూ నా సంతోషాన్ని మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. పెద్దవారు ఇంట్లో ఉండడమే తమకు అడ్డుగా భావించి, బదిలీలు పెట్టుకుని బయటకు వెళ్ళి, వేరే కాపురాలు పెడుతున్న ఈరోజులలో, నన్ను తనవద్దనే ఉంచుకుని, నామీద నమ్మకంతో వాడి బిడ్డ బాధ్యతను నాకు అప్పగిస్తున్నాడు నా కొడుకు.

తల్లిదండ్రులంటే మీ స్వేచ్ఛకు అడ్డువచ్చే గోడలు కాదు బాబూ, మీ బిడ్డల భవితకు వారు పునాదిరాళ్ళు. మనవడికి తాత మొదటి స్నేహితుడైతే, తాతకు మనవడు చివరి స్నేహితుడు! ప్రేమతో మంచి, చెడులు నేర్పి సంస్కరిస్తాడే కానీ, మీ బిడ్డను మీకు దూరం చేయాలనుకోడు. మనవడి దగ్గర తాత తన వయసును మరచిపోయి పసివాడై, వాడితో ఆడుకుంటాడు. ఈ వయసులో మాకు ఇంతకంటే ఆనందాన్ని కలిగించే విషయం వేరేది ఉండదు.

ఈనాడు పిల్లలు దారితప్పి మధువుకు, మత్తుమందులకు బానిసలవుతున్నారంటే దానికి ప్రధాన కారణం, పెద్దల మార్గదర్శకత్వం వారికి లేకపోవడం. తల్లిదండ్రులుగా మీ బరువు, బాధ్యతలలో మీరు మునిగిపోవడం వలన, పిల్లలను పెద్దగా పట్టించుకునే సమయం ఉండదు. అటువంటప్పుడు ఇంట్లో పెద్దవాళ్ళుంటే ఆ పిల్లల ఆలనా, పాలనా చూసుకుంటూ, వారికి మంచి, చెడులు నేర్పుతారు. మన దేశంలో ఈ రోజులలో న్యూక్లియర్ కుటుంబాలు ఏర్పడి, పిల్లలకు తాతయ్యంటే ఎవరో, అవ్వలంటే ఎవరో తెలియకుండా పోతున్నది.

ఈ పద్ధతి మారాలి. మన తల్లిదండ్రులు మనతోపాటే ఉంటే, మన బిడ్డలకు మనమంతా ఒక కుటుంబం అనే భావన కలుగుతుంది. వారు పెద్దవారయ్యాక కూడ, మనలను వారితో పాటే ఉంచుకోవడం వారి బాధ్యతగా గుర్తిస్తారు. అలాకాకుండా మనకు వాళ్ళు అడ్డు అని మనమే మన తల్లిదండ్రులను దూరంగా ఉంచితే, ఇదే అసలు పద్ధతి కాబోలు అనుకుని, మన పిల్లలు పెద్దయ్యాక మనలను వదిలి వెళ్ళిపోతారు. 'యథా జనకా... తథా పుత్రకా' అనే కొత్త నానుడి పుట్టుకు వస్తుంది. అటువంటి బంధాలను తెంచివేసే ఆనవాయితీకి తెరపడాలి. బంధాలు బలపడాలి, మనుషుల మధ్య ఆత్మీయతలు పెరగాలి.

మావాడు, అథర్వ స్కూలు విషయంలో తీసుకున్న నిర్ణయం ఎంతో గర్వించదగ్గది. మొదట నేర్చుకునే విద్య మాతృభాషలో జరిగితే, పాఠ్యాంశాల మీద మంచి అవగాహన ఏర్పడుతుంది. కొంచెం వయసు పెరిగి, మేధస్సు పెరిగితే, ఏ భాషలోనైనా ఆ పిల్లలు రాణించగలుగుతారు. ఈరోజు దేశాధినేతలు, శాస్త్రవేత్తలు, ప్రాథమిక విద్యను వారివారి మాతృభాషలలో అభ్యసించిన వారే! మీ బిడ్డలు కూడ సంస్కార వృక్షాలుగా ఎదిగి, సమాజం గర్వించే పౌరులు కావాలని ఆశిస్తూ, చిరంజీవులను మనఃస్ఫూర్తిగా దీవిస్తున్నాను!" అని ముగించి అథర్వను ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు భానుమూర్తి.

"తాతయ్యా... ఇవాళ నుంచి నేను మీ దగ్గరే పడుకుంటాను. నాకు బోలెడన్ని కథలు చెప్పాలి!" అని భానుమూర్తి మెడను చుట్టేశాడు అథర్వ. ఆ ప్రదేశమంతా అతిథుల చప్పట్లతో మారుమ్రోగి పోయింది. భానుమూర్తి మాటలలోని వాస్తవాలు అక్కడికి వచ్చిన వారిని ఆలోచనలో పడవేశాయి.



8500884400

# సముద్రం

డా. పాపినేని శివశంకర్

**విశిష్ట అతిథి కథ**

> ***కొడుకు గురించి ఇంకో విచారం.***
> ***'వాడు ఖండాలు దాటి వెళ్లిపోయాడు. కమలిని వాడ్ని చాలా ముద్దు చేసేది. 'యాహూ' సామ్రాజ్యంలో, ఇవాళ వాడొక బంటు. బోలెడంత సంపాదన. కానీ, వాడికి అమ్మతోనైనా తనివితీరా మాట్లాడే సమయం లేదు. ఉన్నంత కాలం కమలినికి అదే దిగులు. మనుషులు అనంత దూరంలో ఉన్నా మనసును తాకుతూ మాట్లాడొచ్చు. దూరం కావడమే మనకు తెలుసు.***
> ***దూరంగా ఉండీ, దగ్గర కావడం తెలియదు.'***

"సముద్రాన్ని ఎక్కడ పారబోయ్యాలి?" నాముందున్న ప్రశ్న ఇది!

ప్రశ్న నాది కాదు. సమాధానం కూడా నాదగ్గర లేదు. నేను కేవలం ఒకానొక పెనుహోరుని చాలా కాలంనుంచీ సన్నిహితంగా గమనిస్తున్న మనిషిని మాత్రమే.

మర్చిపోతున్న జ్ఞాపకాలను గుర్తు చెయ్యమన్నావు. ఇది అల్జీమర్స్ వ్యాధి లక్షణం. ఇప్పుడు నా జ్ఞాపకాలే చెప్తున్నాను విను.

*(పుస్తకమాలి)*

1. వనమాలీ, ఏ చదువుకొనే రోజుల్లో కలిసాయో మన ఆలోచనలు! కొద్దికాలంలోనే స్నేహితులమయ్యాం. క్లాసులో లెక్చరర్లు ఊహించని ప్రశ్నలెన్నో అడిగేవాడివి. లైబ్రరీలో పుస్తకాలు తెచ్చి, సందేహాలు తీర్చుకునేవాడివి. క్లాస్మేట్స్ నీకు పెట్టిన పేరు పుస్తకాల పురుగు. అయితే ఈ పురుగు పుస్తకాలని అదేపనిగా నమిలే పురుగు కాదు. సముద్రాన్ని సైతం పుక్కిట పట్టదలచుకున్న పురుగు. నేను మాత్రం నిన్ను 'పుస్తకమాలి' అని పిలిచేవాడ్ని. ఎప్పుడూ నాలుగైదు పుస్తకాలు నీతోపాటే ఉండేవికదా! నీ ద్వారానే నాకు శ్రీశ్రీ, చలం, తిలక్ పరిచయం. నీవల్లే నేను సమాజాన్ని కొంత హేతుబద్ధంగా చూడ్డం నేర్చుకున్నాను. చాలారోజులు నీచేతుల్లో రంగనాయకమ్మ 'విషవృక్షం' పుస్తకం ఉండేది. ఒక్కోసారి దస్తోయెవిస్కీ 'క్రైం ఎండ్ పనిష్మెంట్'.

2. షేక్స్పియర్ నాటకాలంటే నీకెంతో ఇష్టం. ముఖ్యంగా 'మేక్బెత్'. It is a tale told by an idiot, full of sound fury, signifying nothing... అని, మేక్బెత్ జీవితవ్యాఖ్యానం నువ్వు పోయెటిక్ ఏక్సెన్ట్‌లో చదువుతుంటే... తదేకంగా వినబుద్ధయ్యేది. మన ప్రిన్సిపాల్‌కి మిల్టన్ ఇష్టం. షేక్స్పియర్ కన్నా మిల్టన్ గొప్పవాడని ఆయన చెప్తుంటే, క్లాసులో నువ్వు నిలబడి షేక్స్పియర్ పక్షాన వాదించడం... ఆయన సర్దుకుంటుంటే, ఆడపిల్లలు నీ వంక ఆరాధనగా చూడడం... నాకింకా గుర్తే. విజ్ఞానానికి విలువవున్న రోజులవి.



(వృత్తిలో మనిషి)

1. చదువు పూర్తికాగానే విడిపోయాం. చదువుకొన్న యూనివర్సిటీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరినట్టు ఉత్తరం రాసావు. ఉత్తరంలో నీ అక్షరాలు స్ఫుటంగా, నీ మనసు అర్థం చేసుకొని, కాగితం మీద కుదురుగా కూర్చున్నట్టు అనిపించేది. తొణుకూ, బెణుకూ లేకుండా, అచ్చం నీ మనసుమల్లే!

2. వృత్తికీ, ప్రవృత్తికీ సంబంధం అందరూ తెంచేసుకుంటున్న కాలంలో, షేర్లకీ, రియలెస్టేట్ కార్యక్రమాలకీ అంకితమైపోతున్న కాలంలో, నువ్వు వృత్తికి అంటుకుపోయావు! పాఠంలో నువ్వు లీనమై, విద్యార్థుల్ని లీనం చేసే తీరు, పాఠానికే పరిమితం కాక, దానికి చుట్టుపక్కల అనేక సామాజిక విశేషాలు విపులీకరించే తీరు, ప్రశాంతతలో ఉద్వేగం కలిసిన ఉపన్యాస వైఖరి విద్యార్థుల్ని విశేషంగా ఆకట్టుకొనేది. వాళ్ళకి నువ్వు ఆదర్శానివి. సమాచారం కాక, వాళ్ళలో సృజనాత్మకత పెంచడమే నీ ఆశయం. నీకు మల్లే బోధనారంగంలో కాకుండా, ఎడ్మినిస్ట్రేటివ్ రంగంలో స్థిరపడినందుకు విచారం కలిగేది.

3. ఉద్యోగంతోనో, పెళ్లితోనో చాలామంది విస్తరణ ఆగిపోతుంది. అక్కడ నుంచి తమను తాము నెరుపుకొనే వాళ్ళు ఏ కొద్దిమందో! అటువంటి వాడివి నువ్వు. నిన్ను నువ్వు పుస్తకాల పుటల్లో విస్తరించుకున్నావు. నీ సామాజిక వ్యాసాలు పత్రికల్లో చదువుతూ వచ్చాను. మారుతున్న కాలాన్ని, మారుతూ నువ్వు అవగాహన చేసుకున్న తీరు వాటిలో కనిపించేది. ప్రజా సమస్యల పట్లా, ఉద్యమాల పట్లా మౌలిక స్పందన కనిపించేది.

4. చాలాకాలానికి మీ ఇంటికి వచ్చినప్పుడు గదుల నిండా పుస్తకాలు చూసి ఆశ్చర్యపోయాను. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోవడం వల్ల కలిగిన ఒంటరితనం పుస్తకపఠనంలో మరుగు పడిందేమో!

   అప్పుడు 'ఇరావతీ కర్వే' 'యుగాంత' గురించి మాట్లాడుకున్నాం. 'అస్తిత్వవాద ప్రాతిపదిక మీద భారతం గురించి ఆమె చేసిన విశ్లేషణ అద్భుతం' అని వివరించావు. 'రాహుల్ సాంకృత్యాయన్' 'గంగా సే వోల్గా' గురించి మాట్లాడుకున్నాం. 'ప్రేమ్ చంద్' 'రంగభూమి' గురించి మాట్లాడుకున్నాం. శరత్, కిషన్ చందర్, భైరప్ప, తక్కళి శివశంకరన్ పిళ్లై, గోపీనాథ్ మహంతి, టి.ఎస్.ఇలియట్, క్రిస్టోఫర్ కాడ్వెల్, పాబ్లో నెరూడా... ఎంతమంది రచయితలు నీ మాటల్లో మళ్ళీ బతికేరు! నేను నిజంగా జీవించిన రోజుల్లో ఆ సాయంత్రం ఒకటి!

5. 'We are the hollow men; we are the stuffed men...' ఇలియట్ వేదనా, నీ వేదనా ఒకటేనా వనమాలీ? జీవనసారాంశం కోల్పోయి, డొల్లలుగా మారుతున్న మనుషుల గురించేనా?

మన సంభాషణ ప్రపంచమంతా తిరిగి, విభూతీభూషణ వంద్యోపాధ్యాయ 'వనవాసి' దగ్గర ఆగింది.

*(వనవాసి)*

1. గొప్ప నవల అది. ఒక యువకుడు, సత్యచరణ్ ఉద్యోగం కోసం తన స్నేహితుడి ఎస్టేట్ లో మేనేజర్‌గా చేరతాడు. బెంగాల్లో ఎక్కడో దూరప్రాంతాన ఎస్టేట్ కి సంబంధించిన అడవుల్ని కొట్టేయించి, సాగులోకి తేవడం అతని పని. మొదట కలకత్తా జనసమ్మర్దానికి దూరమై, మారుమూల నిర్జన ప్రాంతానికి వెళ్లినందుకు విచారించినా మెల్లమెల్లగా ఆ ప్రకృతి అతన్ని ఆకర్షిస్తుంది. అడవి అతన్ని ఆవహిస్తుంది. నాఢా, లవటు, లియా, మోహన్ పురా అడవుల సౌందర్యానికి ముగ్ధుడౌతాడు. ఆ అడవుల్లో భానుమతిలాంటి అందగత్తెలూ, కుంటలాంటి నిర్భాగ్యులూ, సంతాల్, గోండు, గంగోతా వంటి తెగల నిష్టదరిద్రులూ, అతనికి తారసపడతారు. వారి నిసర్గ జీవన విధానానికి పరవశిస్తాడు. అయితే, ఆ మహాసౌందర్యమంతా తన చేతుల మీదుగానే ధ్వంసమౌతుంది.

'ఓ అరణ్యానీ, ఆదిదేవతా నన్ను క్షమించు' అన్నది ఆ నవలలో ఆ యువకుడి చివరి వీడ్కోలు మాట.

'నాకెంతో నచ్చిన పుస్తకం. ఒక అద్భుతం.' అన్నావు. నచ్చినవన్నీ నీకు అద్భుతాలే!

2. 'ఈయనలోని జ్ఞానదాహమే నాకు నచ్చిందన్నయ్యా! నిజమైన జ్ఞానదాహం కలవాడు మంచివాడనే నమ్మకంతోనే ఈయన్ని పెళ్లాడాను. అందుకు పశ్చాత్తాపం లేదు. కానీ, పిల్లల పెంపకం కూడా నేనే చూసుకోవాలి. ఆయనకి పట్టదు. రోజుకి పదిగంటలు పుస్తకాల్లోనే! ఆరోగ్యం ఏమౌతుందోనని నా భయం." అంది కమలిని నీ పరోక్షంలో. ఇంట్లో పుస్తకాల మధ్య, లేదా లైబ్రరీలో కాలమంతా గడపడం వల్ల, ఆత్మీయులకు దూరమౌతుండడం కమలిని గమనించింది. నీకోసం ఆమె చాలా త్యాగం చేసిందనుకుంటా. నువ్వు రాసే వ్యాసాలు సాపుచేసి పంపించడం తన బాధ్యత. పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్లి తీసుకు రావడమూ తన పనే!

3. రోజుల తరబడి బయటికి రావు. పరిగెత్తే మనుషుల్ని పట్టించుకోవు. కార్లలో తిరగాలనే కోరిక లేదు. కొండలూ, వాగులూ, సంధ్యాకాశాలూ చూసి పరవశిస్తావు. ఆడంబరంగా ఉండవు. ఎప్పుడూ అవే రకం తెల్లదుస్తులు. వనమాలీ, ఆధునిక సన్యాసివి నువ్వు.

*(పుస్తకాలూ–మనుషులూ)*

1. నువ్వు పుస్తకాల్ని ఎక్కువ ప్రేమిస్తావా? లేక మనుషుల్నా? అడిగానొక రోజు.

కొత్తగా కొన్న పుస్తకానికి నువ్వు అట్ట వేస్తుంటే చూస్తున్నాను. బహుశా పసిపిల్లకి తల్లి అలాగే దుస్తులు తొడుగుతుంది. అట్ట చిరిగిపోతే బాధపడతావు. పుస్తకం తీసుకున్న స్నేహితుడు తిరిగి ఇవ్వకపోతే విచారిస్తావు... గొప్ప సంపదేదో కోల్పోయినట్టు!

'రెండిటినీ' అని నీ జవాబు. 'రెండిటికీ వైరుధ్యమే లేదు. పుస్తకాల్ని ప్రేమించేవాడు మనుషుల్ని మరింతగా ప్రేమించగలడు. నిజానికి మనుషుల్ని ప్రేమించగలగడమే గొప్ప పుస్తకాలు నేర్పాయి.'

2. ఒకవేపు అన్ని ఇళ్ళలో బుక్ షెల్ఫ్‌ల స్థానంలో షో కేసులు ఏర్పడుతుంటే, మీ ఇంట్లో పుస్తకాల అరలు పెరిగిపోతున్నాయి. వారానికొకసారి పుస్తకాల షాపుకి వెళతావు. ఆదివారం వస్తే, పాతపుస్తకాల బజారుకి పోతావు. కొన్న పుస్తకాలూ, ఎవరెవరో పంపించిన పుస్తకాలూ, చరిత్ర, తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రం, సాహిత్యం... ఎన్నెన్ని పుస్తకాలో... సముద్రంలో అలల్లా పుస్తకాలే పుస్తకాలు.

చదివే పుస్తకాల నిండా అండర్లైనులు. నోట్సు రాసుకోవడం, వ్యాసాలు రాయడం, రిఫరెన్సు కోసం పుస్తకాల దొంతర్లు విప్పడం, అవసరమైన విషయం మీద మరింత సమాచారం కోసం మళ్ళీ పుస్తకాలు కొనడం, లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తిరగేయడం... నువ్వు మనుషుల్లో మెలుగుతున్నావో, పుస్తకాలతో మెలుగుతున్నావో అర్థం కాని సంగతి.

3. 'రాత్రి కలొచ్చింది. గోరా కనబడ్డాడు తెల్లగా...' అన్నావు.

'అదేమిటి?'

'రవీంద్రనాథ్ టాగోర్ నవలల్లో నాయకుడు. అహ్మదాబాద్, గుజరాత్ మతకలహాలు చూస్తున్నాంగా! రేపు మాట్లాడాలి, 'చేతన' కార్యక్రమంలో. గోరా నవల మళ్ళీ చదివాను. మానవత్వమే తప్ప, మతం జీవితానికి ప్రాతిపదిక కాదని టాగోర్ చెప్తున్నాడు. గోరా ఎంత శక్తివంతమైన పాత్రో! కానీ, నాకు 'ఆనందమయి' అంటేనే ఇష్టం. నిజానికి ఆమె కరుణామయి. అమ్మతనానికి అంతకన్నా గొప్ప ఉదాహరణ ఉంటుందా? గోర్కీ 'నీలోవ్నా' ఉందనుకో!'

4. 'శ్రీకాంత్', 'గోరా', 'హోరీ', 'ధనియా', 'సూరదాసు', 'రామదాసు', 'పావెల్', 'రాస్కోల్నికోవ్', 'సోనియా', 'బజరోవ్', 'ఫిలిప్', 'శాంటియాగో', 'జాన్ క్రిస్టోఫ్'... ఎక్కడెక్కడి పుస్తక మానవులంతా కళ్ళముందు కనబడడం మామూలు ఛాదస్తం కాదు. తిండీ తిప్పలూ మానేసి, గంటల తరబడి పుస్తకాలలో మునిగి తేలడం... లోకం దృష్టిలో అచ్చమైన పిచ్చితనమే!

*(నీలో సగం)*

1. వనమాలీ, నిన్ను రెండుగా విడగొడితే, ఒక సగంలో పుస్తకం కనిపిస్తుంది; రెండో సగంలో కమలిని. పెళ్ళిచూపుల్లో 'అన్నా కరేనినా' గురించి అరగంట మాట్లాడావని కమలిని చెప్పినప్పుడు, అందరం నవ్వుకున్నాం.

2. 'జీతంలో సగం పుస్తకాలకే అయిపోతుందన్నయ్యా' ఫిర్యాదు చేస్తుంది కమలిని. నువ్వు నవ్వుతావు! తను మూతి ముడుస్తుంది. పొదుపరితనం తెలుసు తనకి!

3. పుస్తకాలు తరగతుల వారీగా సర్దేది కమలిని. పిల్లల్ని తాకనిచ్చేది కాదు. ఒక్కోసారి కావాలన్న పుస్తకం నీకు

దొరక్కపోతే, వెంటనే తీసి ఇచ్చేది. పుస్తకాలు చదవడంలో తనకంత ఆసక్తి లేదు. బహుశా ఆమె నిన్ను ప్రేమించడం చేత, నీ పుస్తకపఠనాన్ని కూడా ప్రేమించి ఉండాలి. గొప్ప మేధావిగా సమాజంలో నీకు గుర్తింపు రావడం కూడా తనకి సంతోషం కలిగించి ఉంటుంది. పైకేమో 'ఏదో నామీద జాలితో ఈ వంటింటిని మాత్రమే పుస్తకాలతో నింపకుండా వదిలేశారన్నయ్యా' అంటుంది.

'ఏ రోజూ రాత్రి పన్నెండు గంటలు కావాల్సిందే పడుకొనేపాటికి. రెండ్రోజులకొక పుస్తకం తినేస్తారు. ఏదడుగుదామన్నా పరాకే. ఆబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్‌గారు!'

4. నవంబర్ 19 రాత్రి, తుఫాను వచ్చి పోయిన సంగతి కూడా నువ్వు గమనించలేదని కమలిని చెప్పినప్పుడు నాకెంతో ఆశ్చర్యం కలిగించింది.

*(బుద్ధిజీవులు కార్యవాదులేనా?)*

1. దేశంలో the great degeneration మొదలైంది. గాంధీ, నెహ్రూల ఆదర్శాలకు కాలం చెల్లింది. అన్ని రంగాల్లోనూ విలువలు దిగజారుతున్నాయి. అవినీతి అందలమెక్కుతూ, వెర్రిజనాలకు నీతులు చెప్తోంది. అధికారగణం చేసిందే చట్టంగా చెల్లుబాటౌతోంది. అటువంటి సమయంలో దేశమంతా తిరిగావు.

   'ప్రజల్లో స్వార్థం ఉంది, అజ్ఞానం ఉంది, సహనం ఉంది, సహజీవనం ఉంది. దేశమంతా దారిద్ర్యం ఉంది. దాన్ని పోగొట్టాల్సిన రాజకీయరంగంలో మానసిక దారిద్ర్యం ఉంది' అనే అవగాహన వెల్లడించావు.

2. 'జ్ఞానం దేనికీ?' అన్న నీ ప్రశ్నలోనుంచి రాష్ట్రంలో 'చేతన' సంస్థ ఆవిర్భావం జరిగింది. అది నీ మూడో బిడ్డ. ప్రజల హక్కులు, కులమతాలు, స్త్రీల సమస్యలూ... రకరకాల అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించడం ఆ సంస్థ లక్ష్యం. నర్మదా బచావో ఆందోళనలో 'మేథా పట్కర్'ను కలిసావు. 'చిప్కో' ఉద్యమనేతను కలిశావు.

3. పర్యావరణ రక్షణ గురించి నీ కృషి నాకు తెలుసు. కొల్లేటి సరస్సు గురించీ, వలసపక్షుల గురించీ నువ్వు రాసిన వ్యాసాలు అపురూపమైనవి. అయితే, కొల్లేరు పొంగి, ఊర్లన్నీ మునిగిపోయినదాకా ఎవరికీ చీమైనా కుట్టలేదు. 'చేతన' పరిస్థితిని అధ్యయనం చేసింది. అందులో సభ్యుడుగా నువ్వు కొల్లేరు ప్రవాహానికి అటూ, ఇటూగా ఉన్న గ్రామాలు తిరిగావు. వేలకొద్దీ ఎకరాలు ఆక్రమణల పాలై, చేపల చేరువులై, కొల్లేరు సహజప్రవాహం భంగం కావడం, వానలు ముదిరినప్పుడల్లా గ్రామాలు మునిగిపోవడం, వివరాలన్నీ నివేదికలో చేర్చావు. పరిష్కార మార్గం సూచించావు. ఆ విధంగా విషయం కోర్టుకెక్కడం, సుప్రీంకోర్టు తీర్పు, ఆ తరవాత ప్రభుత్వం చేపట్టిన పనికి 'చేతన' ఊతం ఇచ్చింది. ఇవాళ కొల్లేరు ప్రక్షాళన జరిగి, వలస పక్షుల కిలకిలలు మళ్ళీ అక్కడ వినిపించినందుకు, వనమాలీ, నిన్ను మెచ్చుకోవాలి.

(తొలి చారిత్రక వ్యక్తి–ఒక జాతర)

1. మనం మర్చిపోయిన తొలి చారిత్రకవ్యక్తి 'బుద్ధుడు'. ప్రాణుల ఆనందం కోసం 'అష్టాంగమార్గం' కనుక్కున్నాడు. ఆ మార్గం నుంచి తప్పుకున్నాం. సమ్యక్ దృష్టి లేదు. సంయగాలోచన లేదు.

   కాలచక్ర ఉత్సవాలు. కృష్ణానదీ తీరం వేలమంది బౌద్ధభిక్షువులతో కళకళలాడుతోంది. అమరావతిలో కలిశాం. నువ్వూ, నేనూ, సతీష్. అతనికదే తొలిసారి అమరావతి రావడం. మ్యూజియంలో స్థూపం శిథిలాలు, ముఖ్యంగా ఎద్దుబొమ్మ చూసి మురిసిపోయాడు సతీష్. కృష్ణానది ఒడ్డున మనం ముగ్గురం. దూరంగా 'టిబెటిన్' భాషలో దలైలామా బోధన వినబడుతోంది.

'మర్చిపోవడం ఏంటి? ఇలాంటి సందర్భాలో తలచుకోవడం లేదా? ఎంతమంది జనం వచ్చారో చూడండి' అన్నాడు సతీష్.

'ఇదంతా జాతర; కాదంటే వేడుక. బుద్ధుణ్ణి నిజంగా మన మనసుల్లోకి ఇంకించుకున్నామా? ఇంకించుకుంటే మన కళ్ళముందు ఇంత హింస ఎందుకు జరుగుతుంది?' ఎదురుప్రశ్న వేశావు.

'అసలైన సంస్కృతికీ, మనకూ బంధం తెగిపోయింది. సంస్కృతిలోని పద్ధతులు, తంతులూ మాత్రమే మిగిలి, సారాంశం అంతరించిపోతున్న దశలో ఉన్నాం' అన్నావు. సాంస్కృతిక నేపథ్యం లేని రాజకీయ నాయకులవల్లనే క్రమక్రమంగా దేశపతనం ప్రారంభమైందని అన్నావు.

ఆ సాయంత్రం 'రాహుల్ సాంకృత్యాయన్' 'ఋగ్వేద ఆర్యుల' దగ్గరనుంచి, ధర్మానంద కోశాంబి 'బుద్ధ భగవానుడూ', రోమిల్లా థాపర్ 'ప్రాచీన భారతదేశం' దాకా భారతీయ సంస్కృతి గురించి ఎన్నెన్నో వ్యాఖ్యలు వివరించావు. మేమిద్దరం మౌనంగా విన్నాం. కృష్ణానది విన్నది. కనుచీకట్లో చుక్కల ఆకాశం విన్నది.

*(వారసత్వం)*

1. కమలినీ టీ.బీ.తో పోవడం నీ జీవితంలో గొప్ప దుఃఖం. ఎంత ప్రయత్నం చేసీ బతికించుకోలేకపోయావు. తోడు లేకుండా ఎలా బతకాలో తెలియని వాడివి. అందుకే కాబోలు, పోతూ పోతూ నిన్నెప్పుడూ వదిలిపెట్టొద్దని నాతో చెప్పింది. నువ్వు చిన్నపిల్లాడివని చెప్పింది.

2. 'లోపల పెద్ద అగాధం ఏర్పడినట్టనిపిస్తుంది. దేనితోనూ పూడ్చలేను. ఇప్పటిదాకా నా బతుకు ఆమె మీద ఎంత ఆధారపడి ఉందో తెలిసింది. నేనింకా ఎక్కువ కాలం బతకలేకపోవచ్చు. అయితే, నా జీవితం కన్నా, కమలిని మరణం గురించే విచారంగా ఉంది' నీ కళ్ళలో నీళ్ళు. ఓదార్చలేక పోయాను.

   చాలాసేపు విషాదమౌనం తరవాత తెగిపోయింది అన్నావు. నాకర్థం కాలేదు. ఏదో లోకంలో ఉండి మాట్లాడడం నీకు మామూలే. 'పిల్లలకీ నాకూ మధ్య బంధమేదో తెగిపోయింది. కమలిని ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు దాన్ని ముడేస్తూ ఉండేది. ఇప్పుడు ముడేసే తెలివి లేదు నాకు. నా అభిరుచులూ, వాళ్ళ పద్ధతులూ వేరైపోయాయి. ఆలోచనల్లో దూరం పెరిగింది. ఎప్పుడన్నా వాళ్ళు మాట్లాడినా ఏదో ముక్తసరిగా, పొడిగా ఉంటున్నాయి మాటలు.' కావలసిన మనుషుల మధ్య భావప్రసారం లేనప్పుడు కలిగే వేదనను అర్థం చేసుకున్నాను.

3. దేశమంతా పర్యటిస్తూ, సాహిత్య, సామాజిక అంశాలమీద ప్రసంగిస్తున్నావు. 'చేతన' కార్యకలాపాలు పరిమితంగా సాగుతున్నా, నీ పేరు మాత్రం మారుమోగిపోయింది. ఇండియా టుడే దేశంలోని వందమంది మేధావులను ఎన్నిక చేసింది. అందులో నువ్వు పదకొండో స్థానంలో ఉన్నావు. ఎంత సంతోషం! ఈ సమయంలో కమలినే గనుక ఉండుంటే!

   హైదారాబాద్ 'రవీంద్ర భారతి'లో నీకు సన్మానం చేస్తూ, నువ్వు నడిచే విజ్ఞానకోశానివని అందరూ ప్రశంసిస్తుంటే, ఈ విజ్ఞానకోశానికి వారసత్వం ఏమిటి? అనే సందేహం కలిగింది. నీ జ్ఞానం నీతో ముగిసిపోవలసిందేనా?

4. కూతురు రాసిన ఉత్తరం చదవమని నా చేతికిచ్చావు.

   డాడీ,

   నువ్వు గొప్పవాడివి కావచ్చు. కానీ పిల్లల్ని గొప్పవాళ్లని చెయ్యాలిగా. సాటివాళ్ళంతా ఆర్థికంగా మెట్టుమెట్టు

పైకెదిగిపోతుంటే, నువ్వు అప్పటికీ, ఇప్పటికీ అదే మెట్టుమీద కూలబడి దిక్కులు చూస్తున్నావు. అదే మెట్టు మీద ఉన్నవాళ్లకి నన్నిచ్చి చేశావు. ఏం సుఖపడ్డాను? చాలీచాలని బతుకు. ఏ కోరికలూ తీరవు. ఎన్నటికీ పైమెట్టు ఎక్కలేని నిస్సహాయత. నిన్నిప్పుడు ద్వేషించలేను... అలాగని ప్రేమించనూ లేను!

మీ కూతురు

విమల

మెట్టంటే ఏమిటి? అని అడిగావు ఉత్తరం నేను చదవగానే. 'ఆర్థిక సోపానాలు తప్ప, ఇంకేమీ లేవా మనకి?'

ఎంతోమంది దృష్టిలో మెట్లంటే అవే! అవి ఎక్కడానికే నిరంతరం మన ప్రయత్నం. విజ్ఞానం, వివేకం, సామాజిక పాత్ర... ఇటువంటి మెట్లెక్కడానికి పూనుకునేవాళ్ళు ఇవాళ వెర్రివాళ్ళ కిందే లెక్క! అయితే, అందరి మాదిరిగా, కళ్ళు మూసి తెరిచేలోగా, ఆ మెట్లేవో ఎక్కలేనందుకు నువ్వు విచారపడుతున్నట్టు లేదు.

'నేనున్న మెట్టు మీద... నన్ను నన్నుగా... నా కన్నకూతురు ఆమోదించలేకపోయింది' అన్నావు దిగులుగా.

5. కొడుకు గురించి ఇంకో విచారం.

'వాడు ఖండాలు దాటి వెళ్లిపోయాడు. కమలిని వాడ్ని చాలా ముద్దు చేసేది. 'యాహూ' సామ్రాజ్యంలో, ఇవాళ వాడొక బంటు. బోలెడంత సంపాదన. కానీ, వాడికి అమ్మతోనైనా తనివితీరా మాట్లాడే సమయం లేదు. ఉన్నంత కాలం కమలినికి అదే దిగులు. మనుషులు అనంత దూరంలో ఉన్నా మనసును తాకుతూ మాట్లాడొచ్చు. దూరం కావడమే మనకు తెలుసు. దూరంగా ఉండీ, దగ్గర కావడం తెలియదు.'

'కావచ్చు. కానీ, నీ వారసత్వం నీ సంతానం స్వీకరించ లేకపోవడం పెద్ద విషాదం వనమాలీ...'

*(అంతిమ అనివార్యత)*

1. జీవితంలో అంతిమ అనివార్యత మృత్యువు. దాన్ని నువ్వు ఆమోదించిన తీరు గొప్పది.

వరుసగా కొన్ని రోజులు మోర్నింగ్‌వాక్‌కి నువ్వు రాకపోయేసరికి నాకు అనుమానం వచ్చి ఫోన్ చేశాను. పనిపిల్ల ఆందోళనగా చెప్పింది, నీ అనారోగ్యం సంగతి. తెల్లారే నిన్ను కలిశాను.

ఒకవంక నీకిష్టమైన పాట వింటున్నావు.

'యహా పురా ఖేల్ అభీ జీవన్ కా, తూనే కహాహై ఖేలా, చల్ అకేలా, చల్ అకేలా...' ముఖేష్ గొంతు విషాదాన్ని వొంపుతోంది.

మూత్రవిసర్జనలో బాధ గురించీ, డాక్టర్లు చేసిన పరీక్షల గురించీ చెప్పావు. ప్రోస్టేట్ గ్రంథి సమస్య. 'కమలిని లేని లోటు ఇప్పుడు బాగా తెలుస్తుంది.' అన్నావు. నిజమే, ఆ చల్లని ప్రశాంతమూర్తి ఇప్పుడుంటే నీ అనారోగ్యం సగం తగ్గిపోయేదే.

2. కాలిఫోర్నియా నుండి నీ కొడుకు పరామర్శ. ఏలూరు నుండి నీ కూతురు. ఎవరూ వెంటనే వచ్చే వీలులేదు.

3. జబ్బు తీవ్రమైనదని తెలుసు. అయినా నువ్వు ఏమాత్రం భయపడకపోవడం ఆశ్చర్యం. పి.ఎస్.ఏ. పరీక్షల్లో ప్రోస్టేట్ గ్రంథి

పూర్తిగా వ్యాధిగ్రస్తమైందని తేలింది. సర్జరీ జరిగింది. అయినా జబ్బు ముదరడం వల్ల, పెద్దగా ప్రయోజనం ఉండదని డాక్టర్లు నీముందే చెప్పారు.

4. స్నేహితులూ, అభిమానులూ, పాత విద్యార్థులూ వచ్చి పరామర్శిస్తున్నారు. 'చేతన' కొనసాగిస్తామని స్నేహితుల దగ్గర మాట తీసుకున్నావు. పైకి నిమ్మళంగానే ఉన్నా లోపల్లోపల దేని గురించో ఆందోళన పడుతున్నట్టు తోచింది. రెండుమూడు రోజుల్లో కూతురు వస్తున్నట్టు కబురు.

5. సాయంత్రం నీ దగ్గరకు వచ్చాను.

'స్టీఫెన్ హాకింగ్' పేరు విన్నావా? అని అడిగావు.

'పెద్ద సైంటిస్టు కదా'

'అతని 'స్ట్రింగ్ థియరీ' సరిగ్గా అర్థం కాలేదు. 'బ్లాక్‌హోల్స్ ఎండ్ స్మాల్ యూనివర్సెస్' కూడా. అతను ఐన్‌స్టీన్ కంటే గొప్పవాడంటావా?'

నువ్వున్న పరిస్థితేంటో నీకర్థమైందా వనమాలీ! నిర్లిప్తుడా!

'కన్ఫెషన్స్ ఆఫ్ ఎన్ ఎకనామిక్ హిట్ మన్' పుస్తకం ఎక్కడైనా దొరికితే తెచ్చిపెడుదూ' అని అడిగావు.

సామ్రాజ్యవాద రథాశ్వం... 'జాన్ పెర్కిన్స్'... అమెరికా ప్రయోజనాల కోసం దేశదేశాల్లో ఎన్నో తప్పుడు పనులు చేసి, పశ్చాత్తాపం పొందినవాడు... అతని పుస్తకం.

6. పక్కనెవరూ లేరు. తీవ్రమైన అనారోగ్యం. నీ మొహంలో అదే నిర్లిప్తత. కాలిఫోర్నియా నుంచి నీ కొడుకు వస్తున్నట్టు ఫోను. ఈ దేశంలో ఉన్నా, కూతురింకా రాలేదు. కమలిని గుర్తొస్తుందన్నావు. తలగడ పక్కనే 'జాన్ పెర్కిన్స్' పుస్తకం, బోర్లా తెరిచిపెట్టి!

7. నీ నా స్నేహంలో కొన్ని గుర్తులివి.

నా జ్ఞాపకాలన్నీ విన్న తరవాత కదిలీ కదలని పెదాల్లో నుంచి ఇప్పుడీ ప్రశ్న వేశావు.

'సముద్రాన్ని ఎక్కడ పారబొయ్యాలి?'

నాకు అర్థం కాలేదు. గదంతా కలియజూస్తున్నాను. అన్నివైపులా పుస్తకాల దొంతర్లు. రాక్స్, బీరువాలు... ఎటుచూసినా పుస్తకాలే! అలలు అలలుగా... నీ లోపలనుంచి ఏదో పెద్ద హోరు!

వనమాలీ, ఇప్పటికీ నీ ప్రశ్న అర్థమైంది. జవాబు మాత్రం నా దగ్గర లేదు!!

*(ఆంధ్రజ్యోతి, ఆదివారం 4 ఫిబ్రవరి 2007నుండి పునర్ముద్రణ)*



# చిచ్చుబుడ్డి

వాసిరెడ్డి సీతాదేవి

**కథా మార్గదర్శి కథ**

***అంతే... నరసిమ్మ చేతులో కాలక ఇబ్బంది పెడుతున్న తాటాకు టపాకాయల్ని దూరంగా విసిరికొట్టాడు. తను చిచ్చుబుడ్డి వెలిగించబోతున్నాడు. ఉత్సాహంగా జారిపోతున్నలాగూను పైకి గుంజుకుంటూ, రయ్యిన చిచ్చుబుడ్డి దగ్గరకు వచ్చి చిచ్చుబుడ్డి ముందు కూర్చున్నాడు.***

భూషయ్యగారి రెండతస్తుల మేడ ముందు బుస్సున లేచింది పెద్ద చిచ్చుబుడ్డి! అది వెలిగించిన భూషయ్యగారి పెద్ద కూతురు రాధ ఒక్కసారి వెనక్కి వచ్చి నిల్చుంది. చిచ్చుబుడ్డి పైకి ఉవ్వెత్తున లేచిన వెలుగు పూలు అనేక రంగుల్ని విరజిమ్ముతున్నాయి!

మేడ పిట్టగోడల మీదా, గూళ్ళలోనూ పెట్టిన ప్రమిద దీపాలు వెలవెలపోతున్నాయి. ఆ వెలుగులో అక్కడ ఉన్నవారి కళ్ళు పచ్చగా, నీలంగా, తెల్లగా, ఎర్రగా కన్పిస్తున్నాయి. చిచ్చుబుడ్డి ఆరిపోయింది!

ఆనాటి అమావాస్య చీకటి, భూషయ్య ఇంటి ముందు నుంచి పారిపోయి, ఎదురుగా ప్రహరీ గోడకు చేరబడి కూర్చుని ఉన్న పోచయ్య కళ్ళల్లో దాక్కుంది!

పోచయ్య చూస్తున్నాడు. కాకరపువ్వొత్తి వెలిగించి దూరంగా పట్టుకొని, పక్కన నిల్చుని చూస్తున్న భర్తతో ఏదో అని, కిలకిల నవ్వుతున్న భూషయ్యగారి పెద్ద కూతుర్ని చూశాడు. ముత్యాల మతాబా వెలిగించి ఆ వెలుగులో, మతాబాలా సంతోషంతో వెలిగిపోతున్న భూషయ్యగారి రెండో పిల్లను చూశాడు. పువ్వొత్తి కాలుస్తున్న మూడోదాన్ని, అవుట్ పేలుస్తున్నఅల్లుణ్ని, తూటా తిప్పుతున్న పెద్ద కొడుకునీ, చిచింద్రీలు కాలుస్తున్న రెండో కొడుకునీ మార్చిమార్చి చూశాడు పోచయ్య! చంటిదాన్ని చంకన వేసుకొని, దబ్బనానికి తెల్ల మతాబా గుచ్చి కాలుస్తున్న భూషయ్యగారి భార్య భ్రమరాంబనూ చూశాడు.

భూషయ్య వాలు కుర్చీలో కూర్చుని చేబ్రోలు పుగాకు చుట్ట కాలుస్తున్నాడు. తన సంతానాన్ని చూసుకొని మురిసిపోతున్నాడు.

దూరంగా భూషయ్యగారి చిన్న జీతగాడు, దుమ్ముపట్టిన తాటాకు టపాకాయల్ని కాల్చడానికి సతమతమైపోతున్నాడు.

దీపాలతో అలంకరించబడిన భూషయ్యగారి భవనం దేదీప్యమానంగా వెలుగుతోంది. తనచుట్టూ ఆవరించుకుని మింగేయబోతున్న చీకటిని దీపాల వెలుగు తరిమేసింది. ఆ వెలుగులో దొడ్లో ఉన్న కొత్తగా అర్రు చేసిన కోడెదూడలూ, నడికారు

గిత్తల జత, పాడి ఆవులూ, గేదెలూ, దూడలూ, మతాబాల కాంతుల్లో వెలిగిపోతున్న భవనాన్ని మోరలు పైకెత్తుకొని చూస్తున్నాయి. చీకట్లో మిలమిలలాడే వాటి కళ్ళు వెలుగులో తెల్లగా కాంతిహీనంగా కన్పిస్తున్నాయి. ఆ వెలుగుకూ, మోతలకూ భయపడిపోయిన బొచ్చుకుక్క మెల్లా ఇంట్లో అరుస్తూ పరుగులు తీస్తున్నది!



పోచయ్య నరసిమ్మను చూస్తున్నాడు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. తలకు చుట్టుకున్న తువాలు లాగి కళ్ళు తుడుచుకున్నాడు. భూషయ్యగారి అల్లుడు భార్యను అవుట్ పేల్చడానికి ముందుకు రమ్మంటున్నాడు. రాధ రెండడుగులు ముందుకు వేసి “నాకు భయం బాబూ!” అంటూ వెళ్ళి గడపలో పై మెట్టుమీద నిల్చుంది.

పట్టుచీరల బరబరల్లో ఆడపిల్లల కిలకిలలు కలిసిపోతున్నాయి. కప్పగంతుల చిటపటలకు చిన్నపిల్లలు కుప్పిగంతులు వేస్తున్నారు. మధ్యమధ్య పెద్దవాళ్ళు పిల్లల్ని జాగ్రత్త అంటూ హెచ్చరిస్తున్నారు.

ఆ రోజు షావుకారు భూషయ్యగారి ఇంటిముందు ఆనందం పందిరి వేసింది. సంతోషం పొంగిపొర్లింది. ఉత్సాహం పరుగులు తీస్తోంది.

భూషయ్యగారి మతాబుల వెలుగుల్లో, చిచ్చుబుడ్ల కాంతుల్లో, టపాసుల మెరుపుల్లో, తన సంతానాన్ని, దొడ్లో ఉన్న పశు సంపదనూ, రెండు అంతస్తుల మేడను, చీకటి కొట్లల్లో ఉన్న ధాన్యపురాసుల్ని, ఇనప్పెట్లో మూలుగుతున్న కరెన్సీనోటుల్నీ, ఇనుప భోషాణంలో ఉన్న కుదువ నగ కట్టునూ, మనసుతోనే చూసుకుంటూ భూషయ్య సంతృప్తిగా చుట్టపొగ వదులుతున్నాడు.

భూషయ్య గారు నిర్మించుకొన్నస్వర్గానికీ, సంపదకూ కాపలా కాస్తున్నఆ ఎత్తైన ప్రహరీగోడల తాలూకు చీకటినీడల్ని ఉత్తరం పక్కన ఉన్న తుమ్మల బీడును ఆవరించినై.

ఆ ప్రహరీగోడకు చేరబడి కూర్చుని ఉన్న పోచయ్య గుండెల్ని చీల్చుకుంటూ ఏదో మూలుగు బయట పడడానికి ప్రయత్నిస్తోంది.

భూషయ్యగారితో పోల్చి చూస్తే, పోచయ్య ఒక చీమ లేక దోమగా కన్పిస్తాడు. మేడపైకి ఎక్కిచూస్తే తుమ్మల బీడులో ఉన్న అతని గుడిసె కోళ్ళగూడులా కన్పిస్తుంది.

భూషయ్య పని చేయించుకునేవాడు... పోచయ్య పని చేసేవాడు! భూషయ్య భోగభాగ్యాలు అనుభవించడానికి

పుడితే, పోచయ్యలు అతని సంపదను పెంచడానికే పుట్టారనీ, వీరిద్దరి మధ్య ఉన్న సంబంధాన్ని, వాళ్ళు వాళ్ళు బతుకుతున్న సమాజం, సాంఘిక వ్యవస్థ నిర్ణయించింది. కర్మ సిద్ధాంతాన్ని బోధించింది.

"నాన్నా ఆ చిచ్చుబుడ్డిని నేను వెలిగిస్తాను." అన్నాడు భూషయ్యగారి రెండో కొడుకు గారాలు కుడుస్తూ.

అంతవరకూ మోకాళ్ళ మధ్య తల ఇరికించుకొని కూర్చున్న పోచయ్య, చివ్వున తలెత్తి చూశాడు. అతని లోతుకు పీక్కుపోయిన కనుగుంటల్లో నీరు నిలిచింది. లోపల ఏదో కదిలింది. కనిగుంటల నుంచి పోచయ్య ఎండిపోయిన చెంపల మీదుగా కిందకు జారి గుండెను తడుపుతున్నది. గుండెలో ఏదో కస్సున దిగినట్టు విలవిలలాడిపోయాడు. పోచయ్య మనసు కాలప్రవాహం ఓ సంవత్సరం వెనక్కుపోయింది.

★★★

సరిగ్గా సంవత్సరం క్రితం... ఇదేరోజు... దీపావళి రోజు పోచయ్య కొడుకు యాదగిరి చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

చిన్నబ్బాయి తాలూకు చిరిగిపోయిన ఒక నిక్కరు భూషయ్య భార్య యాదగిరికి ఇచ్చింది. అది తొడుక్కుని

తండ్రి కుట్టించిన షర్టు వేసుకొన్నాడు. ఆ రోజు వాడిని చూసి పోచయ్య మురిసిపోయాడు. అంత సంతోషంలో

పోచయ్యకు సుబ్బి గుర్తొచ్చి కంట నీరు పెట్టుకున్నాడు. దానికి కొడుకు అచ్చట ముచ్చట చూసుకొనే అదృష్టం లేనందుకు బాధపడ్డాడు. సుబ్బి వాణ్ణి కని, ఏడోనాడు కన్ను మూసింది. పసిగుడ్డు బాధ్యత అతని చేతుల్లో

పెట్టి వెళ్ళిపోయింది.

యాదగిరి పన్నెండేళ్ళు. పోచయ్య గుండెల మీద అతని ప్రాణాల్లో ప్రాణంగా పెరిగాడు.

గూడెంవాళ్ళు పట్నం పోయి ఫ్యాక్టరీలో పని చేసుకుందాం అన్నారు. చాలామంది వెళ్ళిపోయారు. పోచయ్య

మాత్రం భూషయ్యగారి కొలువు వదలడానికి ఇష్టపడలేదు. సుబ్బి భూషయ్య గారింట్లోనే పని చేసేది. వాళ్ళ

కాళ్ళ దగ్గర పడి ఉంటేనే తన కొడుక్కు ఇంత ఆసరా దొరుకుతుందని భావించాడు పోచయ్య. యాదగిరి ఎనిమిదేళ్ళ వయసు నుంచే భూషయ్య గారింట్లో చిన్నచిన్న పనులు చెయ్యసాగాడు. పన్నెండు ఏళ్ళు నిండాయి!

చీకటితో లేచి చీపురు తీసుకుంటే చద్ది బువ్వ తాగే వేళదాకా ఊడుస్తూనే ఉండేవాడు. గొడ్ల సావిడి శుభ్రం చేసే

వాడు. సద్ది అన్నం తిని, దొరసానమ్మ కట్టిచ్చిన వేడి అన్నం మూట భుజాన వేసుకొని గొడ్లను తోలుకొని

వెళ్ళేవాడు. మధ్యాహ్నం గొడ్లను చెర్లోకి తోలి, చెట్టు కింద కూర్చుని అన్నం మూట విప్పేవాడు. గొడ్డుకారం పచ్చడితో ముద్దలుచేసి ఉసిళ్ళు తోలుతూ తినేవాడు. సాయంకాలం ఇంటికి రాగానే భూషయ్యగారి పిల్లలు

తలొక పని పురమాయించేవారు. అందరి భోజనాలూ అయాక భ్రమరాంబ యాదగిరిని గిన్నె కడుక్కోమని చెప్పేది. వాడు అరగంటముందే గిన్నె కడుక్కొని, పచ్చగడ్డి మోపుమీద కూర్చుని ఖాళీ గిన్నెలోకి చూస్తూ కునికిపాట్లు పడేవాడు. నిద్రమత్తులో ఉన్న వాడి జిహ్వకు రుచి తెలిసేది కాదు. గిన్నె కడిగి గొడ్ల సావిట్లో ఓ మూల బోర్లించి వరిగడ్డి మీద గోనెసంచి పరచుకొని, తండ్రి మొల పంచ ముసుగు బిగించి నిద్రలోకి జారిపోయేవాడు. బాగా పొద్దు పోయివచ్చి పోచయ్య కొడుకు పక్కనే పడుకొనేవాడు. తండ్రి దగ్గరగా ఒదిగి వెచ్చగా పడుకున్న యాదగిరికి ఒకోసారి మెలుకవ వచ్చేది. మెల్లగా లేచి వెళ్తున్న తండ్రిని చూసి "అయ్యా! ఎక్కడికే ఇంత సీకట్లోకి?" అనేవాడు. ఉత్తరపు పొలం అరక్కు వెళుతున్నాననో, దక్షిణ పొలానికి ఎరువు తోలుకెళ్ళాలనో, పొగ తోటకు నీళ్ళు పొయ్యాలనో, నారుమడికి నీరు కట్టబోతున్నాననో చెప్పేవాడు!

యాదగిరికి మళ్ళీ కునుకుపట్టగానే భ్రమరాంబ వాణ్ణి నిద్ర లేపేది. దొరసానమ్మగారి కేకకు ఉలిక్కిపడి బిళ్ళంగోడులా లేచి చీపురు కట్ట తీసుకొనేవాడు. చద్దిఅన్నం తిన్నాక, గొడ్లను విడిచి పొలం తోలుకెళ్ళటం, సందె చీకటి వేళ గొడ్లను మళ్లేసుకొని ఇంటికి చేరడం, రాత్రి బాగా పొద్దు పోయిందాకా చిన్న పనీ, పెద్ద పనీ చెయ్యడం, కునికిపాట్లు పడుతూ ఇంత తిని వరిగడ్డి వెచ్చదనంలో నిద్రపోవడం, తెల్లవారు జామున నాలుగు గంటలకే ఆ లంకంత ఇల్లు చిమ్మడానికి చీపురు చేతిలోకి తీసుకోవడం... ఇదీ భూస్వామి భూషయ్య గారింట్లో పన్నెండేళ్ళ యాదగిరి దైనందిన కార్యక్రమం! యాదగిరి మీద ఆశ పెట్టుకుని పోచయ్య భూషయ్యగారి పనిలో రెక్కలు ముక్కలు చేసుకొంటూ గడుపుకొచ్చాడు.

పండగ నాలుగు రోజులుండనగానే తండ్రిని మందు సామాను కొనమని మారాం చేశాడు. పోచయ్య పండుగ రోజు సాయంకాలం ఓ పాతిక తాటాకు టపాకాయలు కొని ఇచ్చాడు. భూషయ్యగారు తన పిల్లలకు తెచ్చిన మందు సామాన్లలో ఒకటో రెండో యాదగిరికి ఇస్తాడని పోచయ్యకు తెలుసు. అయినా తన సంతృప్తి కోసం రెండురోజులు పుగాకుకాడ కొనకుండా తాటాకు టపాకాయలు కొన్నాడు.

అయ్య తెచ్చిన టపాకాయలు లాగు జేబులో పెట్టుకుని ఉత్సాహంతో గంతులువేశాడు. అప్పుడొకటి అప్పుడొకటి, సాయంత్రం ఆరునుంచే టపటప మోగించసాగాడు.

చీకటి పడింది!

భూషయ్యగారి దివ్యభవనం దీపాలతో వెలిగిపోతున్నది. అతని పిల్లలు మందుసామాగ్రి కాలుస్తున్నారు!

యాదగిరి, చిన్నబ్బాయి, చిన్నమ్మాయి పక్కనే చేరి మతాబులు కాలుస్తుంటే వాళ్ళకు ఉత్సాహాన్నిస్తూ, తనే

కాలుస్తున్నట్టు ఆనందపడిపోతున్నాడు. విష్ణుచక్రం తిరుగుతుంటే వాడి కళ్ళు కూడా ఆనందంతో అలాగే తిరిగేవి. పువ్వొత్తులు కాలుస్తుంటే 'బలే! బలేగా కాలుతుంది బుల్లి అమ్మాయి గోరూ' అంటున్నాడు.

పోచయ్య దూరంగా కూర్చుని కొడుకు గంతులు చూస్తూ సంతృప్తిగా నవ్వుకుంటున్నాడు.

"నాన్నోయ్! యాటంబాబు కాల్చబోతున్నాను" అంటూ భూషయ్యగారి పెద్దబ్బాయి దానికి భయం భయంగా

నిప్పు అంటించి దూరంగా పరిగెత్తుకొచ్చినిల్చున్నాడు. యాదగిరి రెండు చేతులతో చెవులు మూసుకొని కుతూహలంగా చూస్తున్నాడు. చెవుల మీద వున్న చేతుల్నిమధ్య మధ్య తీస్తున్నాడు. ఎంత సేపటికీ ఆటం బాంబు పేలలేదు. ఆటం బాంబు దగ్గరకు వెళ్ళబోతున్నపెద్ద కొడుకుని "ఒరేయ్! నువ్వెళ్ళకు? అని చెయ్యి పట్టుకొని వెనక్కు లాగింది భ్రమరాంబ.

"ఒరేయ్ యాదా! నువ్వెళ్ళి చూడరా!" అన్నాడు ఈజీచైర్లో కూర్చొని చుట్ట కాలుస్తూ భూషయ్య.

యాదగిరి ఒక్క గంతులో దాని దగ్గరకు వెళ్ళి ముఖం వంచి ఊదబోయాడు... "ఢాం ఢాం!" భూషయ్యగారి మేడ ప్రతిధ్వనించింది.

యాదగిరి కెవ్వున కేక వేసి విరుచుకుని పడిపోయాడు. పేలిపోయిన బాంబు తాలూకు పెంకులూ, ముక్కలూ

చెల్లాచెదురుగా పడిఉన్నాయి. యాదగిరి జేబులో నుంచి మిగిలిన తాటాకు టపాకాయలు తొంగి చూస్తున్నాయి.

అందరూ యాదగిరి చుట్టూ చేరారు.

కోడెకు ఉలవలు పెడుతున్న పోచయ్య ఒక్కసారిగా పరుగుతీశాడు. పిచ్చిగా అరుస్తూ స్పృహతప్పి పడిఉన్న కొడుకుని రెండు చేతులతో తీసుకున్నాడు. భూషయ్యగారు డాక్టర్ను పిలిపించారు. యాదగిరి కనురెప్పలు కాలిపోయాయి. ముఖం అంతా బొబ్బలతో భయంకరంగా ఉన్నది. మూడు రోజులు యాదగిరి మూసిన కన్నెరక్కుండా పడి ఉన్నాడు. నిద్రాహారాలు మాని పోచయ్య కొడుకునే కనిపెట్టుకొని కూర్చున్నాడు.

యాదగిరికి కొంచెం స్పృహ వచ్చినప్పుడల్లా "అయ్యా! నా టపాకాయలు ఏవే!" అని అడిగేవాడు కళ్ళు తెరవకుండానే!

యజమానురాలి ఓదార్పులు, డాక్టరు మందులూ పోచయ్య గుండె మంటను ఆర్పలేకపోయాయి. నాలుగో రోజు యాదగిరి పన్నెండేళ్ళ వయసులో జీవితాన్ని విడిచి వెళ్ళిపోయాడు. పోచయ్య గుండెలోని ఆ ఒక్క దీపం ఆరిపోయింది. అతని చేతుల్లోనే కొడుకు శాశ్వతంగా కళ్ళు మూశాడు.

పోచయ్య భూషయ్యగారి ఇంటిని వదిలేసి వెళ్ళిపోవాలనుకున్నాడు. కాని వెళ్ళలేకపోయాడు. తన కొడుకు

తిరిగినచోటు అది. ఒకప్పుడు తన బిడ్డ భవిష్యత్తు గురించి అక్కడే ఎన్నో కలలు కన్నాడు. పోచయ్యను యజమానీ, అతని భార్య సానుభూతితో ఆదరించారు.

యాదగిరి తిరిగిన ఆ నేల, వాడు ఊడ్చి ఎత్తిన ఆ ఇల్లు, వాడు పడుకున్నచోటు, వాడు అన్నం తిన్న గిన్నె, గొడ్లను కాయడానికి ఉపయోగించిన చిన్నకర్ర... చూస్తుంటే పోచయ్యకు కళ్ళల్లో కొడుకు తిరుగుతున్నట్టే అన్పించేది.

యాదగిరి పోయాక, ఒక సంవత్సరం...పన్నెండు నెలలు... మూడు వందల అరవై రోజులు! ఎలా గడిచాయో

పోచయ్యకే తెలియాలి! ఈ రోజులన్నీ ఎంత చీకట్లో గడిపాడో వెలుగు ఆరిపోయిన అతని కళ్ళకే తెలియాలి! యంత్రంలా అన్నిపనులూ చేసుకుపోతూనే ఉన్నాడు.

భూషయ్యగారు ఈ ఒక్క సంవత్సరంలోనే మరో ఐదెకరాల మాగాణి, రెండెకరాల గరువు కొన్నాడు. అతని

భార్య మరో పిల్లను కన్నది. దానికిప్పుడు ఆరు నెలలు.

యాదగిరి స్థానాన్ని నరసిమ్మ ఆక్రమించాడు. నరసిమ్మకు పదమూడో ఏడు నిండబోతున్నది. ఇప్పుడు నరసిమ్మ భూషయ్యగారి చిన్న జీతగాడు!

★★★

"ఒరేయ్ చిన్నోడా నువ్వాగరా!" చిచ్చుబుడ్డి దగ్గరకు వెళ్ళబోతున్న చిన్నకొడుకుని వారించింది భ్రమరాంబ.

"ఒరేయ్ నరిసిగా, ఆదేందో నువ్వు చూడరా!" నోటిలో ఉన్న చుట్టను తీసి, చిన జీతగాడితో అన్నాడు యజమాని భూషయ్య.

అంతే... నరసిమ్మ చేతులో కాలక ఇబ్బంది పెడుతున్న తాటాకు టపాకాయల్ని దూరంగా విసిరికొట్టాడు. తను

చిచ్చుబుడ్డి వెలిగించబోతున్నాడు. ఉత్సాహంగా జారిపోతున్న లాగును పైకి గుంజుకుంటూ, రయ్యిన చిచ్చుబుడ్డి దగ్గరకు వచ్చి చిచ్చుబుడ్డి ముందు కూర్చున్నాడు.

పోచయ్య అంతకంటే వేగంగా అక్కడికి వచ్చాడు. చిచ్చుబుడ్డి మీదకు వంగి ఊదబోతున్న నరసిమ్మను

ఒక్క తోపు తోసి తను కూర్చున్నాడు.

"పోచయ్యా నువ్వూరుకో! నువ్వూరుకో! పెద్దవాడివి నువ్వేం అవస్థ పడతావ్?" భ్రమరాంబ మాటలు పూర్తి

కాలేదు ఇంకా పోచయ్య చిచ్చుబుడ్డిమీద ముఖం పెట్టి గట్టిగా ఊదాడు.

బస్సున లేచింది చిచ్చుబుడ్డి!

ఆ మంటల్లో, నిప్పుల వర్షంలో, పోచయ్య కళ్ళు అగ్నిగోళాల్లా ఓసారి మెరిసి మూసుకుపోయినై! ఆ చిచ్చు మంటల్లో పోచయ్య బట్టలతో పాటు శరీరం భగ్గుమన్నది.

సంవత్సరం కాలంగా పోచయ్య గుండెల్లో ఆరకుండా దహిస్తున్న ఆ మంట ఆరిపోయింది!

అతని గుండె చిచ్చు శాశ్వతంగా ఆరిపోయింది!

భూషయ్యగారి దివ్య భవనం మీద నేలకు ఒరిగిపోతున్న పోచయ్య భౌతిక దేహం తాలూకు నీడలు

వ్యాపించాయి.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక 1981 నుండి పునర్ముద్రణ)*



**సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్**
**న బ్రూయాత్ సత్యమప్రియం**
**ప్రియాంచ నానృతం బ్రూయాత్**
**ఏష ధర్మః సనాతనః**

నిజం చెప్పాలి. ప్రియమైనది చెప్పాలి. రుచించని సత్యాన్ని చెప్పవద్దు.
సంతోష పెట్టేందుకు అబద్ధం చెప్పవద్దు. ఇది సనాతన ధర్మం.
సనాతన ధర్మమంటే ఇంతకన్నా క్లుప్తంగాను, విశదంగాను ఎవ్వరూ చెప్పలేరు.
ఇది మంచి, ఇది చెడు, ఇది చెయ్యి , ఇది చెయ్యవద్దు. అంతేగా. ఇందులో తప్పు పట్టాల్సిందేముంది?
దేశంలో ఈమధ్య సనాతనధర్మంపై చాలా విద్వేషకరమైన చర్చ జరిగింది. అది రాజకీయం. మనకెందుకులెండి.

కథల సమాహారంలో ఈ సనాతనధర్మ ప్రస్తావన దేనికి? అన్న అనుమానం ఎవరికో ఒకరికి రావచ్చు.
రామాయణ, మహాభారత, భాగవతాలు, భగవద్గీత, బైబిల్, ఖరాన్ లు ..
ఈ ఉద్గ్రంథాలన్నీ కథల సమాహారములే.

అవన్నీ ఏం చెప్పాయి "నిజం చెప్పాలి. ప్రియమైనది చెప్పాలి. రుచించని సత్యాన్ని చెప్పవద్దు.
సంతోష పెట్టేందుకు అబద్ధం చెప్పవద్దు." అంతేగా...!

అందుకనే కథలకు కూడా కొన్ని ధర్మాలున్నాయని కథకులు విశ్వసించారు.
అవి సనాతనమే కాదు... నిత్యనూతనం కూడా.

ఆ ధర్మాన్ని ఆచరిస్తూ తరతరాలుగా కథలు ఎప్పుడూ పాఠకులకు నిజమే చెప్పాయి, ప్రియమైనవే చెప్తున్నాయి,
సంతోషపెట్టడానికి అబద్ధాలెప్పుడు చెప్పలేదు.

నిజాన్ని చెప్పే, ప్రియాన్ని పంచే, సంతోషాన్ని పెంచే కథలకు ఆవాసం "కథామంజరి".
చదవండి... చదివించండి.